అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 2-08-2024


సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 214 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కార్మిక, కర్షక పక్షం నిలిచే పత్రిక

పీడితవర్గాల ఆశాజ్యోతికి

వార్షికోత్సవ శుభాకాంక్షలు : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగులు, జర్నలిస్టులు, యాజమాన్యానికి శుభాకాంక్షలు, అభినందనలు. ప్రజాశక్తి నుంచి నవతెలంగాణ వరకు ఇది ప్రజల కోసం పనిచేస్తున్న పత్రిక.

9వ వార్షికోత్సవం

2లో

ప్రజల పత్రికను ఇదే స్ఫూర్తితో నడిపించాలి

శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమస్యలను ప్రచురించి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తెచ్చి ప్రజాపత్రికగా నడుస్తోంది. నవతెలంగాణ తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు.

ఫోర్త్ సిటీగా బేగారి కంచ

● యువతే లక్ష్యంగా స్కిల్ యూనివర్సిటీ ● వృత్తి నైపుణ్యానికే తొలి ప్రాధాన్యం

- న్యూయార్క్ కంటే అద్భుతంగా ముచ్చర్లను తీర్చిదిద్దుతాం
- ప్రపంచ పర్యాటక కేంద్రంగా మహేశ్వరం మారబోతుంది
- భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటాం:యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఫోర్త్ సిటీగా బేగరి కంచ మారబోతున్నదని, ముచ్చర్లను న్యూయార్క్ కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అడ్మిషన్ వస్తే చాలు.. ఉద్యోగం గ్యారంటీ అని, ఆ బాధ్యత తనదని యువతకు హామీ ఇచ్చారు. నాలుగేండ్లలో మహానగరంగా ముచ్చర్ల మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్ పేట, బేగరి కంచ రెవెన్యూ పరిధిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు ఈ ప్రాంతంలో భూముల కోల్పోయిన భూ నిర్వాసితుల నివాసాల కోసం టౌన్‌షిప్ నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమం మొదలయిందే ఉద్యోగాల కోసం అని, ఉద్యమ కాలంలో కీలక పాత్ర పోషించింది కూడా నిరుద్యోగులేనని సీఎం గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రధాన లక్ష్యం నిరుద్యోగ సమస్య అని, డిగ్రీ, పీజీ పట్టాలు ఉన్నప్పటికీ వృత్తి నైపుణ్యత లేకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదన్నారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి నిరుద్యోగ యువత సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న లక్ష్యంతో 57 ఎకరాల్లో రూ. 100 కోట్లతో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. నాటి ప్రధాని నెహ్రూ విద్యా, సాగు నీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. వారు తీసుకున్న నిర్ణయాలతో ఈ రోజు నాగార్జున సాగర్ లాంటి పెద్ద సాగునీటి ప్రాజెక్టులు నెలకొల్పబడ్డాయని, వాటి ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

విద్యార్థుల కోసం యూనివర్సిటీలు నెలకొల్పబడ్డా యన్నారు. హైదరా బాద్‌కు తాగునీటి కోసం గోదావరి, కృష్ణ జలాలను తీసుకొచ్చామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు,

అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతో ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగినట్టు చెప్పారు. ఇక భవిష్యత్ అంతా మహేశ్వరం దేనని, ఈ ప్రాంతంలో విద్యా వైద్యంకు సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పనున్నట్టు తెలిపారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతం మారబోతుందన్నారు. ఈ ప్రాంతంలో దొరకనిదంటూ ఉండే అవకాశం లేకుండా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు. విమానం ఎక్కాలన్న.. కొనుగోలు చేయాలన్న ఇక్కడి నుంచే జరిగే విధంగా ఈ ప్రాంతం తయారు కాబోతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 200 ఫీట్ల రోడ్డు వేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులు, రెండు, మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చి సహకరించిన రైతులకు 662 ఎకరాల్లో 4500 మంది కుటుంబాలకు అద్భుతమైన టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

వారి మౌలిక వసతుల్లో భాగంగా రెండు ఎకరాల్లో కమ్యూనిటీ హాల్, ఎకరంలో ఆస్పత్రి, అడ్వాన్స్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతం సింగపూర్, దుబాయి, న్యూయార్క్‌ను మైమరిపించేలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి మండలి సహకారంతో ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

6లో.. **మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే నిరసనలు**
అక్కలూ వారి ఉచ్చులో పడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

6లో.. **పేదలు, కష్టాలు ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుంది**
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సత్తాచాటిన స్వప్నిల్

- పొజిషన్-3 షూటింగ్‌లో కాంస్యం
- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం

ఆటలు





పారిస్: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు మరో పతకాన్ని చేజిక్కించుకున్నారు. ఈ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న షూటర్లు.. మూడో కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. మను భాకర్ 'డబుల్ మెడల్' ఇచ్చిన స్ఫూర్తితో గురువారం జరిగిన పురుషుల పొజిషన్ 3 షూటింగ్‌లో యువ షూటర్ స్వప్నిల్ కాంస్య పతకంతో మెరిసాడు. మూడు పొజిషన్ల షూటింగ్ అంటే.. బోర్లా పడుకొని(ప్రోన్), మోకాళ్ల మీద(నీలింగ్), నిల్చొని(స్టాండింగ్) షూటింగ్ చేయాల్సి ఉంటుంది. స్వప్నిల్ మోకాళ్లపై షూటింగ్‌లో 153.5 పాయింట్లు, ప్రోన్ విభాగంలో 156.8 పాయింట్లు, స్టాండింగ్‌లో 141.1 పాయింట్లను (స్టేజ్ 2 ఎలిమినేషన్‌తో సహా) మొత్తం 451.4 పాయింట్లు సాధించాడు. దీంతో స్వప్నిల్ కుశల్ మూడో స్థానంలో నిలిచాడు. తొలుత నెమ్మదిగా ప్రారంభించిన స్వప్నిల్.. కీలక సమయంలో అద్భుతంగా పుంజుకొన్నాడు. ఒక దశలో నాలుగు, ఐదు స్థానాలకే పరిమితమైన స్వప్నిల్... క్రమంగా టాప్-3లోకి ఎగబాకాడు. ఆ తర్వాత ఏ మాత్రం వెనక్కి తిరిగిచూడలేదు. చివరికి 451.4 పాయింట్లను సాధించి కాంస్యం చేజిక్కించుకున్నాడు. చైనాకు చెందిన లి యుకున్(463.6) స్వర్ణం, ఉక్రెయిన్ షూటర్ కులిష్ సెర్హియ్(461.3) రజత పతకాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 పాయింట్లు సాధించిన స్వప్నిల్.. ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఎక్కువ సంఖ్యలో పది పాయింట్లు కొట్టడంతో స్వప్నిల్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య మూడుకు చేరింది.

నిఖత్ జరీన్ ఔట్

భారత్‌కు పతకాలు దక్కే ఈవెంట్‌లలో బాక్సింగ్ ఒకటి. గురువారం జరిగిన మహిళల 50 కిలోల బాక్సింగ్ విభాగంలో నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో ఓటమిపాలైంది. ప్రి క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ బరిలోకి దిగింది. ఈ బౌట్‌లో నిఖత్ పంచ్‌లను ఆశించిన స్థాయిలో కొట్టలేకపోయింది. ఇక 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొంది రెండోరౌండ్‌కు చేరింది.

హాకీలో వరుస విజయాలకు బ్రేక్..

పారిస్ ఒలింపిక్స్ భారత హాకీ జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. గురువారం జరిగిన గ్రూప్-బి లీగ్ పోటీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో భారత్ 2-1 తేడాతో ఓటమిపాలైంది. ఆరంభంలో భారతజట్టు ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో స్వర్ణ పతక విజేత బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరఫున అభిషేక్ ఒక్కడే ఇక గోల్ చేశాడు. బెల్జియం తరఫున స్టాక్‌బ్రోక్స్(33వ ని.), జాన్ డోమన్(44వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే భారత్ ఆడాల్సి వచ్చింది. ఈ ఓటమితో భారత్ 4 మ్యాచ్‌లు ముగిసేసరికి 7పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది.

లక్ష్యసేన్ ముందుకు...

బ్యాడ్మింటన్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్స్‌కు చేరగా.. పురుషుల డబుల్స్ స్టార్ ప్లేయర్స్ చిరాగ్-సాత్విక్ జంట అనూహ్యంగా క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-12, 21-6తో భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్‌పై వరుస సెట్లలో గెలిచాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్ తగిలింది. క్వార్టర్‌ఫైనల్లో వీరు 21-13, 14-21, 16-21తో మలేషియా జంట చేతిలో పోరాడి ఓడారు.

పతకాల సాధనలో చైనా అగ్రస్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో పతకాల సాధనలో కమ్యూనిస్టు చైనా తన ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రారంభమై నేటికి 6రోజులు కావొస్తున్నా.. ప్రతి రోజూ పతకాల పట్టికలో చైనా అగ్రస్థానంలోనే నిలుస్తోంది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికాకు ధీటైన పోటీనిచ్చినా.. ఈ ఒలింపిక్స్‌లో అమెరికా నేటికీ 5వ స్థానంలోనే కొనసాగుతోంది. గురువారం రాత్రి పోటీలు ముగిసే సమయానికి చైనా 11స్వర్ణ, 7రజత, 3కాంస్యాలతో సహా మొత్తం 21 పతకాలతో అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా 6స్వర్ణ, 13రజత, 12కాంస్యాలతో సహా 31 పతకాలతో 5వ స్థానంలో కొనసాగుతోంది. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో చైనాకు మరికొన్ని పతకాలు దక్కే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో చైనా పారిస్ ఒలింపిక్స్‌లో అగ్రస్థానంలో నిలిచే ఛాన్స్ ఉంది.

నేడు శ్రీలంకతో తొలి వన్డే

- మ. 2.30గం॥ల నుంచి



కొలంబో: టి20 సిరీస్ నెగ్గిన ఉత్సాహంలో ఉన్న టీమిండియా.. ఇక శ్రీలంకతో వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారతజట్టు టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేయగా.. వన్డే సిరీస్‌కు టి20 ప్రపంచకప్ సాధించిన రోహిత్ శర్మ అందుబాటులోకి వచ్చాడు. అలాగే విరాట్ కోహ్లి కూడా జట్టుతో కలవడంతో భారత బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్టంగా మారింది. మరోవైపు శ్రీలంక టి20 సిరీస్‌ను కోల్పోయినా.. స్వదేశంలో కనీసం వన్డే సిరీస్‌ను అయినా నెగ్గాలనే దృఢ సంకల్పంతో బరిలోకి దిగుతోంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ప్రాక్టీస్ లేకుండానే బరిలోకి దిగుతున్నారు.

జట్లు...

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, కెఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), దూబే, అక్షర్, కుల్దీప్, సిరాజ్, అర్షదీప్, ఖలీల్ అహ్మద్, సుందర్, రియాన్ పరాగ్, హర్షిత్ రాణా.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండిస్(వికెట్ కీపర్), సమరవిక్రమ, లైనగే, వెల్లెలిగే, హసరంగ, తీక్షణ, అసితా ఫెర్నాండో, షిరాజ్, కరుణరత్నే, ధనుంజయ, కమిందు మెండిస్, మధుశంక, మలింగ.

కార్మిక, కర్షక పక్షం నిలిచే పత్రిక

(మొదటిపేజీ తరువాయి)

50 ఏండ్లుగా ప్రజలకు మద్దతుగా నిలిచింది. బడుగు, బలహీనవర్గాల కోసం కృషిచేస్తున్నది. పేదలు, మహిళలు, యువత, కార్మికులు, కర్షకులు, విద్యార్థుల పక్షాన అక్షరరూపంలో సేవలు అందిస్తున్నది. గతంలో మాదిరిగానే ఇక ముందు కూడా నవతెలంగాణ విజయవంతంగా నడవాలని ఆకాంక్షిస్తూ మరోసారి అందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

ప్రజల పత్రికను ఇదే స్ఫూర్తితో నడిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకంగా నడుస్తున్న పత్రిక యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు. ఈ పత్రికలో రాజకీయాలకు సంబంధించి అవసరం అయినంత వరకే రాస్తారు. ప్రజాసమస్యలను ఎక్కువగా ప్రచురించడం గొప్ప విషయం.ఇదే స్ఫూర్తితో పత్రికను భవిష్యత్తులోనూ నడిపించాలి.

ఆయుష్‌ను ఉపయోగించుకోవాలి

- డాక్టర్ మిలీ దూబే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యవంతమైన జీవితం కోసం ఆయుష్ వైద్య విధానాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) డైరెక్టర్ మిలీ దూబే సూచించారు. గురు వారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కి)లో మూడు రోజుల ఆయుర్వేద ఉత్సవం ప్రారంభ మైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ వైద్య విధానాలను ప్రోత్సాహానికి అనేక చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్
- వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా
- అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట్



నవతెలంగాణ - ధూల్ పేట్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కోఠి వైద్య ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముందు గురువారం ధర్నా చేపట్టారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఉద్యోగులను అరెస్టు చేసి పలు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అక్రమంగా అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైద్యారోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేస్తూ కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించడం లేదన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, టార్గెట్స్ అచ్యుమెంట్ పేరిట ఒత్తిడి తగ్గించాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలన్నారు. లేనియెడల రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని చెప్పారు.

ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియుద్దీన్, రాష్ట్ర కోశాధికారి ఏ.కవిత, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బలరాం, విజయవర్ధన్, రాజు, కిరణ్మయి, నవీన్ కుమార్, సుధాకర్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజేశ్వరి, లక్ష్మి, రాధిక, విజయలక్ష్మి, సరోజ, మంజుల, దీన, సుగుణ, నేహా తదితరులు పాల్గొన్నారు.

ఫామ్‌హౌజ్‌ల పేరిట భూముల కేంద్రీకరణ

- మిగులు భూముల సాధన కోసం పోరాటాలు
- కాచం కృష్ణమూర్తికి అర్పించే నివాళి అదే : ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వెంకట్రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌజ్‌ల పేరిట భూములను కేంద్రీకరించుకుంటున్నారని ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. ప్రభుత్వ మిగులు భూముల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేయడమే కాచం కృష్ణమూర్తికి అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రైతు సంఘం కార్యాలయంలో కృష్ణమూర్తి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఆనాటి పాలకులు భూసంస్కరణల చట్టాలను అమలు చేస్తే నేడు ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ఫామ్ హౌజ్‌ల పేరుతో వేలాది ఎకరాలను ఆక్రమిస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్, అగ్రీ ఫామ్స్ పేరుతో పెద్ద ఎత్తున భూములను సమీకరించి పెట్టుకుంటున్నారనీ, పట్టణ భూసంస్కరణల పరిమితి చట్టాన్ని అమలు చేయకుండా తొక్కిపట్టారని తెలిపారు. అభివృద్ధి, హైవేలు, కరెంటు ఉత్పత్తి కేంద్రాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాల పేరుతో పేదల భూములను బలవంతంగా లాక్కుంటున్నారనీ, దానిని ప్రశ్నించే వారిపై కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూములను, చెరువులను, కుంటలను ఆక్రమించుకుంటే మాట్లాడని అధికారులు నిలువనీడ కోసం 60 గజాల స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలపై అక్రమ కేసులు పెట్టడమేంటి? జైలుకు పంపడమేంటి? అని ప్రశ్నించారు. తక్షణమే నిర్బంధం ఆపాలనీ, పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న చోటనే హక్కు పట్టా ఇచ్చి ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు.

పోడు సాగుదారులందరికీ హక్కు పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ రావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

- ప్రభుత్వానికి ధన్యవాదాలు : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో ప్రభుత్వ వైద్యుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం నాయకులు లాలూ ప్రసాద్ రాథోడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 2-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక



శ్రీశైల కృష్ణమ్మ పరవళ్లు...

సంపుటి : 10 | సంచిక : 214 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఎస్సీల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాలు రిజర్వేషన్ కోటాను ఉప కులాల వారీగా వర్గీకరించేందుకు రాష్ట్రాలకు అధికారం ఉన్నదని స్పష్టం చేసింది. సమాజంలోని అణగారిన కులాల అభ్యున్నతి కోసం రాష్ట్రాలు ఉప వర్గీకరణ జరపవచ్చునని తేల్చి చెప్పింది.

వర్గీకరణకు ఓకే

ఆ అధికారం రాష్ట్రాలదే ... సుప్రీం చారిత్రాత్మక తీర్పు

6-1 తేడాతో ధర్మాసనం తీర్పు
2004 నాటి తీర్పు చెల్లదని రూలింగ్

న్యూఢిల్లీ : ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో బేలా త్రివేదీ మినహా మిగిలిన న్యాయ మూర్తులందరూ ఉప వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఎస్సీల ఉప వర్గీకరణపై 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో ఇదే న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు చెల్లదని రూలింగ్ ఇచ్చింది. ఎస్సీలను ఉప కులాలుగా వర్గీకరించి, ఆయా వర్గాల్లో బాగా వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్ కోటా కల్పించేందుకు ఈ తీర్పు ఉపయోగపడుతుంది. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీష్ చంద్ర సభ్యులుగా ఉన్నారు. ఈ కేసులో వీరు వేర్వేరుగా ఆరు తీర్పులు వెలువరించారు. జస్టిస్ మిశ్రాకు, తనకు కలిపి జస్టిస్ చంద్రచూడ్ తీర్పు రాశారు. మిగిలిన నలుగురు వేర్వేరుగా తీర్పులు ఇచ్చారు. అయితే బేలా త్రివేదీ మినహా మిగిలిన వారందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ సాధ్యంకాదని జస్టిస్ బేలా త్రివేదీ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని 341వ అధికరణ ప్రకారం నోటిఫై చేసిన ఎస్సీ జాబితాను మార్చే అధికారం రాష్ట్రాలకు లేదని ఆమె తెలిపారు. రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రాలు సదుద్దేశంతో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆర్టికల్ 142 ప్రకారం వాటిని సుప్రీంకోర్టు సమర్థించజాలదని అన్నారు. జస్టిస్ గవాయ్ తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ క్రీమిలేయర్‌ను గుర్తించి వారిని రిజర్వేషన్ పరిధి నుండి తొలగించాలని ఆయన ...13లో

ప్రస్తుత రిజర్వేషన్లు ఇలా...

కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఉన్నత విద్యా సంస్థల్లో ప్రస్తుతం 22.5 శాతం సీట్లు ఎస్సీలకు, 7.5 శాతం సీట్లు ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ప్రభుత్వోద్యోగాలలో కూడా ఇదే నిబంధనను పాటిస్తున్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో మాత్రం ఎస్టీ జనాభా లేదు.



ఇక రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

ఎస్సీల ఉప వర్గీకరణపై సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు అనుమతిస్తూ 6-1 ఓట్ల తేడాతో సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చింది. ఎస్సీ కేటగిరీల్లోనే మరిన్ని వెనుకబడిన వర్గాలకు విడివిడిగా కోటాలను ఇచ్చుకోవడానికి అనుమతించింది. ఉప వర్గీకరణకు తగినంతగా ప్రాతినిధ్యం లేకపోవడానికి సంబంధించిన డేటా ప్రాతిపదికన ఈ ఉప వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకోవాల్సి వుంటుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, ఎస్సీల్లోని వెనుకబడిన వర్గాలకు వారి పరిస్థితులు మెరుగుపరిచేందుకు కావాల్సిన ...13లో

అసెంబ్లీలో గరం..గరం

స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టిన బీఆర్ఎస్ సభ్యులు | సబితకు సీఎం క్షమాపణ చెప్పాలని పట్టు

- నినాదాలు..చప్పట్లతో అక్కడే బైటాయింపు
- సభ వాయిదా పడేవరకూ నిల్చొనే ఉన్న మహిళా సభ్యులు
- వారి వారి స్థానాల్లో కూర్చుంటేనే మైకు ఇస్తానని స్పష్టం చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని పలుమార్లు విన్నపం
- సభకు సహకరించాలని సీపీఐ, బీజేపీ, ఎంఐఎం పక్షనేతల హితవు
- వెనక్కి తగ్గకుండా బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్





మైకు ఇవ్వలేదని నిరసనలు..ఇస్తే శాపనార్థాలు.. ఇదేం ధోరణి? : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సభలో బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు.. వారి స్థానాల్లో కూర్చొని సహకరించాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ విన్నపాలు....ఈ పద్ధతి సరిగాదంటూ సీపీఐ, బీజేపీ, ఎంఐఎం సభ్యుల వారింపులు...అయినా 'సీఎం క్షమాపణ చెప్పాల్సిందే..సీఎం డౌన్ డౌన్..వియ్ వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...'మైక్ అన్నా ఇవ్వండి..సస్పెండ్ అయినా చేయండి' అంటూ అక్బరుద్దీన్ సూచనలు..కుర్చీల్లో కూర్చొంటేనే మైక్ ఇస్తానంటూ స్పీకర్ హూంకరింపులు.. ఈ గందరగోళం మధ్యనే ఇతర సభ్యుల ప్రసంగాలు.. ...5లో

ప్రస్తుత నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు

అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తాం

ఎస్సీ వర్గీకరణపై మా ప్రభుత్వ కృషి ఫలించింది : సీఎం రేవంత్‌రెడ్డి 5లో



దద్దరిల్లిన పార్లమెంట్

- వ్యవసాయం, విద్యా, రైల్వే రంగాలు కుదేలు
- ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారు.. ఆయన చేసిన సిఫారసులు అమలు చేయరు

పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ దద్దరిల్లింది. ఎన్డీఏ ప్రభుత్వ హయంలో దేశంలోని వ్యవసాయం, విద్యా, రైల్వే రంగాలు కుదేలు అయ్యాయని ప్రతిపక్షాలు విమర్శించాయి. గురువారం లోక్‌సభలో విద్యా, రైల్వే రంగాల బడ్జెట్‌పై చర్చ జరగ్గా, రాజ్యసభలో వ్యవసాయ రంగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ హరిత విప్లవ పితామహుడు ...5లో



నేడే జాబ్ క్యాలెండర్

అసెంబ్లీలో సీఎం ప్రకటన

- ధరణికి 'భూమాత'గా పేరు మార్పు
- గ్రేటర్‌లోకి మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామాలు
- శ్రీధర్‌బాబు నేతృత్వంలో సబ్‌కమిటీ
- కొత్త రేషన్‌కార్డుల జారీకి ఓకే
- ఉత్తమ్ పర్యవేక్షణలో ఉపసంఘం

సీఎం రేవంత్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ, కీలక నిర్ణయాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన భేటీ అయిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గురువారం అసెంబ్లీలో మంత్రివర్గం ఆయా సమస్యలు, ప్రతిపాదనలపై గంటన్నరపాటు చర్చించింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన సమావేశం ఐదున్నర గంటలకు ముగిసింది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్ క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి.

1. కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడి చాలా మంది చనిపోయారు. ఈ విషాదంపై ...5లో

వారసత్వ పన్నుపై చర్చ జరగాలి


అంబానీ కొడుకు పెండ్లిపై ఎందుకింత ఆర్భాటం?

- పత్రికలు శ్రమజీవుల పక్షాన నిలవాలి
- 'నవతెలంగాణ' ఆ లక్ష్యంతో సాగాలి
- నవతెలంగాణ 9వ వార్షికోత్సవంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వారసత్వ పన్నుపై దేశ ప్రజల మధ్య చర్చ జరగాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత శ్యాం పిట్రోడా మాట్లాడితే, దాన్ని ప్రధాని మోడీ ఎన్నికల అస్త్రంగా వాడుకొనే ప్రయత్నం చేశారని చెప్పారు. ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టి లాభాల్లోకి మార్చుకుంటుంటే వారసత్వ పన్ను విధించడంలో తప్పు ఏం లేదని తేల్చిచెప్పారు. 'నవతెలంగాణ' 9వ వార్షికోత్సవం గురువారంనాడిక్కడి మోటూరి హనుమంతరావు భవన్‌లో జరిగింది. దీనికాయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబానీ కుమారుడి పెండ్లి వేడుకల గురించి ఆరునెలలపాటు మీడియా మొత్తం విస్తృత ప్రచారం కల్పించిందనీ, దేశంలో నిత్యం లక్షల పెండ్లిండ్లు జరుగుతుంటే, ఆ వివాహానికి ఎందుకంతటి ప్రచారం కల్పించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ పెండ్లికి ఎన్ని వేల కోట్లు ఖర్చు చేశారో విదేశీ మీడియా రాసిందనీ, ఇక్కడి ఒక్క పత్రికలోనూ ఆ వివరాలు రాలేదన్నారు. భారతదేశ పెట్టుబడిదారీవర్గం దేశ ఆర్థిక వ్యవస్థకు ఎలా నష్టం చేస్తుందో ...14లో



సత్తాచాటిన స్వప్నిల్

షూటింగ్‌లో కాంస్యం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం

వివరాలు 2లో

జూరాల 46 గేట్లు ఎత్తివేత



- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- శ్రీశైలంలోకి భారీగా ప్రవాహం

13లో



ఒంటరైన వారి కోసం ప్రత్యేక శిబిరాలు

ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం : సీఎం విజయన్

13లో

పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు

వందలకోట్లు బూడిదలో పోసిన పన్నీరే

- బయటేమో పేపర్ లీకేజీ... లోపలేమో వాటర్ లీకేజీ.
- నూతన భవన నిర్మాణంపై ప్రతిపక్షాల ఆగ్రహం
- పాత భవనంలోనే సమావేశాలు నిర్వహించాలని అఖిలేశ్ సూచన



13లో

దేశమంతా దంచికొడుతున్న వానలు

- హిమాచల్ ప్రదేశ్‌లో మేఘ విస్ఫోటనం
- ముగ్గురు మృతి, 50 మంది పైగా గల్లంతు
- ఉత్తరాఖండ్‌లోనూ భారీ వర్షాలు, ఏడుగురు మృతి
- ఢిల్లీలో వర్షాలకు ముగ్గురు మృతి, ధ్వంసమైన భవనాలు





న్యూఢిల్లీ : దేశమంతటా వానలు దంచికొడుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో మేఘవిస్ఫోటనం జరిగి షిమ్లా, మండి, కులు జిల్లాలో గత 24 గంటల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు నదులన్నీ పొంగిపొరులుతూ దిగువ రాష్ట్రాల వైపు ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో ఇద్దరు మృతి చెందగా, 50 మందికి పైగా గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, సహాయక చర్యల కోసం ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ నుంచి సహాయం కోసం చూస్తున్నామని ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తెలిపారు. రాబోయే 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తున్న నదులకు దూరంగా ఉండాలని ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. షిమ్లా డిప్యూటీ కమిషనర్ అనుపమ్ కశ్యప్ మాట్లాడుతూ గురువారం తెల్లవారు జామున ఒంటి గంటకు సంభవించిందని, భారీ వర్షాలకు రోడ్లన్నీ కొట్టుకు పోవడంతో రెస్క్యూ ఆపరేషన్ క్లిష్టంగా మారిందని తెలిపారు. ఉత్తరాఖండ్‌నూ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఏడుగురు మరణించారు. ఇందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. అనేక మంది ...5లో

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపాలి

శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలి

ఓసీపీ-2 సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య



నవతెలంగాణ-రామగిరి

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. జులై 29న ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర గురువారం పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో సాగింది. ఈ సందర్భంగా ఓసీపీ-2లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అధ్యక్షత వహించగా.. వీరయ్య మాట్లాడారు. తెలంగాణ బిడ్డ అని కిషన్‌రెడ్డిని నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోనే బొగ్గు బ్లాకుల వేలం ...14లో

సంపాదకీయం

ఇజ్రాయిల్ దురాగతం!



హమాస్ ముఖ్య రాజకీయ నేత ఇస్మాయిల్ హనియే హత్యతో ఇజ్రాయిల్ మరోసారి బరితెగించింది. దీనికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ ఆదేశాలిచ్చినట్లు వచ్చిన నిర్ధారణగాని వార్తలు నిజమే అయితే మధ్య ప్రాచ్యంలో పరిణామాలు మరింత విషమించే అవకాశం ఉంది. ఒకే రోజు, బుధవారం నాడు హమాస్, హిజబుల్లా సంస్థల ప్రముఖ నేతలను ఇజ్రాయిల్ దళాలు హత్య చేశాయి. ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెషికియాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన హనియేను రాజధాని టెహరాన్‌లో హత్యచేశారు. అంతకు కొద్దిగంటల ముందు లెబనాన్ రాజధాని బీరూట్ నగరంలో హిజబుల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుకుర్‌ను ఇజ్రాయిల్ హత్యచేసింది. ఈ రెండు సంస్థలూ ఇరాన్‌కు గట్టి మద్దతుదారులే అన్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ ఆక్రమణలోని గోలన్ గుట్టల ప్రాంతంపై అంతకుముందు జరిగిన దాడికి కారణమని ఇజ్రాయిల్ ఆరోపించగా తమకేమీ సంబంధం లేదని హిజబుల్లా ప్రకటించింది. గాజాలో హమాస్ నేతలు, కార్యకర్తల అణచివేత పేరుతో సాగిస్తున్న మారణహోమంలో భాగం, శాంతి చర్చలను దెబ్బతీసే కుట్ర కారణంగానే హనియే హత్య అన్నది స్పష్టం.

> గత నెల చివరి వారంలో పాలస్తీనా విముక్తికోసం పోరాడుతున్న పద్నాలుగు సంస్థలు, పార్టీలు చైనా మధ్యవర్తిత్వంలో ఉమ్మడిగా పోరాడేందుకు, జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఒక ఒప్పందానికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాన్ని అమెరికా, ఇజ్రాయిల్ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ ఒప్పందంలో హమాస్, పశ్చిమ గట్టు ప్రాంతంలో అధికారంలో ఉన్న ఫతా పార్టీలు కీలకు భాగస్వాములు. ఈ రెండూ కలవకూడదని కోరుకుంటున్న ఇజ్రాయిల్‌కు అది శరాఘాతం మాదిరి తగిలింది. ఆ ఉక్రోశంతో టెహరాన్‌లో హమాస్ నేత హత్యకు పాల్పడి ఉండవచ్చు.

గతేడాది అక్టోబరు ఏడు నుంచి గాజాలో మారణకాండతో పాటు దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇరాన్, అది మద్దతిస్తున్న సంస్థలను రెచ్చగొట్టి పూర్తి స్థాయి మధ్యప్రాచ్య యుద్ధంలోకి లాగాలన్నది ఇజ్రాయిల్ దానికి మద్దతు ఇస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఎత్తుగడ అన్నది తెలిసిందే. దాని వలలో పడకుండా ఇరాన్ ఇన్ని నెలలుగా సంయమనం పాటిస్తున్నది. ప్రతీకారం తీర్చుకోవాలని బుధవారం నాటి జాతీయ భద్రతా మండలి సమావేశంలో ఖమేనీ ఆదేశాలిచ్చినట్లుగా అధికారులు అనధికారికంగా చెప్పినట్లుగా గురువారం నాడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక వార్త ఇచ్చింది. మంటను ఎగదోసేందుకు ఇలాంటి వార్తలను ప్రచారం చేయటం తెలిసిందే. ఒకటి మాత్రం స్పష్టం, తమకు ఎదురు లేదని, ఎవరిని కావాలంటే వారిని, ఎక్కడబడితే అక్కడ మట్టుబెట్టే సత్తా తమకుందని ఇజ్రాయిల్ తాజా హత్యల ద్వారా ఆ ప్రాంత, ప్రపంచ దేశాలకు సందేశమిచ్చింది. గత నెల చివరి వారంలో పాలస్తీనా విముక్తికోసం పోరాడుతున్న పద్నాలుగు సంస్థలు, పార్టీలు చైనా మధ్యవర్తిత్వంలో ఉమ్మడిగా పోరాడేందుకు, జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఒక ఒప్పందానికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాన్ని అమెరికా, ఇజ్రాయిల్ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ ఒప్పందంలో హమాస్, పశ్చిమ గట్టు ప్రాంతంలో అధికారంలో ఉన్న ఫతా పార్టీలు కీలకు భాగస్వాములు. ఈ రెండూ కలవకూడదని కోరుకుంటున్న ఇజ్రాయిల్‌కు అది శరాఘాతం మాదిరి తగిలింది. ఆ ఉక్రోశంతో టెహరాన్‌లో హమాస్ నేత హత్యకు పాల్పడి ఉండవచ్చు. దానికి ప్రతిగా యుద్ధం గాకపోయినా ఇజ్రాయిల్ మీద పరిమితదాడులు జరిగే అవకాశం లేకపోలేదు. అది ఇరాన్ నేరుగా చేస్తుందా లేక మద్దతు ఇస్తున్న హిజబుల్లా, ఎమెన్‌లోని హౌతీ సాయుధ సంస్థలతో చేయిస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

హనియే హత్యను ఐరాస భద్రతా మండలి బుధవారం నాటి అత్యవసర సమావేశం ఖండించింది.దీని పర్యవసానాలు మధ్య ప్రాచ్యంలో పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయకుండా చూడాలని కోరింది.హనియే హత్యను చైనా, రష్యా, అల్జీరియా నిర్ద్వందంగా నిరసించగా అమెరికా, బ్రిటన్,ఫ్రాన్స్ ఈ ప్రాంతంలో పరిస్థితులు దిగజారటానికి కారకులైన వారికి ఇరాన్ మద్దతు ఇవ్వటమే కారణమని ఎదురుదాడికి దిగాయి.తాము ఎంతో సంయమనంతో ఉన్నామని అయితే నిర్ణయాత్మకంగా హనియే హత్య మీద స్పందించేందుకు తమకు హక్కు ఉందని ఐరాసలో ఇరాన్ రాయబారి స్పష్టం చేశాడు. దీనికి ఇజ్రాయిల్‌తో పాటు అమెరికా కూడా బాధ్యత వహించాల్సిందే అన్నాడు.హత్యతో తమకేమీ సంబంధం లేదని, ఈ కారణంగా యుద్ధ అవసరం లేదని అమెరికా సన్నాయి నొక్కులు నొక్కింది. ఇరాన్ మీదే చర్యలు తీసుకోవాలంటూ దొంగే దొంగ అన్నట్లుగా ఇజ్రాయిల్ ఎదురుదాడికి దిగింది. అంతర్జాతీయ కోర్టులు తీర్పు చెప్పినా, యావత్ ప్రపంచం ఖండిస్తున్నా ఇజ్రాయిల్ ఖాతరు చేయటం లేదు. అడ్డగోలుగా భద్రతా మండలిలో అమెరికా ఇస్తున్న మద్దతు బయట అందిస్తున్న మిలిటరీ ఇతర సాయమే దాని దురాగతాలకు కారణం.ప్రపంచ శాంతి శక్తులు ఇప్పటి వరకు స్పందించింది ఒక ఎత్తు కాగా, మరింతగా రంగంలోకి దిగితేనే వాటికి అడ్డుకట్టపడుతుంది.

దైవాంశ సంభూతుడు!

అతను నాలా నీలా కాదు
అచ్చం దైవాంశ సంభూతుడు
అతను మన విధిరాత
విదర్భ విధ్వంసానికి
బెస్ట్ బేకరీ నరమేధానికి
దర్శక నిర్మాత!
అతను నాలానీలా కాదు
తల్లి పేగు తెంచుకొని పుట్టడానికి
సాక్షాత్తు దైవ కుమారుడు!

అకస్మాత్తుగా పచ్చ నోట్లకు
మంగళ గీతం పాడి
బ్యాంకుల ముందు
జనాల్ని బారులు తీర్చి
డజన్ల కొద్ది ప్రాణాలకు
మోక్షం ప్రసాదించిన మహాత్ముడు!

అందరి సొమ్మును అప్పనంగా కాజేసిన
మానవోత్తములను వైతరణి దాటించిన
పరమ పావన కామధేనువు
అతను నాలా నీలా కాదు
కారణజన్ముడు!

హత్రాస్‌లో ఆడపిల్లను చిదిమేసిన వాళ్లనీ
ఆటలాడి మువ్వన్నెల జెండాకు
మెరుగుపెట్టిన వాళ్ల అభిమానాన్ని
అపహాస్యం చేసిన వాళ్లను
తన రెక్కల కింద దాచుకొని
కాపాడిన తల్లికోడి అతను!

అతడు నాలా నీలా కాదు
దైవం ఏరి కోరి భువికి పంపబడ్డాడు
మణిపూర్ మంటలు అతని
ఆత్మను కాల్చజాలవు

అకస్మాత్తుగా అతను విధించిన
కరోనా కర్ఫ్యూను సవాలు చేస్తూ
వేల కిలోమీటర్లు నడిచిన
కాళ్లు కార్చిన రక్తం
అతని ఆత్మను తడపజాలదు
ప్రాణవాయువు అందక
పసిబిడ్డల్ని కోల్పోయిన
తల్లులు కార్చిన కన్నీళ్లు సైతం
అతని మనసు ముంచెత్త జాలవు


గడ్డ కట్టిన చలిలో
రాజధాని నడిబొడ్డున
గొంతెత్తిన అన్నదాత ఆర్తనాదాలు
అతని చెవికి వినపడవు
అతను నాలా నీలా కాదు
మానవాతీతుడు!

అతని మనోనిబ్బరం మంచు పర్వతం
ప్రజాగ్రహానికి మాత్రమే కరుగగలదు
ఆకాశమార్గాన సంచరించే అతని అహాన్ని
ఇదొక్కటే భూమార్గం
పట్టించగలదు...

-టి హరికృష్ణ, 9494037288

సామాన్యుడే 'పద్మ'వ్యూహాన్ని ఛేదిస్తాడు-తప్పదు!

29 జులై 2024 నాడు బడ్జెట్ మీద లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉపన్యాసం చాలా ఆవేశంగా, ఆర్ద్రంగా, అర్థవంతంగా ప్రజల పక్షాన సాగింది. ఉపమానాలతో, సంకేతాలతో రాజకీయ కవితలా కూడా అనిపించింది. ఆరెస్సెస్, బీజేపీలకు వారి స్థాయి ఏమిటో చూపించింది. ప్రతిపక్షాలనన్నింటినీ ఏకం చేసి, ఇండియా కూటమి నాయకుడిగా మాట్లాడిన తీరు, దేశ ప్రజలకు నచ్చింది-మరీ ముఖ్యంగా అధికార బీజేపీ వారికి అర్థమయ్యేట్లు పురాణఘట్టాలను ఉదహరించి చేసిన ఆ ఉపన్యాసాన్ని తెలుగు పాఠకుల కోసం తెలుగులో అందిస్తున్నాను.



డాక్టర్ దేవరాజు మహారాజు

***

స్పీకర్ సర్, నా ఉపన్యాసాలలో నేను తరచూ చెపుతూనే ఉన్నాను. ప్రస్తుతం మన భారతదేశంలో భయపూరితమైన వాతావరణం ఉంది. అధికార పక్షంలో ఉన్న నా స్నేహితులు నవ్వుతున్నారు. కానీ, వాళ్లు కూడా భయపడుతున్నారు. నాకు తెలుసు బీజేపీలో కేవలం ఒకే ఒక్క వ్యక్తి ప్రధాని కావడానికి కలలు కనొచ్చు. ఒక వేళ రక్షణ మంత్రి ప్రధాని కావాలనుకుంటే అక్కడ ఒక పెద్ద సమస్య ఉంది. అక్కడ కూడా భయం ఉంది. అదే భయాన్ని వారు దేశవ్యాప్తం చేశారు. అందుకే నన్ను నేనొక ప్రశ్న అడుక్కుంటూ ఉన్నాను. బీజేపీ వారు దేశంలో భయాన్ని ఎందుకింత లోతుగా వ్యాప్తి చేశారూ? అని! స్పీకర్ సర్, మా చేయి గుర్తు-భయపడకు, భయపెట్టకు - అన్న విషయం గుర్తు చేస్తుంది. అదొక అభయ ముద్ర!! బీజేపీ పరిస్థితి వేరుగా ఉంది. బీజేపీ సభ్యులు భయపడుతున్నారు. బీజేపీ మంత్రులు భయపడుతున్నారు. దేశంలోని కష్టజీవులు, రైతులు, యువతీ యువకులు అందరికందరూ భయపడుతున్నారు. దీని గురించి తీవ్రంగా ఆలోచించి, నేనొక జవాబు కనుక్కున్నాను. అదే చెపుతున్నాను. బడ్జెట్ గురించే మాట్లాడుతున్నాను స్పీకర్ సర్! కొంచెం ఉపోద్ఘాతం ఇచ్చి అక్కడికే వస్తున్నాను.

చాలాయేళ్ల క్రితం హరియాణా కురుక్షేత్రలో యువకుడైన అభిమన్యుణ్ణి చక్రవ్యూహంలో ఇరికించి చంపేశారు. అంటే! స్పీకర్ సర్ చక్రవ్యూహంలో భయం ఉంది. హింస ఉంది. అలాంటి చక్రవ్యూహంలో అభిమన్యుణ్ణి ట్రాప్ చేసి, ఒక ఆరుగురు చుట్టుముట్టి, నిర్దాక్షిణ్యంగా చంపేశారు. నేను ఈ చక్రవ్యూహం గురించి కొంత పరిశోధన చేసి, తెలుసుకున్నదేమంటే - చక్రవ్యూహానికి మరొక పేరుందని, దాన్నే 'పద్మ'వ్యూహమంటారని !! అంటే ఆ వ్యూహం కమలం పువ్వు ఆకారంలో ఉంటుందట. లోటస్ ఫార్మేషన్-21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ' వ్యూహం తయారయ్యింది. అది కూడా కమలం పువ్వు ఆకారంలోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తనఛాతి మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ'వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతుల్ని, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెల్ని, చిన్న వ్యాపారస్తుల్ని, మధ్యతరగతి వ్యాపారస్తుల్ని బంధించింది. స్పీకర్ సర్- నాడు మూకుమ్మడిగా అభిమన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే -ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. చక్రవ్యూహం వేల మందితో తయారవుతుంది. వారందరూ ఉంటారు. కానీ, దాని కేంద్రకంలో అంటే సెంటర్లో కేవలం ఆరుగురే ఉంటారు. వారే కంట్రోల్ చేస్తుంటారు. ఈ రోజు కూడా ఆరుగురే కంట్రోల్ చేస్తున్నారు. వారెవరంటే - నరేంద్రమోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ దోబాల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.

> **లోటస్ ఫార్మేషన్-21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ' వ్యూహం తయారయ్యింది. అది కూడా కమలం పువ్వు ఆకారంలోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తనఛాతి మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ'వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతుల్ని, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెల్ని, చిన్న వ్యాపారస్తుల్ని, మధ్యతరగతి వ్యాపారస్తుల్ని బంధించింది. స్పీకర్ సర్- నాడు మూకుమ్మడిగా అభి మన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే -ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. చక్రవ్యూహం వేల మందితో తయారవుతుంది. వారందరూ ఉంటారు. కానీ, దాని కేంద్రకంలో అంటే సెంటర్లో కేవలం ఆరుగురే ఉంటారు. వారే కంట్రోల్ చేస్తుంటారు. ఈ రోజు కూడా ఆరుగురే కంట్రోల్ చేస్తున్నారు. వారెవరంటే - నరేంద్రమోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ దోబాల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.**



ఈ 'పద్మ'వ్యూహపు ఉద్దేశమేమంటే - దేశ ఆర్థిక శక్తిని తమ ఆధీనంలో ఉంచుకోవడం. అదీ కేవలం ఇద్దరి దగ్గరే ఉండాలనుకోవడం. ఈడి, సిబిఐ, ఇన్‌కంటాక్స్ వ్యవస్థల్ని దుర్విని యోగం చేయడం. సరే ఇక ఇప్పుడైనా, ఈ బడ్జెట్‌లో గతంలో చేసిన తప్పిదాలు సవరించుకుంటారేమోనని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. రైతులకు, యువతులకు ఈ బడ్జెట్ కొంత సహాయకారిగా ఉంటుందని భావించాం. కానీ, అలా జరగలేదు. చిన్న, మధ్య తరగతి వ్యాపార స్తులకు మేలుజరగలేదు. వీరందరి జీవితాల్ని ఈ బడ్జెట్ ధ్వంసం చేసింది. ఇదంతా 'పద్మ'వ్యూహంలో భాగం నోట్‌బందీ; జీఎస్టీ; టాక్స్ టెర్రరిజం - ఆపడానికి ఈ బడ్జెట్‌లో ఏ వెసులుబాటూ లేదు. కోవిడ్ సమయంలో మీరేం చేశారు? పెద్ద పెద్ద వ్యాపారస్తులకు ప్రోత్సాహ కాలు అందించారు. చిన్న వ్యాపారాల్ని మూసేయించారు. దేశంలోని నిరుద్యోగులకు జీవన భృతి లేదు. వారంతా బతకలేక తల్లడిల్లిపోతు న్నారు. ఐదు శాతమున్న అతిపెద్ద కంపెనీలలో పనిచేసే ట్రెయినీలకే స్టైఫండ్ అందుతుంది. 95శాతం యువతీ యువకులకు దీనివల్ల ఏ మాత్రం లాభం లేదు. అంటే ఏమిటీ? ముందు మీరు కాళు విరగ్గొడ తారు. తరువాత బ్యాండ్‌ఎయిడ్ వేస్తారు. అది సరిపోదు. పనిచేయదు.

ఈ రోజు పరీక్షల పేపర్‌లీక్ చాలా ప్రధానమైన అంశం. దాని గురించి ఏమైనా ఆలోచించారా? ఒక వైపు మీ పద్మవ్యూహం నిరుద్యోగాన్ని పెంచుతోంది. మరోవైపు మీ పద్మవ్యూహం పేపర్‌లు లీక్ చేస్తోంది. ఈ దేశపు యువత ఏమైపోవాలని అనుకుంటున్నారు. గత పదేండ్ల మీ పాలనలో దేశంలో డెబ్బయిసార్లు పరిక్ష పేపర్లు లీక్ అయ్యాయి. కావాలంటే వివరాలిస్తాను. తీరికగా చూస్కోండి. స్పీకర్ సర్-యువతీయువకులకు పేపర్‌లీక్ చాలా పెద్ద సమస్య దాన్ని ఎదుర్కోడానికి, దాన్ని సరిచేయడానికి, యువతకు న్యాయం చేయ డానికి ఈ బడ్జెట్‌లో ఒక్క ంటే ఒక్కమాట కూడా లేదు. ఈ విషయం గుర్చి ఆర్థిక మంత్రి ఒక్క మాట మాట్లాడలేదు. పైగా గత ఇరవై ఏండ్లలో ఎన్నడూ లేనంత తక్కువగా -2.5 శాతం విద్యకు కేటాయించారు. దేం సరిపోతుందీ? మరో విశేషమేమంటే అగ్నివీర్ జవాన్‌లను తొలిసారి మీ చక్రవ్యూహంలో బంధించారు. ఈ బడ్జెట్‌లో అగ్నివీర్‌ల పెన్షన్ గురించి ఒక్కమాట చెప్పలేదు. మిమ్మల్ని మీరు దేశభక్తులని ప్రకటించుకుంటారు. కానీ, దేశ రక్షణ బాధ్యతను నిర్వహిస్తున్న అగ్నివీర్ జవాన్‌ల గురించి మీరు ఆలోచించరు. వారికి పెన్షన్ ఇవ్వడానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించరు. ఆ రకంగా మీరు మన సైనికుల్ని, 'అగ్నివీర్' అనే పద్మవ్యూహంలో ఇరికించారు.

అన్నదాతలైన, రైతుల్ని మీ నల్ల చట్టాల చక్రవ్యూహంలో బంధించారు. దానిలోంచి బయటపడడానికి రైతులు ఢిల్లీ బార్డర్‌లో ఏండ్లకేండ్లు ధర్నాలు చేస్తున్నారు. ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. అయినా వారిని కనికరించలేదు. వారు ఢిల్లీకి రాకుండా చేసి, వారి మీద బుల్లెట్లు కురిపించారు. అయినా రైతులు వీరోచితంగా పోరాడుతూనే ఉన్నారు. మీ పద్మవ్యూహంలోంచి బయటపడడానికి వారు ఒకే ఒక్క విషయం అడిగారు. లీగల్ గ్యారెంటెడ్ ఎం.ఎస్.పి. కావాలని డిమాండ్ చేశారు. దాని మీద మాట్లాడకపోగా, వారి రోడ్లు మూసేశారు. అది ఇప్పటికీ మూసే ఉంది. వారితో మీరు మాట్లాడరు. అందుకే వారు నన్ను కలవడానికి పార్లమెంటుకు వస్తే, వారిని లోనికి అనుమతించలేదు. అప్పుడు నేనే బయటికి వెళ్లి, మీడియా ముందు వారిని కలిశాను. అప్పుడు ఏమైందో నాకైతే తెలియదు, వెంటనే పార్లమెంట్ గేట్లు రైతుల కోసం తెరుచుకున్నాయి. సరే, ఈ బడ్జెట్‌లో రైతులు అడిగిన ఒక్క కోర్కెను దృష్టిలో ఉంచుకుని కేటాయింపులు చేసిఉంటే వారు మీ పద్మవ్యూహంలోంచి కొంతవరకు బయట పడేవారు. కానీ, అది జరగలేదు. మా 'ఇండియా' కూటమి వైపు నుండి మేం అన్నదాతలకు భరోసానిస్తున్నాం. అవకాశం రాగానే మేం తప్పక వారి డిమాండ్‌కు అనుకూలంగా స్పందిస్తాం! గ్యారంటీడ్ లీగల్ ఎం.ఎస్.పి. బిల్ ఈ సభలో పాస్ చేస్తాం! అన్నదాతల్ని ఆదుకుంటాం! ఇది మా వాగ్దానం!!

ఇకపోతే ఈ దేశపు మధ్య తరగతి ప్రజలు, ఈ బడ్జెట్‌కు ముందు, ప్రధాని మోడీకి ఎక్కువగా మద్దతిచ్చారు. కోవిడ్ సమయంలో కోవిడ్‌ను పారదోలడానికి ప్రధాని వారిని చప్పట్లు కొట్టమన్నారు. వారు రెండు చేతులతో శక్తి కొద్దీ చప్పట్లు చరిచారు. మాకు అది కొంచెం విచిత్రంగా అనిపించింది. కానీ, చెప్పింది దేశ ప్రధాని కదా-అని దేశ ప్రజలు విన్నారు. తర్వాత ప్రధాని మొబైల్ లైట్ వెలిగించమన్నారు.దేశ వ్యాప్తంగా మొబైల్ లైట్లు వెలిగాయి. అలాంటి మధ్య తరగతి ప్రజలకు మీరు మీ బడ్జెట్‌తో రెండు కత్తులు పొడిచారు. ఇండక్సేషన్ కౌన్సిల్ చేసి వారి వీపులో కత్తి పొడిచారు. కాపిటల్ గెయిన్ టాక్స్ పెంచి-వారి ఛాతిలో మరో కత్తి పొడిచారు. దీనితో మా ఇండియా కూటమికి కనిపించని లాభం జరిగింది. దేశ ప్రజలు ఎన్డీయే కూటమిని వదిలి ఇండియా కూటమివైపు వస్తున్నారు. - అవకాశం దొరికితే చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టే పనిలో ఉన్నాం. భారతదేశంలో ప్రజలెవరూ కలలు కనగూడదని మీరు భావిస్తారు. కేవలం ఎ2,ఎ2లే (ఆదానీ, అంబానీలే) కలలు కనడానికి అర్హులు అని మీరనుకుంటారు. ఆ ఇద్దరే దేశంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంట్రోల్ చేస్తారు. వారి దగ్గరే టెలికామ్ సిస్టమ్ ఉంది. ఎయిర్‌పోర్టులున్నాయి.ఇప్పుడిక రైల్వేలను ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్నారు. సంపదకు సంబంధించిన ఏకచ్ఛత్రాధిపత్యం వీరి వద్దనే ఉంది.

> **ఈ దేశపు మధ్య తరగతి ప్రజలు, ఈ బడ్జెట్‌కు ముందు, ప్రధాని మోడీకి ఎక్కువగా మద్దతిచ్చారు. కోవిడ్ సమయంలో కోవిడ్‌ను పారదోలడానికి ప్రధాని వారిని చప్పట్లు కొట్టమన్నారు. వారు రెండు చేతులతో శక్తి కొద్దీ చప్పట్లు చరిచారు. మాకు అది కొంచెం విచిత్రంగా అనిపించింది. కానీ, చెప్పింది దేశ ప్రధాని కదా-అని దేశ ప్రజలు విన్నారు. తర్వాత ప్రధాని మొబైల్ లైట్ వెలిగించమన్నారు.దేశ వ్యాప్తంగా మొబైల్ లైట్లు వెలిగాయి. అలాంటి మధ్య తరగతి ప్రజలకు మీరు మీ బడ్జెట్‌తో రెండు కత్తులు పొడిచారు. ఇండక్సేషన్ కౌన్సిల్ చేసి వారి వీపులో కత్తి పొడిచారు. కాపిటల్ గెయిన్ టాక్స్ పెంచి-వారి ఛాతిలో మరో కత్తి పొడిచారు. దీనితో మా ఇండియా కూటమికి కనిపించని లాభం జరిగింది. దేశ ప్రజలు ఎన్డీయే కూటమిని వదిలి ఇండియా కూటమివైపు వస్తున్నారు. - అవకాశం దొరికితే చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టే పనిలో ఉన్నాం.**


స్పీకర్ సర్! దేశంలో మరొక ముఖ్యమైన సమస్య ఉంది. దానిమీద ఈ బడ్జెట్ దృష్టి పెట్టలేదు. ఈ దేశంలో దళితుల, ఆదివాసీల, మైనార్టీల, వెనకబడిన వర్గాల సంఖ్య అధికం. సుమారు 90-95 శాతం ప్రజలు వారే. అయితే వారికి ఎందులోనూ స్థానం దొరకదు. పెద్దపెద్ద వ్యాపారాల్లోగానీ, ప్రభుత్వ యంత్రాంగంలో గానీ, ముఖ్యమైన చోట్ల ఎక్కడా వారికి తగిన స్థానం దొరకదు. అందుకే దేశంలోని 95 శాతం ప్రజలు 'జనగణన' కోరుతున్నారు. అప్పుడు గానీ, ప్రతి దాంట్లో వారివారి భాగస్వామ్యం ఎంత అనేది బయటపడదు. ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు గానీ, ఇది నవ్వే విషయం కాదని మేడమ్ గారు తెలుసుకుంటే మంచిది-ఈ దేశపు బడ్జెట్ దేనికి ఎంత అనేది నిర్ణయించడమంటే ఏమిటీ? ఈ దేశపు 'హల్వా'ను పంచడం జనాభాలో 2-3శాతం ఉన్నవారు ఈ దేశపు హల్వా పంచడానికి కూర్చు న్నారు. ఎవరికి పంచుతున్నారూ? వారికి అనువైన 2-3శాతం కార్పోరేట్లకు మాత్రమే పంచుతున్నారు. అంటే 95 శాతం ఉన్న సామాన్యులకు హల్వా ఏ మాత్రం అందడం లేదు (బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థిక శాఖలో హల్వా (మిఠాయి) చేసి, అక్కడ ఉన్న అధికారులు కలిసి తినడం ఆనవాయితీ, దాన్ని దృష్టిలో ఉంచుకుని రాహుల్ గాంధీ దేశపు హల్వా పంచుకుని తింటున్నారని పరోక్షంగా ఎత్తిచూపారు. ఆఫొటో కూడా లోక్‌సభలో చూపించారు) ఈ సారి బడ్జెట్ తయారు చేసిన వారిలో 20 మంది అధికారులున్నారని తెలిసింది. అందులో ఒకరు మైనార్టీ. మరొకరు ఒబిసి. అంటే 95 శాతం ప్రజలకు ప్రతినిధులు ఇద్దరయితే 5 శాతానికి 18 మంది ఉన్నారు. ఉన్న ఆ ఇద్దరిని కూడా ఇక్కడ ఫొటోలోకి రాకుండా అడ్డుకుని, వెనక్కి నెట్టేశారు. ఎందుకీ వివక్ష అని మేమడుగుతున్నాం. మీ పద్మవ్యూహాల్ని బద్దలు కొట్టడానికే మేం బయలుదేరాం! మేం అదే పనిలో ఉన్నాం!! స్పీకర్ సర్-

పద్మవ్యూహాలు తయారు చేసేవారికి భారతదేశపు స్వభావం అర్థం కాలేదు పద్మవ్యూహంలో చిక్కుకున్న అణగారిన వర్గాల వారు 'అభిమన్యుడు' అనుకుని పొరపడ్డారు-కాదు-అక్కడ ఉన్నది 'అర్జునుడు'!! మీ కుటిల పద్మవ్యూహాల్ని ఛేదించుకుని ఈ దేశ ప్రజలు తప్పక బయటపడతారు. పద్మవ్యూహాలు పన్నినవారిని తుత్తునియలు చేస్తారు. మా చేతిలో ఉన్న రాజ్యాంగం- స్వేచ్ఛ- అహింస- ప్రేమభావన- 'పద్మ'వ్యూహాల్ని ముక్కలు చేస్తాయి. వీటితోనే మేం ప్రధాని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాం. కుప్పగూల్చాం అందుకే ఆయన సభలోఉండటం లేదు. స్పీకర్ సర్!

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్‌నుంచి)

వేలం కత్తికి వేలాడుతున్న 'సింగరేణి'!

తెలంగాణ కల్పతరువు..మన సింగరేణి. సిరులనిచ్చే బొగ్గు గనులు..మన ప్రాంత వనరులు. ఎంతోమందికి అన్నం పెట్టి, ఉపాధి చూపిన నల్ల బంగారం నేల నేడు కేంద్రం ప్రయి'వేటు'కు విలవిల్లాడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రయివేటీకరణ యత్నాలను తిప్పికొట్టి నిలబడిన సింగరేణి ఇప్పుడు గనులు, నిల్వలు బ్లాక్‌ల వారీగా వేలం కత్తికి వేలాడుతోంది. నిన్న నల్లచట్టాలతో రైతులను నట్టేట ముంచే కుట్ర చేసి భంగపడిన మోడీ సర్కార్ నేడు బొగ్గుగనులపై కన్నేసి సింగరేణిని నిలువునా దెబ్బతీసే కుతంత్రం చేస్తోంది. లాభాల బాటలో నడుస్తున్న సంస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన బొగ్గు గనులను కేటాయించాల్సింది పోయి అస్థిరపరిచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ గనులను ప్రయివేటుపరం చేసే కుట్రకు తెరదీసింది. ఇది తెలంగాణకు అతిపెద్ద పెనుముప్పు. అందుకే సిఐటియు వంటి కార్మిక సంఘం సింగరేణికి దన్నుగా నిల బడి పోరాడుతున్నది. సింగరేణిని పరిరక్షించాలని, బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని, కార్మికుల హక్కుల్ని, ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర ప్రారంభించింది.



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

సింగరేణి అంటే ఒక సంస్థనే కాదు, తెలంగాణ ప్రజల ఆస్తి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ఏడేండ్ల కాలంలో 450 లక్షల టన్నుల ఉత్పత్తి నుంచి 670 లక్షల టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తి జరిగింది. దీంతో పాటు బొగ్గు తవ్వకాలు, రవాణా, లాభాలు, కంపెనీ విస్తరణ విషయంలోనూ సింగరేణి గణనీయమైన ప్రగతిని సాధిస్తూ వస్తున్నది. సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రం దేశంలోనే అత్యుత్తమ పిఎల్ఎఫ్‌ను కలిగి ఉన్నది. కేవలం సింగరేణి రాష్ట్రానికే పరిమితం కాకుండా మహారాష్ట్రతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు భారీ ఎత్తున బొగ్గు సరఫరా చేయడంతో దేశం విద్యుత్తు కాంతులతో విరజిమ్ముతోంది. దీంతోపాటు సింగరేణి ప్రాంతంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ తన కార్యకలాపాలను విస్తరిస్తూ సింగరేణి ప్రగతి ప్రస్థానంలో దూసుకెళ్తున్నది. దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ ఇవ్వని విధంగా లాభాల్లో 29 శాతం వాటను కార్మికులకు ఇస్తున్న ఏకైక సంస్థ సింగరేణి. ఏ ప్రభుత్వ రంగ సంస్థ చేయనన్ని కార్మిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. సింగరేణి యాజమాన్యం, కార్మికవర్గం కృషితో ఇంతకాలం కార్మికులకు లాభాల్లో వాటాలు అనేది పత్రికల్లో పతాక శీర్షికలయ్యాయి. ఇక సంస్థను ప్రయివేటుపరం చేస్తే, ఇక నుంచి నష్టాల మూటలు అనేవి ప్రధాన శీర్షికలు అవుతాయి. ప్రగతి పథంలో ఉన్న సింగరేణిని బలహీనపరిచి,నష్ట పూరిత పబ్లిక్ సెక్టార్ కంపెనీగా మార్చి అంతిమంగా ప్రయివేటుపరం చేసే కుట్రను కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తోంది. గుజరాత్‌కు మాత్రం అడిగిన వెంటనే కేంద్రం లిగ్నైట్ గనులను ఎలాంటి వేలం లేకుండా నేరుగా గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థకు కేటాయించింది. కానీ తెలంగాణలోని సింగరేణికి ఎందుకు ఇవ్వదు? దేశమంతా ఒక్కటే అయినప్పుడు గుజరాత్‌కో విధానం, తెలంగాగాణకో విధానం ఉంటుందా?

దూకుడుగా ప్రయివేటీకరణ!

కోల్‌మైన్ అంటే బొగ్గు గనులే కాదు..యువతకు ఉపాధి సృష్టించి గోల్‌మైన్. అలాంటి సంస్థను అస్థిరపరిచి ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రం తెగబడింది. మొదటి కాప్టివ్ మైనింగ్ పేరుతో కోల్ ఇండియా, సింగరేణి నుంచి బొగ్గు కొనకుండా తానే ఉత్పత్తి చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నెమ్మదిగా సాధారణ బొగ్గు తవ్వకాల్లో కూడా ప్రయివేట్ సంస్థలకు చొరబాటుకు దారి చూపి ఆపై వెసులుబాటు కల్పించింది.లీజ్ ఒప్పంద విధానాల్లో సులభతరంగా మార్పులు చేసింది.కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా దూకుడుగా ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తోంది.అందులో భాగంగా సింగరేణిలో 2021లో మరో దుర్మార్గ చట్టాన్ని తీసుకొచ్చింది.బొగ్గు వేలం పాటలో నెగ్గిన వారికి ఎలాంటి కండీషన్లు లేకుండా ఆ చట్టం పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది.కార్మికుల భద్రత, సంక్షేమం,పర్యావరణ సంరక్షణ మొదలైన సమస్య ఏమైనప్పటికీ ఇవేవీ వారికి ముఖ్యం కాదు.వారికి కేవలం లాభాలు దండుకోవటమే లక్ష్యం.ప్రభుత్వమే పూనుకొని సింగరేణి బొగ్గు తవ్వకాలు జరిపితే ఉత్పత్తి కారుచౌకగా లభిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కూడా ధారాళంగా, చౌకగా వస్తుంది. దానితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆదాయం మెండుగా సమకూరుతుంది. కార్మికుల, ప్రజల ప్రాధాన్యతను పక్కన పెట్టి బొగ్గుబ్లాకును వేలం వేయడమనేది దుర్మార్గమైన చర్య ప్రయివేటు వ్యాపార ప్రయోజనాల కోసం,బడా కార్పొరేట్ల లాభాల కోసం లక్షలాది కార్మికులు, వారి కుటుంబాల పొట్టకొట్టడం దారుణం.

యుపిఎ ప్రభుత్వ కాలంలో కోల్ ఇండియా పది శాతం వాటాలు అమ్మితే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం మరో 29 శాతం వాటాలను అమ్మింది. క్రమంగా వాటికున్న హక్కులను నిర్వీర్యం చేయడం, తెలంగాణ వరప్రదాయిని సింగరేణిని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. ఆ విధానాలకు వ్యతిరేకంగా 2003లో సింగరేణి 15 రోజులపాటు సమ్మె చేసింది.ఆ తర్వాత అనేక పోరాటాలు వెల్లువెత్తాయి. అయినా పాలకులు తమ విధానాల్ని మార్చుకోలేదు. పైగా మోడీ ప్రభుత్వం నగరీకరణ పేరుతో, ప్రయివేటువాళ్లకు విపరీత రాయితీ లిచ్చింది. బొగ్గు దిగుమ తుల మీద సుంకం రద్దు చేసింది. వీటితోపాటు దేశంలో బొగ్గు వినియోగించే సంస్థలన్నీ పది శాతం దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కూడా విధించింది.ఆ విధంగా దిగుమతుల రూపంలో బొగ్గు కొనేందుకు అవకాశం కల్పించింది. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే కేంద్రం చూస్తోందన్నది దీన్నిబట్టి తెలుస్తోంది. ఉదాహరణకు టన్ను బొగ్గు 3,500 రూపాయల నుంచి 4వేల రూపాయలకిచ్చే సింగరేణిని కాదని పొరుగు రాష్ట్రమైన ఏపీ అనివార్యంగా గతంలో టన్నుకు 18వేల రూపాయల చొప్పున 7 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి ఒప్పందం చేసుకుంది. ఇలా చేయడం ద్వారా ఛార్జీలు పెరిగి ప్రభుత్వ ఖజానా మీద అధిక భారం పడింది. ఇది అంతిమంగా ప్రజలపై ప్రభావం చూపుతుంది. తెలంగాణలోనైతే జెన్కో, ఎన్టీపీసీకి గత ప్రభుత్వం రూ. 30వేల కోట్ల బకాయిపడింది. అయినా సింగరేణి లాభాల్లోనే ఉందంటే అధిక బొగ్గు ఉత్పత్తి, కార్మికుల శ్రమయే కారణం.



> **గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాక్ లను గుర్తించింది. ఆపై బొగ్గు ఉత్పత్తిని కూడా చేపట్టింది. శ్రావణపల్లిలో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. కానీ వేలం పాటల ద్వారా దక్కించుకోవాలని కేంద్రం నిర్దేశించింది. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ఇదే బాటలో నడిచి వేలం పాట ద్వారానే ప్రయివేటువారికి వత్తాసు పలికింది. ప్రస్తుత ప్రభుత్వమేమో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సరైన ప్రణాళికతో కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు. దీనిపై అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బొగ్గు గనులను రక్షించేందుకు కార్యచరణ చేపడితే ప్రయోజనకరం.**

ప్రమాదంలో పారిశ్రామిక రంగం

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాక్ లను గుర్తించింది. ఆపై బొగ్గు ఉత్పత్తిని కూడా చేపట్టింది. శ్రావణపల్లిలో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. కానీ వేలం పాటల ద్వారా దక్కించుకోవాలని కేంద్రం నిర్దేశించింది. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ఇదే బాటలో నడిచి వేలం పాట ద్వారానే ప్రయివేటువారికి వత్తాసు పలికింది. ప్రస్తుత ప్రభుత్వమేమో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సరైన ప్రణాళికతో కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు. దీనిపై అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బొగ్గు గనులను రక్షించేందుకు కార్యచరణ చేపడితే ప్రయోజనకరం. ఒక్కసారి గనులు ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన తర్వాత గనులు మూతపడిన కొద్దీ కార్మికులను ఉద్యోగాలకు ఉద్వాసన పలికే అవకాశాలే మెండు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు అందుతున్న హక్కులు,లాభాల్లో వాటా వంటి అన్ని సౌకర్యాలూ దూరమవుతాయి.

అంతిమంగా సింగరేణి సంస్థ సమీప భవిష్యత్తులో కనుమరుగైపోయే ప్రమాదమూ లేకపోలేదు. సింగరేణి ద్వారా రాష్ట్రంలోని రెండు వేల పరిశ్రమలకు బొగ్గు అందుతోంది. ఒకవేళ ఈ సంస్థ ప్రయివేటీకరణ అయితే ఆయా పరిశ్రమలకు బొగ్గు సరఫరా అందడం ప్రయివేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లి అంతిమంగా తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక పురోగతి ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది. కేంద్రం సింగరేణిలోని కేవలం బ్లాకులు మాత్రమే వేలం వేయడం లేదు, వేలాది మంది కార్మికుల భవిష్యత్తును బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తోంది. ఈ వేలం వెర్రి ఆలోచనలు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా మానుకోవాలి. లేదంటే ఎన్నో వీరోచిత పోరాటాలకు కేరాఫ్‌గా నిలిచిన సింగరేణి కార్మికవర్గం మరోసారి ఉద్యమ ఉక్కు పిడికిలి బిగించేందుకు సిద్ధమవ్వాలి.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తారని, కానీ ఆయన వ్యవసాయ రంగంపై ఆయన చేసిన సిఫారసులు విస్మరించారని ధ్వజమెత్తారు. ఆయన సూచనలులు విస్మరించడమంటే, ఆయనను అగౌరవపరచడమేనని అన్నారు. ప్రధాని మోడీ చేసిన కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను రైతులు ఎలా తిప్పికొట్టారో ప్రపంచం మొత్తం చేసిందని అన్నారు. రైతుల సమస్యలను, వ్యవసాయ సంక్షోభాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు పెరిగాయని, వీటిని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని దుయ్యబట్టారు. కార్పొరేట్లకు రుణమాఫీ చేసే ప్రభుత్వం, రైతులకు ఎందుకు రుణమాఫీ చేయటం లేదని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టం చేయాలని రైతులు డిమాండ్ చేస్తోన్నారని, కానీ మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పలుమార్లు పీఎం కిసాన్ గురించి మాట్లాడుతున్నారని, అయితే రెండున్నరేండ్లలో 1.54 కోట్ల మంది రైతులను పీఎం కిసాన్ నుంచి తొలగించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా విమర్శించారు. నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ప్రభుత్వం పంటను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.

విద్యా స్వేచ్ఛలో బలహీనత

బీజేపీ ప్రభుత్వ హయంలో విద్యా స్వేచ్ఛ బలహీనపడిందని కాంగ్రెస్ ఎంపీ ఆంటోని విమర్శించారు. లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. "ఈ దేశంలోని విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ లేదు. విద్యా స్వేచ్ఛ గణనీయంగా బలహీనపడింది. విద్యా రంగంలో భయానక వాతావరణం ప్రవేశించింది" అని ఆయన విమర్శించారు.

రైల్వే మంత్రి కాదు...రీల్ మంత్రి

గత రెండు నెలల్లో నాలుగు గూడ్స్ రైళ్ల పట్టాలు తప్పాయని, ఈ ప్రమాదాల్లో 14 మంది మరణించినా రైల్వే శాఖ మంత్రి ఎలాంటి నైతిక బాధ్యత వహించలేదని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగొయ్ విమర్శించారు. నైతిక బాధ్యత వహించకపోగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిపక్షాల మీద విరుచుకుపడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ఏడాది బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో ఏకంగా 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. గత ఒకటి రెండు సంవత్సరాలుగా రైలు ప్రమాదాలు పెరుగుతున్నా రైల్వే మంత్రి మాత్రం తనకేమీ పట్టనట్టు రీల్స్ చేయడంలో మునిగిపోయారని విమర్శించారు. ఆయన రైల్వే మంత్రి కాదని రీల్ మినిస్టర్, డీరైల్‌మెంట్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్కరూ బాధ్యత తీసుకోకపోవడం బీజేపీ సంప్రదాయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైలు ప్రమాదాలపై మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన సంతృప్తికరంగా లేదని, అందుకే ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయని కాంగ్రెస్ గౌరవ్ గొగొయ్ పేర్కొన్నారు.

ప్రతిపక్షాలపై రైల్వే మంత్రి దాడి

తమ ప్రభుత్వం హయంలో ఏం చేశారో చెప్పమంటే, దానికి సమాధానం చెప్పకుండా ప్రతిపక్షాలపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దాడికి దిగారు. 58 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం ఒక కిలోమీటర్ ట్రాక్‌కు కూడా వారు ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) నెలకొల్పలేదని అన్నారు. మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా పనిచేసిన సమయంలో రైలు ప్రమాదాలు 0.24 శాతం నుంచి 0.19 శాతానికి తగ్గాయని చెప్పగానే బల్లలు చరిచారని, తాము రైలు ప్రమాదాలను 0.19 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గించినా తమను నిందిస్తున్నారని, ఈ రకంగా దేశాన్ని నడపగలమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో తన ట్రోల్ ఆర్మీతో తప్పుడు విషయాలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తన దుష్ప్రచారంతో రైల్వేల్లో ప్రతిరోజూ ప్రయాణించే రెండు కోట్ల మంది ప్రజల గుండెల్లో గుబులు రేపుతోందని, ప్రయాణీకులను భయపెట్టడమే ఆ పార్టీ ఉద్దేశమా అని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రశ్నించారు. రైళ్లలో మూడింట రెండు వంతుల నాన్ ఏసీ కోచ్‌లు, మూడోవంతు ఏసీ కోచ్‌లు ఉంటాయని, జనరల్ కోచ్‌లకు పెరిగిన డిమాండ్ దృష్ట్యా ప్రతి మెయిల్, ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో కనీసం నాలుగు జనరల్ కోచ్‌లు ఉండేలా చూస్తామని చెప్పారు. ఇందుకోసం 2,500 జనరల్ కోచ్‌లు త్వరలో సిద్ధమవుతాయని మంత్రి తెలిపారు.

అసెంబ్లీలో గరం..గరం

(మొదటిపేజీ తరువాయి)

ఇలా గురువారమంతా అసెంబ్లీ హాట్‌హాట్‌గా కొనసాగింది. ఇటు స్పీకర్..అటు బీఆర్‌ఎస్ సభ్యులు ఎంతకీ తగ్గకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోవడానికి దారితీసింది. అయితే, ఆ పార్టీకి చెందిన ముగ్గురు మహిళా సభ్యులు సభ వాయిదా పడేవరకూ నిల్చొనే తమ నిరసన తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలు గురువారం ఏడు నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ సభ్యులు 10:05 గంటల ప్రాంతంలో నల్లరిబ్బన్లు ధరించి సభలో అడుగుపెట్టారు. సభ ప్రారంభం కాగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై స్పీకర్ చర్చ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మహిళా సభ్యులకు సీఎం క్షమాపణ చెప్పాలనీ, తమకు మైకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ సభ్యులు నిలబడి నిరసన తెలిపారు. స్పీకర్ పోడియం వద్దకు 10:11 గంటల ప్రాంతంలో వెళ్లారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుంటూ 'కేటీఆర్‌కు చెప్పా. సమయం ఇస్తా. దయచేసి బిల్లుకు సహకరించండి. కూర్చోండి' అని సూచించారు. దీంతో తమ స్థానాల్లోకి వెళ్లారు. ఐదారు నిమిషాలు కాగానే మళ్లీ స్పీకర్ పోడియం వద్దకెళ్లి 'సీఎం డౌన్ డౌన్..వియ్ వాంట్ జస్టిస్..సీఎం క్షమాపణ చెప్పాల్సిందే' అంటూ నినాదాలు చేశారు.

స్పీకర్ మరోమారు జోక్యం చేసుకుని 'మంత్రి మాట్లాడుతున్నారుగా..రన్నింగ్ కామెంట్లు ఏంటి? నినాదాలేంటి తొందరెందుకు? మాట్లాడేందుకు సమయం ఇస్తాం' అని చెప్పినా బీఆర్‌ఎస్ సభ్యులు వినలేదు. మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగాన్ని అట్లాగే కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత బీఆర్‌ఎస్ సభ్యులు చప్పట్లు కొడుతూ నినాదాలు చేయడం మొదలుపెట్టారు. దీంతో స్పీకర్ ఒకింత ఆగ్రహానికి గురవుతూ..సభలో నినాదాలేంటి? బిల్లు పాస్ కావడం ఇష్టం లేదా? ఏంటిది? కూర్చోండి? ఇదేం పద్ధతి' అంటూ అసహనం వ్యక్తం చేశారు. అక్కడే నిల్చుకున్న కేటీఆర్ 'సభాపతి మైకు ఇవ్వడం లేదు. మహిళా సభ్యులను అగౌరవపర్చినా పట్టదా?' అంటూ గట్టి అరిచారు. 'మీ సొంత ప్రయోజనాల కోసం ఇలా మాట్లాడొద్దు' అని గట్టిగా మందలించడంతో వారు కాసేపు శాంతించారు.

కొద్దిసేపు కాగానే నినాదాలు మొదలెట్టడంతో 'దయచేసి కూర్చోండి. సభా మర్యాదల్ని కాపాడండి. ఈ విధంగా చేస్తే బాగుండదు. ఇక్కడున్న వారిలో చాలామంది సీనియర్ సభ్యులున్నారు. సభకు ఇది మంచిది కాదు' అని విన్నవించారు. అయినా వారు వినలేదు. 10:30 ప్రాంతంలో సభలోకి సీఎం అడుగుపెట్టారు. దీంతో వారు మరింత గట్టిగా నినాదాలు చేశారు. స్పీకర్ ఒకింత ఆగ్రహానికి గురవుతూ 'ఇది అప్రజాస్వామికం. స్పీకర్‌పై ఒత్తిడి చేయొద్దు. కూర్చుకుంటే మైకు ఇస్తానని ఇప్పటికే పలుమార్లు చెప్పా. ఇలాగే నిలబడితే అస్సలే మైకు ఇవ్వను' అని తేల్చిచెప్పారు. తమతో గొంతు కలపాలని బీఆర్‌ఎస్ సభ్యులు బీజేపీ సభ్యులను పిలువగా వారు సున్నితంగా తిరస్కరించారు.

'సభను గందరగోళ పర్చడం సరిగాదు. ఇది సరైన పద్ధతి కాదు' అని పాల్వాయి హరీశ్‌బాబు చురకలు అంటించారు. కాసేపటి తర్వాత బీఆర్‌ఎస్ సభ్యులు కింద కూర్చొని నిరసన తెలపడం మొదలుపెట్టారు. నినాదాలు, చప్పట్ల మధ్య ఇతర సభ్యుల ప్రసంగం 11:30 వరకు కొనసాగింది. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ జోక్యం చేసుకుంటూ 'స్పీకర్ గారూ ఇదేటండి? సభను ఆర్డర్‌లో పెట్టండి? వారికి మైకు అన్నా ఇవ్వండి..లేకుంటే సస్పెండ్ అయినా చేయండి. కాసేపు సభను వాయిదా వేయండి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఈ పరిస్థితి నెలకొంది కాబట్టి స్పీకర్ తన కార్యాలయానికి పిలిపించుకుని ముగింపు పలకాలి. సభ సజావుగా సాగేటట్టు చూడాలి' అని స్పీకర్‌కు సూచించారు.

వెంటనే స్పీకర్ జోక్యం చేసుకుంటూ 'కూర్చొంటే మైకు ఇస్తానని ఎన్ని సార్లు చెప్పినా వినటం లేదు' అని అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..'సస్పెండ్ అనేది చివరి అస్త్రం' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సీట్లలో కూర్చుందాం పదండి' అంటూ సబితా ఇంద్రారెడ్డి బీఆర్‌ఎస్ సభ్యులను తీసుకెళ్లింది. మైకు ఇవ్వగానే స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుకు మద్దతు తెలుపుతున్నామనీ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని చెబుతూనే సభ జరుగుతున్న తీరు సరిగా లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ మైక్ కట్ చేశారు. దీనిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ముగ్గురు మహిళా సభ్యులు సభ వాయిదా పడే వరకు అట్లాగే నిలబడి తమ నిరసన తెలిపారు.

నేడే జాబ్ క్యాలెండర్

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ క్యాబినెట్ సంతాప తీర్మానం ఆమోదించింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేసింది. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయక చర్యలందించేందుకు నిర్ణయం చేసింది.

2. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది నిర్దిష్టమైన కాల వ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ జాబ్ క్యాలెండర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తారు.

3. రేషన్ కార్డుల జారీతో పాటు రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌తో హెల్త్ కార్డులను జారీ చేసేందుకు క్యాబినెట్ చర్చించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసేందుకు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సభ్యులుగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మెన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను విడివిడిగా ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానం చేసింది.

4. క్రీడాకారిణి ఈషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఒక్కొక్కరికి 600 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది.

5. విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్ రతన్ కుమారుడు హరిరతన్‌కు మున్సిపల్ కమిషనర్(గ్రూప్-1) ఉద్యోగం ఇవ్వాలని మంత్రివర్గం తీర్మానించింది.

6 ఇటీవల విధి నిర్వహణలో చనిపోయిన అదనపు డీజీ పి.మురళి కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

7. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ నియోజకవర్గం హుస్నాబాద్‌లోని గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు రూ.437 కోట్లను విడుదల చేసింది.

8.ఇటీవల రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వానికి తిరిగి పంపించిన ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి క్యాబినెట్ చర్చించింది. కోదండరాం, అమేర్ అలీ ఖాన్ ల పేర్లను తిరిగి కొత్త గవర్నర్ ఆమోదానికి పంపించాలని నిర్ణయం తీసుకుంది.

9 నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని భావించింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ బాధ్యతలు అప్పగించింది.

ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులకు విడివిడిగా కార్డుల జారీ

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం,అమీర్ అలీ
- మళ్లీ గవర్నర్‌కు ప్రతిపాదన
- క్రీడాకారులకు ఇండ్లస్థలాలు, ఉద్యోగాలు

10. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటితో శామీర్‌పేట చెర్వు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలతో చెర్వులు నింపి, మిగతా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

11. ధరణి పోర్టల్ పేరును భూమాతగా మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. రైతు భరోసా అమలుకు విధివిధానాలు ఖరారు చేసినట్టు సమాచారం.

12. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలోకి ఔటర్ గ్రామాలు, శివారు మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల విలీనానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రులు డి. శ్రీధర్‌బాబు అధ్యక్షతన ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్ సభ్యులుగా ఉపసంఘాన్ని నియమించింది.

ప్రస్తుత నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తాం

- అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తాం
- ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వ కృషి ఫలించింది : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్లలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రయత్నిస్తామనీ, అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ముందుకెళ్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్రాలకే ఉందంటూ ఏడుగురు జడ్జీలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తూ బుధవారం అసెంబ్లీలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణపై అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇస్తే తనతో పాటు సంపత్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానని చెప్పి అప్పటి సీఎం కేసీఆర్ మాటతప్పారని విమర్శించారు. ఎస్సీవర్గీకరణకు కట్టుబడి ఉన్న తాము అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 23న డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క సూచనతో మంత్రి దామోదర రాజనర్సింహ, అడ్వకేట్ జనరల్‌ను సుప్రీం కోర్టుకు పంపామని చెప్పారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి ఫలించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. ఈ తీర్పునకు అనుగుణంగా దేశంలోనే ముందు వరుసలో ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో విడుదల చేసి నోటిఫికేషన్లలో కూడా మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వే షన్లు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు, బీజేపీ సభ్యులు ఏలేటి మహే శ్వర్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ్మ, విప్ అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ సభ్యులు ఎం.సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం మాట్లాడారు.

నేడే ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో సీఎం సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల పదోన్నతి పొందిన దాదాపు 30 వేల మంది ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సభను నిర్వహిస్తారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులు కూడా హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చే ఉపాధ్యా యులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాల నుంచి బస్సులను ఏర్పాటు చేసింది. వాహనాలకు ఎన్టీఆర్ స్టేడియంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో ఉపాధ్యాయ సంఘాల నేతల సమావేశాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారు ప్రాథమికంగా చర్చించారు. పెండింగ్ సమస్యల పరిష్కా రానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటన చేస్తారని తెలి సింది. నాలుగు డీఏల పెండింగ్, పీఆర్సీ అమలు, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత్ విద్యుత్, 317 జీవో బాధితుల సమస్య నూతన ఉపాధ్యాయుల నియామకం వంటి అంశాలపై స్పష్టత ఇచ్చే అవకాశమున్నది.

15 మంది చిన్నారులపై వీధి కుక్కల దాడి

నవతెలంగాణ-బాలానగర్

వీధి కుక్కలు కాలనీల్లో స్వైర విహారం చేస్తూ 15 మంది చిన్నారులపై దాడి చేశాయి. ఈ ఘటనలు హైదరాబాద్ బాలనగర్‌లో జరిగాయి. గాయపడిన వారిలో మూడేండ్ల చిన్నారి కూడా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బాలానగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత సాయినగర్, వినాయక్‌నగర్, రాజు కాలనీల్లో కుక్కలు మరో 14 మంది చిన్నారులపై దాడి చేశాయి. వారిలో ఏడాదిన్నర వయస్సు నుంచి 16 ఏండ్ల వయస్సు చిన్నారులున్నారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాలనీవాసుల ఫిర్యాదుతో డాగ్‌స్క్వాడ్ సిబ్బంది కుక్కలను పట్టుకుంది. ఏడాది కిందట ఇదే ప్రాంతంలో ఓ కుక్క 10 మందిపై దాడి చేసింది. వరుస ఘటనలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

దేశమంతా దంచికొడుతున్న వానలు

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డారు. నలుగురు గల్లంతయ్యారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోవడం, నదుల్లో నీటిమట్టం పెరిగి ఆకస్మిక వరదలు, అనేక వాహనాలు కొట్టుకుని పోవడం వంటి ఘటనలు జరిగాయి. కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులను హెలికాప్టర్ ద్వారా రక్షించారు. రహదారిని పునరుద్ధరించే వరకూ కేదార్‌నాథ్ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. దాదాపు అన్ని జిల్లాలోనూ గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

దేశరాజధానిని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఢిల్లీలో ముగ్గురు మరణించారు.

అనేక ఇండ్లు ధ్వంసమయ్యాయి. భారీ సంఖ్యలో వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. ఇక రోడ్లన్నీ జలమయం కావడం అంతులేని ట్రాఫిక్ సమస్యతో వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీలోని విద్యా సంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే బయకు రావాలని అధికారులు కోరారు. అలాగే, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడులోని నీలగిరి జిల్లా ఈ నెల 3 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతాన్ని సందర్శించాలనుకునే పర్యాటకులు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని అధికారులు కోరారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : పీఎంటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఎంటీఏ-టీజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీ లు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో మోడల్ స్కూళ్లను విలీనం చేసిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నా రని తెలిపారు. తెలంగాణలోనూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుల పరిధిలో మోడల్ స్కూళ్లను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యకార్డులివ్వాలనీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సీపీఎస్ డెత్ కం గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్, కారుణ్య నియామకాలు చేపట్టాలని వివరించారు.

ప్రభుత్వ భూముల్లో

గుడిసెలేసుకున్న పేదలకు పట్టాలివ్వండి

భూ పోరాటంలో పెట్టిన కేసులను ఎత్తేయండి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూముల్లో గుడిసెలేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసన మండలిలో పిటిషన్ల సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, వరంగల్, హన్మకొండ, మహబూబా బాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో ఇండ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలేసుకున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతాలను వెంటనే సర్వే చేసి మ్యానిఫెస్టోకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గుడిసెలేసుకున్న వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాని పిటిషన్ సమర్పించారు.

ఈ కుబేర్ బిల్లులపై వాస్తవాలు చెప్పండి

అన్‌లైన్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కుబేర్ ద్వారా చెల్లిస్తున్న బిల్లులు సక్రమంగా జరగడం లేదని వస్తున్న వార్తలపై సర్కార్ వివరణ ఇవ్వాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. 2023 జనవరి నుంచి మార్చి వరకు, 2024 జనవరి నుంచి మార్చి వరకు రాష్ట్రంలో జరిగిన ఈ కుబేర్ చెల్లింపుల సమాచారాన్ని బహిర్గత పర్చాలని కోరారు. కొంత కాలంగా ఈ అంశపై ఉద్యోగ వర్గాల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు మూడేండ్లు పెంచినప్పటికీ, 2021 నుంచి 2024 వరకు వాలంటరీ తీసుకున్న వారికి బెనిఫిట్స్ ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల రిటైర్మెంట్ తీసుకున్న వారికి గతంలో లాగా ఆలస్యం కాకుండా సత్వరమే చెల్లించాలని కోరారు.

మైక్ ఇస్తే శాపనార్థాలు ఇవ్వకపోతే నిరసనలు

అక్కలూ మీ క్షేమం కోరే చెబుతున్నా వారి ఉచ్చులో పడొద్దు



- ప్రతిపక్ష నేత సభకు రారు.. వచ్చినోళ్లు వాకౌట్ చేసిపోతారు
- స్కిల్స్ యూనివర్సిటీపై, రుణమాఫీపై చర్చ జరగనివ్వలేదు : సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే నిరసనలు ఇదేం పద్ధతి అని బీఆర్ఎస్ సభ్యులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కలూ.. క్షేమం కోరి చెబుతున్నా వారి ఉచ్చులో పడొద్దని హితవుపలికారు. గురువారం అసెంబ్లీలో ఆయన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లు'పై మాట్లాడారు. ఆనాడు నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు తీసుకొచ్చి వ్యవసాయం, విద్య, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇందిరాగాంధీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ పునాదులు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచంలో నైపుణ్యం ఉన్నవారి కొరత ఉందన్నారు. వృత్తి నైపుణ్యాలు లేకపోవడం వల్లనే దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ అన్ని రకాల నైపుణ్యాలను అందించేందుకే స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. భూమి పూజకు సభ్యులు రావాలని కోరారు. యంగ్ ఇండియాను పత్రిక మహాత్మాగాంధీ మొదలు పెట్టారనీ, ఆయన స్ఫూర్తితో వర్సిటీని ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు. లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పించడమే స్కిల్స్ యూనివర్సిటీ ఉద్దేశమని చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీపై ప్రధాన ప్రతిపక్ష నాయకులు సూచనలు ఇస్తే సంతోషించేవాళ్ళమన్నారు. ఆయన సభకు రారు, వచ్చినవారు వాకౌట్ చేసి వెళ్లిపోయారని విమర్శించారు. స్కిల్స్ యూనివర్సిటీలో 17 కోర్సులను యూనివర్శిటీలో ప్రవేశపెట్టబోతున్నామనీ, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఏడాదికి రూ.50వేల నామ మాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించబోతున్నామన్నారు. అవసరమైతే ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తామని భరోసానిచ్చారు. వర్సిటీ భూమిపూజకు సభ్యులు రావాలని కోరారు. తొలి ఏడాది ఆరు కోర్సుల ద్వారా రెండు వేల మంది శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో జిల్లాల్లోనూ అలాంటి కళాశాలలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీపైనా, స్కిల్స్ యూనివర్సిటీపై చర్చ జరగకూడదని బీఆరెస్ నేతలు ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు అక్కలను తాను సొంత అక్కలుగానే భావిస్తున్నానన్నారు. సీతక్కపై సోషల్ మీడియాలో అవమానించేలా మీమ్స్ పెడుతున్నారనీ, బీఆర్ఎస్ వాళ్లు ఆదివాసీ ఆడబిడ్డను అవమానించినట్లు కాదా? అని ప్రశ్నించారు. సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా ఢిల్లీ వెళ్లి రాజకీయ ఒప్పందం చేసుకున్న నీచులు వాళ్లు అని విమర్శించారు. దొర పన్నిన కుట్రలో అక్కలు బంధీలయ్యారనీ, వారి క్షేమం కోరి చెబుతున్నా ఆయన ఉచ్చులో నుంచి బయటపడాలని సూచించారు. కావాలనే కేసీఆర్ సభకు రావడంలేదన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులకు రాజకీయ జీవితం ఇచ్చిందే కాంగ్రెస్ అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఉద్దండులైన న్యాయవాదులతో వాదించి విజయం సాధించామన్నారు. దళితబిడ్డలు సంతోషపడే వేళ ప్రధాన ప్రతిపక్షం సభను వాకౌట్ చేసి పోవడం సరిగాదన్నారు.

రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

అసెంబ్లీ ఆవరణలో సీఎం చాంబర్ వద్ద ధర్నా...అరెస్టు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ పార్టీ రెండో రోజు ఆందోళన కొనసాగించింది. గురువారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం చాంబర్ ముందు ఎమ్మెల్యేలు నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం డౌన్,డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, అసెంబ్లీ మార్షల్స్‌కు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు వాహనంలో అసెంబ్లీ నుంచి తరలించారు. అంతకు ముందు నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో వెల్‌లో బైఠాయించారు. మర్షల్ వారిని అసెంబ్లీ ఆవరణంలోకి తీసుకొచ్చారు.ఆ తర్వాత సీఎం చాంబర్ ముందుకు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ శాసనసభలో అధికార పక్షం తమ గొంతు నొక్కుతున్నదని విమర్శించారు. తాము ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవనీ, తెలంగాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకరమన్నారు. ఇవాళ ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని చెప్పారు. ముమ్మాటికీ ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేననీ, అప్పటివరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు శాసనసభలో మూడుగంటలుగా నిల్చొని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవలక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి నిరసన తెలిపారు. సీఎం క్షమాపణలు చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులను అరెస్టు చేశారు.

స్వచ్ఛదనం పచ్చదనానికి ఏర్పాట్లు

- అధికారులకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వచ్ఛదనం- పచ్చదనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించినట్టు గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 5న ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్చంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలతో పాటు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పేదలు, కష్టాలు ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుంది

- పట్టుదల, క్రమశిక్షణ, ధైర్యానికి వెంకట్రావమ్మ ఆదర్శం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-బోనకల్

కష్టాలు, పేదలు, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంతవరకూ కమ్యూనిజం ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, చైతన్యానికి వెంకట్రావమ్మ ఆదర్శమని కొనియాడారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు పారా వెంకట్రావమ్మ సంస్మరణ సభ పార్టీ శాఖ కార్యదర్శి బండి నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత వెంకట్రావమ్మ చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పారా నారాయణరావు, పారా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమం సాదాసీదాగా సాగేది కాదని, కష్టాలు, కన్నీళ్లతో ఉద్యమాలు సాగుతాయని తెలిపారు. పార్టీని అడ్డం పెట్టుకొని పదవులు, డబ్బులు సంపాదించడం కుదరదని అన్నారు. వెంకట్రావమ్మ భర్త అమరజీవి వెంకటేశ్వరరావు గ్రామంలో ఆనాడు హత్యకు గురైనా వెనకడుగు వేయకుండా తన కుమారులైన నారాయణరావు, లక్ష్మీనారాయణను పార్టీ నీడలోనే తీర్చిదిద్దటం ఆమెకే సొంతమన్నారు. గ్రామంలో పార్టీని అభివృద్ధి చేయడానికి ఆటంకాలు, కష్టాలు, బాధలు ఎదురైనప్పుడు చాలామంది వెనుకడుగు వేస్తారని, ఆమె మాత్రం వాటన్నింటినీ తట్టుకుంటూ ముందుకే అడుగులు వేశారని గుర్తుచేశారు. తన ఇంటిని సీపీఐ(ఎం) కార్యాలయంగా మార్చి ఎంతోమంది పేదల సమస్యలు పరిష్కారంలో విశేషమైన కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యమంలో మహిళలు కీలకపాత్ర నిర్వహించినప్పుడే ఆ ఉద్యమం విజయవంతం అవుతుందన్నారు. ఆ విధంగా వెంకట్రావమ్మ ప్రజా ఉద్యమాలను, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఆమె పట్టుదల, క్రమశిక్షణ మనందరికీ ఆదర్శమని అన్నారు. ప్రతి కమ్యూనిస్టు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమం బలోపేతం కోసం కృషి చేసినప్పుడే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కష్టాలు, కన్నీళ్లు, ఆటంకాలు ఎదురైనప్పుడు ఎలా ముందుకు సాగాలో వెంకట్రావమ్మ ఆచరణలో అమలు చేసి నిరూపించారని, ఆమెను మనమందరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. వెంకట్రావమ్మ ఆదర్శం, పట్టుదల, ధైర్యం, క్రమశిక్షణ కలిగిన మంచి నాయకురాలని తెలిపారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు ఉమ్మనేని కోటయ్య, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు నివాళి అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మధిర రూరల్ కార్యదర్శి మంద సైదులు, మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, విశ్రాంత లెక్చరర్ కిలారు కృష్ణయ్య, మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కిలారు సురేష్, మోటమర్రి సొసైటీ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, గుగులోతు పంతు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు అండగా ఉందాం

- నేటి నుంచి విరాళాల సేకరణ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాయనాడ్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడి దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారనీ, వందలాదిమంది గాయపడ్డారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. భారీ ఆస్తి నష్టం జరిగిందని పేర్కొంది. కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం ముమ్మరంగా సహాయక చర్యలను చేపడుతున్నదని వివరించింది. బాధితులకు పునరావాసం కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తోందని తెలిపింది. ఈ కష్ట సమయంలో వాయనాడ్ ప్రజలు, బాధితులకు అండగా ఉండాలనీ, వారిని ఆదుకోవడానికి ఉదారంగా విరాళాలు అందించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు శుక్రవారం నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు మూడు రోజులపాటు విస్తృతంగా కదిలి విరాళాలు సేకరించి రాష్ట్ర కేంద్రానికి పంపాలని కోరారు. ఇక్కడి నుంచి తాము అఖిల భారత కేంద్రానికి పంపుతామని పేర్కొన్నారు. నేరుగా అఖిల భారత కేంద్రానికి పంపాలనుకునేవారు, పార్టీ కేంద్ర కార్యాలయం 'వాయనాడ్ ప్రత్యేక నిధి' విరాళాల కోసం ఏర్పాటు చేసిన ఈ క్రింది అకౌంట్‌కు పంపాలని సూచించారు. రూ.20 వేలకుపైగా విరాళాలు అందించే దాతలు వారి పేరు, చిరునామా, పాన్ నెంబర్ వివరాలను కింద పేర్కొన్న మెయిల్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు పంపేవారు 'వాయనాడ్ రిలీఫ్ ఫండ్ కోసం (ఫర్ వాయనాడ్ రిలీఫ్ ఫండ్)' అని పేర్కొనాలని సూచించారు. ఆ వివరాలను పార్టీ ఇ మెయిల్ ఐడీ cc@cpim.orgకి పంపాలని కోరారు.

విరాళాలు పంపే వివరాలు

అకౌంట్ పేరు	: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు)
అకౌంట్ నెంబర్	: 07621000432853
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	: పీఎస్ఐబీ 0000762
బ్రాంచ్‌పేరు	: పంజాబ్, సింద్ బ్యాంక్
బ్రాంచ్ పేరు	: భాయి వీర్‌సింగ్ సాహిత్య సదన్, న్యూఢిల్లీ

కాంగ్రెస్ మహిళలకు ఎక్కడా అన్యాయం చేయలేదు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎక్కడా అన్యాయం చేయలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నేతలు ఎందుకు దహనం చేయాలని నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? స్త్రీ శిశుశక్తి మహిళలకు స్కూల్ యూనిఫామ్ కుట్టే బాధ్యత ఇప్పించినందుకా? అన్ని నిలదీశారు. మహిళా సంఘాల ద్వారా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే నిర్ణయం తీసుకున్నందుకా? అని ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యేలను అక్కలనే గౌరవంగా సీఎం అన్నారన్నారు. కానీ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేస్తున్నందు వల్ల బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారన్నారు. తప్పుడు ప్రచారంతో దిష్టిబొమ్మల దహనం, నిరసన చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

సభ సమయాన్ని వృథా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రెండ్రోజులుగా అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ద్రవ్య వినిమయ బిల్లుపై గంటసేపు మాట్లాడే అవకాశమున్నా దాన్ని వృథా చేశారని బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. నిరసన వ్యక్తం చేయడం వారి హక్కు.. కానీ వెల్‌లోకి వెళ్లి రెండున్నర గంటలు రచ్చ చేయడం సరికాదన్నారు. పదేండ్లలో రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి.. అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. యువతను పూర్తిగా మోసం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు.. ఇతర పార్టీలకు మాట్లాడే సమయాన్నివ్వాలని, వారిని గౌరవించాలని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ఏడు నెలల్లో చేసిన అప్రజాస్వామ్య అంశాలపై తాము ఎప్పటికప్పుడూ లేవనెతున్నామని, తమను బుల్డోజ్ చేసే ప్రయత్నం బీఆర్ఎస్ పార్టీ నేతలు చేశారని అన్నారు.

స్కిల్ యూనివర్సిటీని స్వాగతిస్తున్నాం

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



తెలంగాణ యువత కోసం ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీని తమ పార్టీ స్వాగతిస్తోందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అయితే, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా చేసిన యూత్ డిక్లరేషన్, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పన గురించి సీఎం రేవంత్ రెడ్డి మార్చిపోయారన్నారు. రైతు రుణమాఫీపై అనేక ఆంక్షలు విధిస్తున్నారని, ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలిచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా మమ అనిపించారని ఆరోపించారు. 50శాతంపైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ. 9వేల కోట్లు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

కేసీఆర్ అందుకే అసెంబ్లీకి రావడం లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



దళిత స్పీకర్‌ను ఎక్కడ సార్ అని పిలవాల్సి వసుందోనని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం తీసుకొచ్చిన బిల్లుపై చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు విన్నవించినా స్పందించలేదని విమర్శించారు. గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ యువత నోట్లో మట్టికొట్టిందని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయలేదని అన్నారు. వైస్ ఛాన్స్‌లర్ల పోస్టులను రాజకీయ పునరావాసం కింద ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ వాటన్నిటినీ సరిదిద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. కీలక బిల్లుల విషయంలో విలువైన సూచనలు ఇవ్వకుండా పనికిరాని అంశాలను ముందు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ముందు పెట్టి రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. తమ పదేండ్ల పాలనలో సర్కారు బడుల్లో టాయిలెట్లు లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బంది పడినప్పుడు వారి ఆత్మగౌరవం మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. స్కిల్ యూనివర్సిటీ ఇప్పుడు ఒక విత్తనం మాత్రమే.. రానున్న రోజుల్లో మహావృక్షం అవుతుందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, యువతకు ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని స్పష్టం చేశారు.

వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రివెన్షన్ ఆఫ్ డిసెబుల్ యాక్ట్ ప్రకారం సదరు అధికారిపై చర్య తీసుకోవాలని సూచించారు, అలాగే పలువురు ఎమ్మెల్సీలు వివిధ సమస్యలను ప్రత్యేక ప్రస్తావన, పిటీషన్ల సమయంలో ప్రస్తావించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇష్టా రాజ్యంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఎస్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని మహమూద్ అలీ కోరగా, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, పారిశుద్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని వాణీదేవి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చికెన్‌గున్యా డెంగ్యూ తదితర వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని భానుప్రసాద్‌రావు ప్రస్తావించగా, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఎగ్గే మల్లేశం డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో మౌళిక సౌకర్యాలు లేవని మెడికల్ కౌన్సిల్ రూ.15 లక్షల పెనాల్టీ వేసిందని రవిందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కళాశాలలో సౌకర్యాల కల్పనకు నిధుల కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉన్నత విద్యా సంస్థల్లో బోధనా సిబ్బందిని నియమించాలని బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి కోరగా, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు విధులు మర్చి సామాన్యులపై తమ ప్రతాపం చూపిస్తున్నారని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, ఉద్యోగాల వేటలో విదేశాల్లో మృత్యువాత పడుతున్న ఎన్ఆర్ఐలకు నష్ట పరిహారం అందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం గిరిజనుల పెంచిన రిజర్వేషన్లు అమలు చేయాలని సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో చిన్న చిన్న భూ తగాదాలను పరిష్కరించేందుకు గ్రామ స్థాయి కమీటీలను ఏర్పాటు చేయాలని గోరటి వెంకన్న కోరారు. మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న సిబ్బందికి బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని రఘోత్తమ్‌రెడ్డి ప్రస్తావించగా, క్యాబ్, ఆటో డ్రైవర్ల మీటర్ చార్జీలు పెంచాలని తీన్మార్ మల్లన్న కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డ్ ఏర్పాటు చేయాలని ఎల్.రమణ కోరగా, 2008 డీఎస్సీ, 46 జీవో, గురుకులాల సిబ్బంది సమస్యలపై వెంకట్ పిటిషన్లు సమర్పించారు. రుణమాఫీపై పెట్టిన షరతులను వెంటనే ఎత్తేయాలని కోటిరెడ్డి ప్రస్తావించగా, వారసత్వ సర్టిఫికెట్లను ఇచ్చే అధికారం ఎమ్మార్వోలకు కల్పించాలని నవీన్‌కుమార్ కోరారు.

30 ఏండ్ల కల నెరవేరింది..

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఎస్సీ వర్గీకరణ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన మందకృష్ణ మాదిగ కృషి ఫలితమే వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండారం శివకుమార్, జి.ఈశ్వర్ బోయిని విజయకుమార్‌లు అన్నారు. వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాతబస్తీ జాహనుమా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్ నాగుల బండ కమిటీ హాల్‌లో బస్తీవాసులతో కలసి డా.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ నాయకులు వై నరేష్, గొట్టిముక్కల నవీన్, బి కిరణ్, వై బాబురావు, ఆర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ కూలీల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ఏ విధంగా మాఫీ చేస్తుందో అదే విధంగా వ్యవసాయ కూలీలకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్ల మూరి కృష్ణ స్వరూప్ గురువారం ఒక ప్రకటనలో సీఎం ఎ.రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. రైతుల ముసుగులో భూస్వామ్య వర్గాలకు ప్రజా ధనాన్ని ధారాదత్తం చేస్తున్నారని, వాస్తవానికి పంటలు, వ్యవసాయం చేసేది రైతు కూలీలేనని అన్నారు. వీరంతా మెజార్టీ దళిత బహుజనులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందినవారే ఉంటారన్నారు. రైతు కూలీలను వెంటనే గుర్తించి, వారికి గ్రామ స్థాయిలో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు పూర్తి అన్యాయం జరుగుతుందని, వారికి ప్రభుత్వాల నుండి ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ.5 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుండి ఈ వర్గాలకు చెందిన రైతు కూలీల బ్యాంకు రుణాలను వెంటనే మాఫీకి చర్యలు చేపట్టాలని, సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయాలని ఆయన రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలను డిమాండ్ చేశారు.

నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి



- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ జనాభాకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఐ(ఎం) పార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో రామ్ నగర్ ఈ సేవ బస్ స్టాప్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడంలేదని, నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ రద్దీతో, కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నారని, రోడ్ల వెడల్పు ఫ్లైఓవర్ నిర్మించినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదని, నగరంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య కనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేవని వెంటనే నగరంలో ప్రయాణికుల సంఖ్య కనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శి ఎం.దశరథ్ మాట్లాడుతూ.. ప్రస్తుత నగర జనాభాకు అనుగుణంగా నగరంలో 7000 బస్సులు ఉండాల్సిన చోట 2800 బస్సులు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హాయంలో 3800 బస్సులు ఉండగా ప్రస్తుతం వెయ్యి బస్సులను తగ్గించారు. ప్రయాణికుల ఇబ్బంది లను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్సు సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకటేష్, పి. మహేందర్, కె రమేష్, ఎ. విమల, జోన్ నాయకులు సిరాజ్, శ్రీరాములు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి



నవతెలంగాణ-సీటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టినందున అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, డిప్యూటీడిఈవోలు, డీప్యూటీ ఐఓఎస్, డీఈలు లతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 384 పాఠశాలల్లో పనులు చేపట్టగా ఇప్పటి వరకు 235 పాఠశాలల్లో పనులు పూర్తయినవని, 149 పాఠశా లల్లో పనులు పురోగతిలో ఉన్నాయని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన మంచినీరు సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, రిపేర్ తదితర పను లను ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డీఈఓలు, డీప్యూటీ ఐఓఎస్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనఖీ చేయాలన్నారు. నిర్దేశించిన వ్యవధిలో పనులను పూర్తి చేయాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. అనంతరం విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ సమీ క్షించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసిన టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అప్డేట్ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల హాజరు శాతం పెంచుటకు కృషి చేయాలన్నారు. గైరు హాజరవుతున్న పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఉర్దూ అక్షరాస్యతను పెంచుటకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి, ప్రత్యేక అధికారులు, డీప్యూటీ డీఈఓలు, డీప్యూటీ ఐఓఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌పై క్యాబినెట్ ఆమోదించడం హర్షనీయం

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



నవతెలంగాణ-ముషీరాబాద్

నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలండర్‌పై క్యాబినెట్ లో ఆమోదించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్యాబినెట్ మంత్రులు ప్రకటిస్తున్న నేపథ్యంలో విద్యార్థి నాయకులు చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, గౌరీ సతీష్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో ఏండ్లుగా పేరుకుపోయినటువంటి సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. నిరుద్యోగుల విషయంలో ఉద్యోగాల భర్తీ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేయడానికి ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ క్యాలెండర్ నిశ్చయించుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సీఎంకి మంత్రి మండలికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తెలంగాణ నిరుద్యోగుల పక్షాన ధన్యవాదాలు ఇచ్చిన హామీలను ఒక్కటి ఒక్కటిగా నెరవేర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కంకరబద్ధంగా ఇదే నిదర్శనమన్నారు.

కనకదుర్గకాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జీ ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హాజ్రీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్వాన్ డివిజన్ పరిధిలోని కనకదుర్గకాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జీ, కాంటెస్ట్ ఎమ్మెల్యే ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హాజ్రీ అన్నారు. కార్వాన్ డివిజన్ ప్రెసిడెంట్ జగన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన కనకదుర్గకాలనీ లోని బస్తీ సమస్యలుపై పాదయాత్ర చేశారు. కనకదుర్గకాలనీ ప్రెసిడెంట్ ముకేశ్ ముదిరాజ్, యూత్ నాయకులు శివ బస్తీలోని నెలకొన్న రోడ్స్, డ్రైనేజీ, వాటర్, స్పీడ్ బ్రేకర్స్, దోమల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్థానికంగా రోడ్లను, డ్రయినేజీ పనులు చేపట్టాలన్నారు. మంచి నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కాలనీలో వాహనదారుల ప్రమాదాలు నివారించేందుకు స్పీడ్ బ్రేకర్స్ వేయాలని అధికారులకు సూచించారు. దోమల విష జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికంగా పరిశుభ్రతను పాటించాలన్నారు. దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. త్వరలో సమస్యలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్. వినోద్ చోగ్లె, నర్మదా, సంతోష్, పద్మ, వనిత, సుజాత, ప్రవీణ్, చింటూ, తిరుపతి, టిల్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచే విధంగా మాట్లాడం హేయమైన చర్య

- యువ నాయకులు ముఠా జై సింహా
- ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం.. పలువురు నాయకులు అరెస్ట్

నవతెలంగాణ-ముషీరాబాద్

అసెంబ్లీలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడం హేయమైన చర్య అని మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ తెలియజేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహ డిమాండ్ చేశారు. మహిళల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని వ్యతిరేకంగా గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దానం చేసి ఆందోళన చేపట్టారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జై సింహా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలను దేవతగా పూజిస్తారని మహిళలను గౌరవించడం మన సాంప్రదాయం అని తెలిపారు. అటువంటి మహిళలను



సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని సీఎం నిక్రుష్టంగా మాట్లాడారన్నారు. బాధ్యతగల పదవిలో ఉండి ప్రతి ఒక్కరిని గౌరవించాల్సింది పోయి తన స్థాయి మరిచి మహిళలను కించపరచడం ఏంటని ప్రశ్నించారు. మహిళలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని అహంకార ధోరణితో వాక్యాలు చేశారని దీనిని యావత్ మహిళా సమాజం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మహిళలను సముచిత స్థానం కల్పించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సీఎం మహిళా లోకానికి క్షమాపణలు తెలియజేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూళ్లలో వెంటనే బదిలీలు చేపట్టాలి



- మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేపట్టాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెలంగాణ లెక్చరర్ ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్‌లలో పనిచేసే ఉపాధ్యాయులు 11సంవత్సరాలుగా తమ విధులు నిర్వహిస్తూ కుటుంబాలకు సైతం దూరం అవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉందని తెలిపారు. 15 మంది ఉపాధ్యాయుల కోసం 3000 ఉపాధ్యాయుల పోస్టుల ట్రాన్స్‌ఫార్లు నిలిచాయి. ఈ ట్రాన్స్‌ఫార్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కోర్టు కేసుకు సంబంధించిన విషయంపై ఏజీతో మాట్లాడి కేసులు ఉపసంహరించే విధంగా కృషి చేస్తానన్నారు. జేఏసీ నాయకులు అరవింద్ గోష్, సాయి చరణ్, రవీందర్, షాదీబ్, దేవి ప్రసాద్, ఇర్ఫాన్ అలీ, శివప్రసాద్, మహమ్మద్ కాజా, గుండు రవీందర్, రాజశ్రీ, పద్మ, జ్యోతి, విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. ఒకే పాఠశాలలో11 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోడీ ప్రభుత్వంలో గాడితప్పిన విద్యా వ్యవస్థ

- దేశంలో విద్యా రంగంలో ప్రక్షాళన జరగాలి
- ఎం సీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మోడీ ప్రభుత్వంలో గాడితప్పిన విద్యా వ్యవస్థ విద్యా రంగంలో ప్రక్షాళన జరగాలని ఎం సీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్ బీఎన్ హాల్ లో అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ జనరల్ బాడీ సమావేశాలు అధ్యక్ష వర్గం రాజు కుమార్ (బీహార్ రాష్ట్రం) ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి అధ్యక్షతన జాతీయ జనరల్ బాడీ సమావేశాల జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మైత్రి రాజశేఖర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి యంసీపీఐ(యు) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన రెండవసారి ప్రభుత్వం ఏర్పడిన కాలంలోనే విద్యా కాషాయీకరణ చేయడమే ముఖ్య అజెండాగా పనిచేస్తుంది. గడిచిన ఏడు సంవత్సరాలలో 15 రాష్ట్రాల వారిగా 70సార్లు పరీక్ష పత్రాలు లీకేజ్ అవ్వడంలో ఒక కోటి 70లక్షల మంది విద్యార్థులకు పరీక్షలు రాయలేక నష్టపోయారు. ఈ యొక్క లీకేజీల పరంపర నేటికీ అనగా నీట్ వరకూ నిర్విరామంగా కొనసాగించమని తెలిపారు. ఈ లీకేజీ కారణంగా యుజీసీ నెట్ ఎగ్జామ్ కూడా వాయిదా పడింది. తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మైత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థి నిరుద్యోగ విధానాలకు వ్యతిరేకంగా గత ప్రభుత్వంలో విఫలమైన కేజీ టూ పీజీ విద్యా విధానంతో పాటు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ హాస్టల్లో మౌలిక వసతులు కల్పిస్తూ టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది కొరతను భర్తీ చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ ప్రభుత్వ యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలని సమరశీల పోరాటాలు నిర్మించాలని సంకల్పంతో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జాతీయ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్నామని వార న్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ నిర్మాణ బాధ్యులు వస్కుల మట్టయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి, గడ్డం నాగార్జున, పోతుగంటి కాశి, భరత్, జబ్బర్ నాయక్, జన్ను రమేష్ టింకటి కుమార్ గడ్డం శ్రీకాంత్ ఏఐఎఫ్‌డీవై జాతీయ కమిటీ సభ్యులు వనం సుధాకర్, ఏఐఎఫ్‌డీవై జాతీయ సహాయ కార్యదర్శి గాదగోని రవి పొలబోయినరాజు, బిందు , రాకేష్ బన్ని తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్య సూత్రాలను పాటించాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్య సూత్రాలను పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్ దయార్ మార్కెట్‌లో ప్రో కేర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్య నియమాలు పాటించాలని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని కోరారు. మా సంస్థ ద్వారా ఆగస్టు 31 వరకు బీపీ,షుగర్ టెస్టులను ఉచితంగా చేస్తామని ప్రతి ఒక్కరు హెల్త్ క్యాంపును సందర్శించి చెక్ అప్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహా, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, శంకర్ ముదిరాజ్, మచ్చకుర్తి ప్రభాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్వైభవం కొరకు పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు నాయుడుతో చర్చించి తిరిగి వచ్చిన పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు ప్రధాన కార్యదర్శి నల్లెల కిషోర్, ఎడెల్లి భాను ప్రకాష్. పి.వంశీకృష్ణ, సిహెచ్. ప్రదీప్ గౌడ్, మేడిపల్లి శ్యామ్ సుందర్, ఎం. నర్సింహులు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబోలు నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పద్మ వెంకట్ రెడ్డి, ఈ విజయ్ కుమార్ గౌడ్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, ఎర్ర భీష్మ దేవ్, సీనియర్ నాయకులు ఆమునూరి సతీష్ బబ్లీ, రాగుల వీరేశం, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

ఆరు గ్యారెంటీలు, రైతు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎస్.ఎల్ పద్మ



నవతెలంగాణ-ముషీరాబాద్

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎస్.ఎల్ పద్మ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్వో కార్యాలయాల ముందు ధర్నాకు పిలుపు నేపథ్యంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో నాయకులు ఎం. రవికుమార్ అధ్యక్షతన గురువారం హిమాయత్ నగర్ మండల ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ డి.సంధ్యారాణి కి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు ఎస్.ఎల్ పద్మ హాజరై మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నేటికీ అమలు చేయలేక పోయిందని, గత పదిసంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డే లేని స్థితిలో లక్షలాదిమంది ఎదురు చూస్తున్నారన్నారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి బిఎస్ కృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, వెంకటేష్ గౌడ్, మహి ళా నాయకులు బేగం,మీనా నాయకులు కిరణ్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏ సమయానికి ఏ బస్సు వస్తుందో..!

- అయోమయంలో ప్రయాణికులు
- అంబర్‌పేట పటేల్ నగర్ చౌరస్తా వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్న వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రయాణికులు..



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆర్టీసీ బస్సు ఏ సమయానికి వస్తుందో తెలియదు. ఈరోజు ఒక టైం, రేపు మరో టైం.. ఆర్టీసీ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం వలన వివిధ కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తా నుంచి బయలుదేరే ఆర్టీసీ బస్సు పరిస్థితి.. ఉప్పల్ డిపోకు చెందిన 113ఎం/ జెడ్ ఆర్డీనరీ బస్సు పటేల్ నగర్ చౌరస్తా నుంచి ప్రతిరోజు గతంలో ఉదయం ఎనిమిది గంటల పది నిమిషాలకు బయల్దేరి మెహదీపట్నం వెళ్ళేది. ఈ సమయం వివిధ కళాశాలకు వెళ్లే విద్యార్థులకు పూర్తిగా అనుకూలంగా ఉండేది. అయితే గత జులై 14న ఈ ఆర్టీసీ బస్సు టైమింగ్ మార్చారు. ఉదయం 8 గంటలకే ఈ బస్సు వెళ్లి పోయేది దీనిపై కళాశాల విద్యార్థులు, ప్రయాణికులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పాత టైమింగ్ ప్రకారమే బస్సు బయలుదేరే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ అధికారులు మళ్లీ ఈ బస్సు టైమింగ్ మార్చారు. గురువారం ఈ బస్సు ఉదయం ఎనిమిది గంటలకే వెళ్లిపోవడంతో విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు ముందే వెళ్ళిపోతుండడంతో విద్యార్థులు తప్పని సరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. విద్యార్థులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టు కొని పాత టైమింగ్ ప్రకారమే ఉదయం 8 గంటల పది నిమిషాలకు బస్సు నడపాలని. కొత్త టైమింగ్‌ను రద్దు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల ప్రయోజనా లను దృష్టిలో పెట్టుకొని పాత టైమింగ్ ప్రకారమే పటేల్ నగర్ నుంచి బస్సు నడపాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



- భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్

నవతెలంగాణ-ముషీరాబాద్

అసెంబ్లీలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ తెలియజేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వైఖరిని వ్యతిరేకంగా గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ ఎదురుగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని ముఖ్యమంత్రి నిక్రుష్టంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఈ అవమానం కేవలం సబితక్కకు, సునీతక్కకు జరిగింది కాదని.. తెలంగాణ ఆడబిడ్డలు అందరి పట్ల జరిగిన అవమానమని పేర్కొన్నారు. మహిళలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.రూప్ సింగ్, నిర్మలారెడ్డి, చెన్నయ్య, మారుతి రావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం ఆగస్టు 02, 2024 www.navatelangana.com

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఉమానగర్ 13వ వార్డులో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు చిన్నారుల తల్లులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 13వ వార్డులో గత 12 ఏండ్లుగా కమ్యూనిటీ హాల్లో 8వ అంగన్వాడీ కేంద్రం కొనసాగుతుండేదని తెలిపారు. కాగా ప్రస్తుతం ఆ కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ చిన్నారులకు అంగన్వాడీ కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెల్లబుచ్చారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు అందుబాటులో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లులు కృష్ణవేణి, అపర్ణ, రాజేశ్వరి, శ్రావణి, లాస్యదేవి, లక్ష్మి, సుమలత, దానమ్మ, సోనియా, మౌనిక, వరలక్ష్మి సుప్రియా పాల్గొన్నారు.

మౌలాలి డివిజన్ అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. మౌలాలి డివిజన్‌లోని షాదుల్లా నగర్‌లో 450 డయా ఆర్‌సీసీ పైపులైన్ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షానికి కొండపై నుంచి నీళ్లు ఇండ్లల్లోకి వచ్చి ఎన్నో బాధలు అనుభవిస్తున్న షాదుల్లా నగర్ వాసులకు పైపులైన్ ఏర్పాటుతో ఊరట లభించిందన్నారు. ఆర్‌సీసీ పైపులైనుల కోసం గతేడాది జెడ్‌సి శ్రీనివాస్‌రెడ్డి రూ.28 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పైపులైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్‌కు స్థానికులు ఇర్షాద్, నిస్సార్, ఇక్బాల్ మహమ్మద్‌లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మధురిమ, రమణ, లింగారావు, సత్యం, మహేందర్, నాగేందర్, పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కార్యాలయంలో హరికిషన్ సింగ్ సుర్జిత్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ అగ్రనేత కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జిత్ వర్ధంతిని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సుర్జిత్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కోమటి రవి, ఆఫీసు కార్యదర్శి శ్రీనివాస్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోమటి రవి మాట్లాడుతూ.. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జిత్ బాల్యంలోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ప్రభుత్వ ఆఫీసుపై ఎగరవేసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. స్వాతంత్ర పోరాటంలో జైలు జీవితాన్ని అనుభవించారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ విచ్ఛిన్నాలకు వ్యతిరేకంగా నిలబడి సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులుగా నిలబడ్డారని అన్నారు. దేశ రాజకీయాల్లో బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యపరిచి ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కుటుంబం నుంచి వారసత్వంగా తనకు వచ్చిన ఆస్తిని పంజాబ్ పార్టీకి, కేంద్ర కమిటీకి అందజేసి ఉత్తమ కమ్యూనిస్టుగా నిలిచారని చెప్పారు. ప్రముఖ పాత్రికేయులు గుమ్మడి ప్రసాద్ పార్టీ నాయకులతో తను అనుభవాలను పంచుకున్నారు. బాలగంగాధర తిలక్ వర్ధంతి సందర్భంగా కేకే ప్రసాద్ బాబు మాట్లాడారు. పీఎం భార్గవ ప్రముఖ శాస్త్రవేత్త, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్ ప్రజల్లో తీసుకెళ్లడం కోసం అహర్నిశలు కృషి చేసిన వారి గురించి జయ రాజు ప్రసంగించారు. అధ్యక్షులు యాదగిరిరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధులు కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించారు. అనంతరం సబికులందరూ చిత్రపటానికి పూలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, జయ ప్రకాష్, పి.బి చారి, శివరామకృష్ణ, బంగారు నరసింహారావు, గౌసియా, శోభా, చందన్ రాజు, కేకే ఉన్నికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్ పరిధిలోని రామ్ రెడ్డి నగర్‌లో రూ.10లక్షల వ్యయంతో భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రామ్ రెడ్డి నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్, మంజు శంకర్ అపార్ట్‌మెంట్ దగ్గర రూ.17లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, కాంగ్రెస్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, సత్యమూర్తి, బ్రహ్మయ్య, రత్న భూషణ్ రావు, లక్ష్మీ కవిత, మాధవి, సోమయ్య రాము, సచిన్ కుమార్, రాజేశ్వరి, పద్మ, శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, లక్ష్మి కవిత, మాధవి, శ్రీదేవి, మ్యారియో, తులసి, స్వామి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలనీల అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని అన్ని కాలనీల అభివృద్ధే తమ లక్ష్యమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. పలు కాలనీల్లో అభివృద్ధి, పెండింగ్ పనుల గురించి మాన్‌సూన్ టీం సభ్యులతో వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని, ఎమర్జెన్సీ పనుల కింద రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ కీర్తికి సూచించారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇంజనీర్ ప్రశాంత్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

రూ.35 వేలతో బోరు మోటారు ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

ఎర్రకుంటలోని నల్ల పోచమ్మ దేవాలయంలో కొన్నేండ్ల క్రితం పాడైన చేతిపంపు బోరు స్థానంలో కొత్త మోటారు ఏర్పాటు చేయాలని గుడి కమిటీ సభ్యులు కోరడంతో బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్ తన సొంత నిధులు రూ.35వేలతో కొత్త బోర్ మోటారు, వైరింగ్, పైపులైన్, ట్యాంకర్, నల్లాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జంగం అశోక్, ఆశన్న, వాసు, భిక్షపతి తదితరులు సాయి జన్ శేఖర్‌ను గురువారం ఆలయంలోకి ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం బోరు మోటారును ఆన్ చేయించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి రామచందర్, విఠల్ యాదవ్, భూపాల్ రెడ్డి, దాసరి కర్ణ, వినయ్, నాగరాజ్, బొడ్డు శివ, కట్ట బుచ్చన్న గౌడ్, కుమార్, బాలరాజు, క్యాప్టెన్ చంద్రశేఖర్, సుధాకర్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు కృషి చేయాలి

- పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో, సుల్తాన్‌బజార్

దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని పాఠశాల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, ఎస్.బీ.టీ నగర్, తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, కాలనీ వాసులకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా నివారణ, దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ అవగాహనలో భాగంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ... ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలతో దోమలు ఉత్పత్తి జరుగుతుందని, వారానికోసారి ఇంట్లో డ్రమ్స్, బిందెలు, బకెట్లు తదితరాలలో నీటిని మార్చాలని, నీటి నిల్వ ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి ఇంట్లో దోమలు నిల్వ ఉండే పనికిరాని వస్తువులను తీసివేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్.బీ.టీ నగర్‌లో డెంగ్యూ బాధితుల ఇండ్లను సందర్శించి జ్వర బాధితుల గురించి వాకబ్‌చేసి సంబంధితులకు తీసుకోవాల్సిన చికిత్సలు, జాగ్రత్తలను వివరించారు. డెంగ్యూ టెస్టులు ఎక్కడ చేయించుకుంటున్నారు? ఎప్పటి నుండి డెంగ్యూతో బాధపడుతున్నారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచిత చికిత్సలు, మందులు అందజేయడం జరుగుతుందని, డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందాలని సూచించారు. పిమ్మట బంజారాహిల్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజువారీ ఓపీ జ్వరం కేసులు, డెంగ్యూ కేసుల రికార్డులను పరిశీలించి వివరాలను సంబంధిత వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దోమల నివారణకు, డెంగ్యూ తదితర వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి చీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.వెంకట్‌లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. వెంకట్, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజినీ, సంబంధిత ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధికి అమడ దూరంలో ఐదో డివిజన్



- కార్పొరేటర్ కనబడడం లేదని మేయర్ దృష్టికి తీసుకువెళ్లిన కాలనీ వాసులు

నవతెలంగాణ - జవహర్‌నగర్

జవహర్‌నగర్‌లోని ఐదో డివిజన్‌లోని న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గురువారం కాలనీవాసులు మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఐదో డివిజన్ కార్పొరేటర్ మురుగేష్ కనబడడం లేదని, కాలనీలలో సీసీ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ లేదని, వర్షాలు పడడంతో రోడ్లన్నీ బురదమయం అయ్యాయని తెలిపారు. త్వరలో బోనాల పండుగ ఉన్నందున గుంతలమయమైన రోడ్లను బాగు చేయాలని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మేయర్ డివిజన్‌లో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. మున్సిపల్ సిబ్బందితో కొన్ని సమస్యలకు సత్వర పరిష్కారం చూపించారు. మిగతా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, బోనాలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేస్తామని హామీని ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐదో డివిజన్ ఇన్‌చార్జి అబ్బగొని రాజ్ కుమార్ గౌడ్, ఆరో డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవి, న్యూ అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీవాసులు శ్రీనివాస్, చంద్రమౌళి, మల్లేష్, నరేందర్, సత్యనారాయణ, కిరణ్, మధుకర్, చిరంజీవి, దామోదర్, ఆంజనేయులు, వెంకటేష్, గణేష్, జాన్, ఆసిఫ్, ఏసుబాబు, బంగారయ్య పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు మేయర్ శంకుస్థాపన



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ద్వారక నగర్ కల్వర్టు పనులకు నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే ప్రజలకు రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ కమీషన్ రామలింగం, డీఈ చిరంజీవి, కార్పొరేటర్లు కాటపల్లి లత రాంచంద్రారెడ్డి, సీస వెంకటేష్ గౌడ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ పొన్నం తరుణ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శారద కిషన్ చారి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫక్కీర్ హరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గజ్జి సమత యాదవ్, నాయకులు మోదుగు శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్ కార్యాలయ సిబ్బందికి హెల్త్ క్యాంపు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు ఆదేశాలతో డీసీపీ అడ్మిన్ ఇందిర సమక్షంలో నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయ సిబ్బందికి గురువారం నేరేడ్‌మెట్ యూనిట్ డిస్పెన్సరిలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత ఆరోగ్య రక్త పరీక్షలు, మాక్సీవిజన్ కంటి హాస్పిటల్ వారిచే కంటి పరీక్షలు, సౌజన్య డెంటల్ హాస్పిటల్ వారిచే డెంటల్ పరీక్షలను చేశారు. హెల్త్ క్యాంపులో 163 మంది సిబ్బంది వివిధ రకాల టెస్టులు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ డాక్టర్ సరిత, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్ భద్రా రెడ్డి, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సాకేత్ (కార్డియో), డాక్టర్ శృతి పల్లవి (గైనకాల్జీ), డాక్టర్ రాధిక (జనరల్ ఫిజిషియన్), టెక్నీషియన్ హేమ, జనరల్ మేనేజర్ రవి కుమార్, భద్రత పిర్వో శివ, మ్యాక్సీవిజన్ అప్తమాలజిస్ట్ శివాజీ, శ్రీలేఖ, అమీన్, మార్కెటింగ్ మేనేజర్ మహేందర్, సౌజన్య డెంటల్ హాస్పిటల్ డాక్టర్ లిఖిత, డాక్టర్ వైష్ణవి, మార్కెటింగ్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా డిప్యూటీ మేయర్ జన్మదిన వేడుకలు



- విద్యార్థులకు బుక్స్, టిఫిన్ బాక్సులు పంపిణీ

నవతెలంగాణ - జవహర్‌నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా మహిళా నాయకురాలు సవిత గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. వికలాంగుల హక్కుల సమితి నాయకులు మోనార్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వికలాం గులు మొక్కను నాటి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలలో మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- బీఆర్ఎస్ మేడ్చల్ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి
- పోచమ్మ గుడి నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



నవతెలంగాణ-జవహర్ నగర్

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని బీఆర్ఎస్ మేడ్చల్ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో పోచమ్మ గుడి నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో కూడా జవహర్ నగర్‌లోని అనేక ఆలయాలకు విరాళాలు ఇచ్చారని, అనేక బస్తీలలో సొంత నిధులతో బోర్లు, రోడ్లు వేయించారని గుర్తు చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సాంబయ్య గౌడ్, కార్యదర్శి ప్రతాప్ చారి, కోశాధికారి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అడ్వైజర్ శ్రీనివాస్, సంపత్ యాదవ్, శైలేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

పాండు ముదిరాజ్ నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. గురువారం పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లి, చుట్టూ పక్కల ఉన్న కాలనీల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బుడిగ ప్రభు గౌడ్, విజయ్, భూపాల్, గోవిందరాజు, గౌడ్ అశోక్, అనిల్, శ్రీనివాస్, బాబు, శివ భానుచంద్, పెద్దపల్లి శ్రీనివాస్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, శ్యామ్, వెంకట్ రెడ్డి, భిక్షపతి గౌడ్, బాబు, సత్తమ్మ పుష్పలత, నవనీత, గిరిజ, సంధ్య, రామ, శిరీష, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

తై బజార్‌ను దక్కించుకున్న కొత్తకొండ వేణు



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట మేయర్ దొంతగాని కోటేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి సమక్షంలో గురువారం నిర్వహించారు. కొత్తకొండ వేణు, ఉపేందర్, కుమార స్వామిలు వేలం పాటలో పాల్గొన్నారు. రూ.6.50 లక్షలతో మొదలైన పాట రూ.6.67 లక్షలకు కొత్తకొండ వేణు తై బజార్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మేనేజర్ నగేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు బల్లి శ్రీనివాస్, గొడుగు వేణు, మనోహర్ రెడ్డి, నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడబిడ్డలపై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు



- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోడుప్పల్

అసెంబ్లీలో ఆడబిడ్డలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మహిళా శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పైన సీఎం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం ఉందని సోయిలేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతా వంటూ, ఆడబిడ్డలను నమ్ముకుంటే ముంచుతారం టూ... జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తన స్థాయి మరిచి చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. సీఎం వ్యాఖ్యలు కేవలం ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల గురించి కాదని, తెలంగాణ మహిళలందరినీ అవమానించారని పేర్కొన్నారు. మహిళలంటే కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిన్నచూపు ఇప్పుడు అందరికీ అర్థమైందని తెలిపారు. రాష్ట్రంలోని మహిళలందరికీ రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేష్, మధుసూధన్‌రెడ్డి, హరిశంకర్ రెడ్డి, నాయకులు రఘుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, యాసారం శ్రీనివాస్, జగన్ రెడ్డి, జోగి రెడ్డి,కిరణ్,కైసర్,మల్లం వెంకటేష్ గౌడ్,శ్యామల నర్సింహా,శంకర్ రావు, కళ్యాణి, ఇందిరా, మల్లిక, పుష్ప పాల్గొన్నారు.





మహిళలను అవమానించేలా సీఎం వాఖ్యలు : కార్పొరేటర్

నవతెలంగాణ -ఉప్పల్

సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలకు నిరసనగా కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో పార్టీ శ్రేణులు ఉప్పల్ పిస్తా హౌస్ చౌరస్తాలో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, మీర్పేట్ కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మదహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న ఆధ్వర్యంలో..

సీఎం రేవంత్‌రెడ్డి వాఖ్యలకు నిరసనగా రామంతాపూర్‌లోని హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద పార్టీ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూధన్ రెడ్డి, సంపత్ రావు, శంకరన్న, నర్సింగ్ రావు, నరసింహ ,శ్రీకాంత్ గౌడ్ ,ప్రశాంత్ గౌడ్, రమేష్, తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం చారిత్రాత్మక తీర్పు

మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చిరుమర్తి రాజు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నాం అని చిరుమర్తి రాజు అన్నాడు. గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. 50 ఏండ్ల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందని, ఎన్నో ఏండ్ల పోరాటానికి నేడు ఫలితం లభించిందన్నారు. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కిందని పేర్కొన్నారు. దశాబ్దాల కల నెరవేరిందని తెలుపుతూ.. దళితులందరకీ ఇది పండుగ రోజు అని, ఇంటింటా సంబురాలు జరుపుకునే రోజు అని తన ఆనందాన్ని రాజు వ్యక్తం చేశారు.

ఫోటో స్టూడియోను ప్రారంభించిన కోలన్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి వాసులు ఎల్లం దేవదాసు నూతనంగా ఆరంజ్ ఫోటో స్టూడియో ఏర్పాటు చేయగా.. గురు వారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మ రావు, కొలన్ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజీల వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలి..



- **ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మండలంలో ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు గురువారం పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్డుపై ఆందోళన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజీ సమీపం లోని బస్ స్టాప్ వద్ద ఆగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మెడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.కార్తిక్ మాట్లాడుతూ.. బస్సులు కాలేజీ నుంచి చాలా దూరంలో ఆగడం వలన విద్యార్థులు తరగతులు మిస్ అవుతున్నారని, అధిక జన సంచారం కారణంగా ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. అదనంగా విద్యార్థులు ప్రమాదకరమైన రీతిలో ఫుట్ బోర్డింగ్ చేస్తూ ప్రమాదా లకు గురవుతున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులను కాలేజీ బస్సు స్టాప్ వద్ద బస్సులను ఆపాలని కార్తీక్ కోరారు. ఈ మేరకు, జీడిమెట్ల డిపో చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. డిమాండ్లను నెరవేర్చకపోతే జీడిమెట్ల బస్సు డిపో ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ మండల ప్రధాన నాయ కుడు భగత్, అజయ్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరుతోంది



- **వడ్డేపల్లి ఎన్క్లేవ్ కల్వర్టు పనుల పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ**

నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్కేవ్ వద్ద, ఒక కోటి తొంబై లక్షల రూపాయల అంచనావ్యయంతో, వడ్డేపల్లి ఎన్కేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ హై టెన్షన్ లైన్ కింద, నాల మీద నిర్మించిన కల్వర్టు వరకు రూ. 24.65 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఇంజనీరింగ్ విభాగం అధికా రులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరుతోందని, వడ్డేపల్లి ఎనక్లేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ హై టెన్షన్ లైన్ కింద నాల మీద కల్వర్టు నిర్మాణంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు, కాలనీ వాసులకు ఎంతో ఉపశమనం కలిగి ప్రయాణ దూరం, సమయం, ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు.

కల్వర్టు వరకు రూ. 24.65 లక్షలతో చేపట్టబోయే అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించడం జరిగిందన్నారు. పనులలో వేగం పెంచాలని, త్వరితగతిన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖ వంతమైన,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ అధికారులను ఆదేశించారు. మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ఈ కార్యక్ర మంలో జీహెచ్ఎంసీ అధికారులు, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురివిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావు, బాలింగ్ గౌతమ్ గౌడ్ పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడితే సహించేది లేదు



- **కార్పొరేటర్లు పగుడాల శిరీష బాబురావు, మందడి శ్రీనివాస్ రావు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడితే సహించేది లేదని, అసెంబ్లీలో మహిళా నేతలపై సీఎం, డిప్యూటీ సీఎంలు చేసిన వ్యాఖ్యలకు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావులు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీనియర్ మహిళా శాసనసభ్యులపైన సీఎం, డిప్యూటీ సీఎంలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ... గురువారం కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్ స్టాండ్ వద్ద బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరే టర్ పగుడాల బాబురావులు విచ్చేసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళామణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ నిండు శాసనసభలో సీఎం, డిప్యూటీ సీఎం లు మహిళల పట్ల అత్యంత అవమానకరంగా ప్రవర్తించార న్నారు. మహిళలని నమ్మరాదని సూచించడం, నమ్మితే బతుకు బస్ స్టాండే అని వ్యంగ్యంగా అనడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి, మహిళా శాసనసభ నాయకు రాళ్లకు సీఎం, డిప్యూటీ సీఎంలు బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సీనియర్ నాయకులు పవన్ కుమార్, పాతూరి గోపి, రాజేష్ రాయ్, సాయి శ్రీనివాస్, నాగేశ్వరావు, సుభాష్ గౌడ్, ఆరోగ్య రెడ్డి పాల్గొన్నారు.



అసెంబ్లీలో బుధవారం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు చేసిన నీచమైన వ్యాఖ్యలకు నిరసనగా మియాపూర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా,ఉద్యమకారులు, సీనియర్ నాయ కులు, కార్యకర్తలతో కలిసి వివేకానంద నగర్ 122 డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు రాస్తారోకో చేశారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి



తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళా ప్రజా పతినిధులైన సబితాఇంద్రారెడ్డి పై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు చేసిన అహంకారపూరిత మాటలను నిరసిస్తూ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆదేశాల మేరకు మహి ళలు, బిఆర్ఎస్ పార్టీ నాయకురాల్లు మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కుళ్లిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మైసమ్మ చెరువు సమీపంలోని పొదల్లో లభ్యమైంది. ఈ ఘటనపై కూకట్‌పల్లి పోలీసులు వివరాలు తెలియజేశారు. గురు వారం ఉదయం 10॥ గంటల సమయంలో కూకట్‌పల్లి మూసాపేట్‌లోని మైసమ్మ చెరువు సమీపంలోని పొదల్లో, సుమారు 30-35 సంవత్సరాల వయస్సు గల ఒక కుళ్లిపోయిన గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యమైంది. కుడి చేతి ముంజేయిపై బి అక్షరంతో పచ్చబొట్టు రాసి ఉందని పోలీసులు గుర్తించారు. మరణించిన వ్యక్తి కార్గో ప్యాంట్, హాఫ్ స్లీవ్స్ కాలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో క్రైం నంబర్ 948/2024 యూఎస్ 194 బీఎన్ఎస్ఎస్ దర్యాప్తు పురోగతిలో ఉందని.. గత నెలలో సంబంధిత పీఎస్ పరిమితుల్లో మ్యాన్ మిస్సింగ్ కేసులను ధృవీకరించి, ఎవరైనా ఏవైనా ఆధారాలు ఉంటే, కూకట్‌పల్లి పీఎస్‌లో ఈ క్రింది నంబర్లను సంప్రదించాలని 8712663145, 9490617123 కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- **మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గురువారం గాజులరామారం గ్రామంలోని పలువురు స్థానికులకు రోడ్డు వెడల్పు గురించి మున్సిపల్ నుండి వచ్చిన నోటీసులు మాజీ ఎమ్మెల్యే కి దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే, ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, అందులో భాగంగానే మునుపెన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో నగర అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించారని ఆయన అన్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యే కి పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలి..



- **పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్ర రెడ్డి**

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ.. దోమల వృద్ధిని అరికట్టాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉట్ల చంద్ర రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేనలు తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో.. దోమల నివారణ వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన సదస్సు కార్యక్రమ ర్యాలీని వారు ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సిబ్బంది, మహిళ మండలి సిబ్బంది, స్థానిక నేతలు, మహిళలతో కలిసి వీధుల్లో తిరుగుతూ.. స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరల్లో నిండే వృథ నీటిని వెంటవెంటనే తొలగించా లన్నారు. మురుగు నీటితో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంట్లో పేరుకుపోయే చెత్తా, చెదారాన్ని నిత్యం ఇంటిముందుకు వచ్చే చెత్త రిక్షాల్లో వేయాలన్నారు. దోమకాటు ద్వారా వచ్చే రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు ముందుగానే జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ర్యాలీలో పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉట్ల చంద్రారెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ ఇంద్రసేనా, సీఓ సుజాత, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు టి.పద్మావతి, వి.శోభరాణి, రేణుక సువర్ణ పాల్గొన్నారు.

కోలన్ కృష్ణ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా..కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బాచుపల్లిలోని తమ నివాసంలో, వేడుకల్లో పాల్గొని శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎంసీ కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 18 వార్డ్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ మల్లికార్జున్ రెడ్డి, కాసాని సుధాకర్ ముదిరాజ్, వీరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ యూసీడీ, జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన సమాఖ్య లీడర్లు



నవతెలంగాణ-బాలానగర్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ కమ్యూనిటీ అర్బన్ డెవలప్‌మెంట్ (యూసీడీ) ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, జీహెచ్ఎంసీ కమిషనర్ అపూర్వ చౌహాన్‌లు సమైక్య లీడర్లకు గౌరవ వేతనం అందజేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ గురువారం మహిళా సమాఖ్య లీడర్లు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత 25సం॥గా సమాఖ్య ప్రెసిడెంట్లుగా పని చేస్తూ అటూ జీహెచ్ఎంసీ ఇటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్న సమాఖ్య లీడర్లను గుర్తించి, వారికి గౌరవ వేతనం జీహెచ్ఎంసీ నుంచి ఇవ్వాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. సమాఖ్య లీడర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో గణిత, సంతోషి, అనంత లక్ష్మీ, మధులత, చంద్రకళ, శోభ రాణి, సునంద, రోజా తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్నెవడ్రా ఆపేది..

- **జరిమానా హెచ్చరిక ఫ్లెక్సీ కట్టినచోటే చెత్త వేస్తామంటున్న కొందరు ప్రజలు**
- **నామమాత్రంగా ఫ్లెక్సీ..చర్యలు మాత్రం శూన్యం**



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చెత్త వేయరాదు వేస్తే ఐదు వందల నుంచి వేయి రూపాయల జరిమానా విధించబడును అంటూ.. జీహెచ్ ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు, హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కడుతున్నారు. కానీ ప్రజలు మాత్రం మమ్మ ల్నెవడ్రా ఆపేది అనుకుంటూ.. ఫ్లెక్సీ కట్టినచోటే ప్లాస్టిక్ కవర్లో చెత్త తీసుకొచ్చి పడేసి వెళ్తూ.. ఆ ప్రాంతాన్ని కంపు కంపు చేస్తున్నారు. జరిమానా విధిస్తామని ప్రకటించిన ప్పటికీ చెత్త అక్కడే వేస్తున్నారంటే అక్కడ తప్పు అధికారులదా, ప్రజలదా, అంటే ఫ్లెక్సీ కేవలం నామమా త్రంగా కట్టి వదిలేయడమే అందుకు కారణం అని స్థానికుల మాట. ఇలా రోడ్ల పై చెత్త వేయకుండా ఉండాలంటే, అధికారులు ఫ్లెక్సీలు కట్టించడంతో పాటు, చెత్త రోడ్లపై వేసే వారి కి కచ్చితంగా జరిమానా విధించి వసూలు చేస్తే తప్ప.. రోడ్ల పై చెత్త వేయడం మానరు. అలాగే ప్రతి కాలని, బస్తీల్లో ఇండ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనల్లోనే చెత్త వేసేలా మరింత అవగాహన కల్పిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

'తల్లిపాల ప్రయోజనాలను తెలియజేయాలి



- **మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

నవతెలంగాన-సిటీబ్యూరో

అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని గ్రామస్థాయి, వార్డు స్థాయిలలో తల్లిపాల విశిష్టతను విస్తృత స్థాయిలో దాని వల్ల కలిగే ప్రయోజ నాలను తెలియజేయాలని సంబంధిత అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక తల్లిపాలు అన్నారు.

మొదటి ఆరు నెలల వరకు పుట్టిన పిల్లలకు కేవలం తల్లిపాలే సంపూర్ణ ఆహారం, సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి తోడ్పడుతుంది అని తెలియజేయాలని సూచించారు. సి - సెక్షన్ ద్వారా పుట్టిన శిశువు మను గడకు తల్లిపాలు పట్టించడం తప్పనిసరి అని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, జిల్లాకు సంబంధించిన సీడీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఎన్ఐఎస్ఏయూ' ఈవెంట్

నవతెలంగాన-సిటీబ్యూరో

ఆగస్టు 3వ తేదీన 'ఎన్ఐఎస్ఏయూ' ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ప్రముఖ విదేశీ విద్యా కన్సల్టెన్సీ అయి న గ్లోబల్ ట్రీ, ఎన్ఐఎస్ఏయూ, యూకె (నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని - యూకె) తో కలిసి నిర్వహించనున్న ఈవెంట్ పోస్టర్‌ను బేగంపేటలోని గ్లోబల్ ట్రీ హెడ్ ఆఫీస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్క రించారు. విల్లా మేరీ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో నిర్వహి ంచనున్న ఈ ఈవెంట్‌లో ఔత్సాహిక విద్యార్థులు, ప్రొఫెష నల్స్‌కు ఒక పరివర్తన అనుభవాన్ని అందిస్తుంది. ఈ కార్య క్రమంలో గ్లోబల్ ట్రీ ఎండీ ఫౌండర్ శ్రీకర్ ఆలపాటి, కంట్రీ హెడ్ గ్లోబల్ ట్రీ, నమ్రత గోటి పాల్గొన్నారు. 'ఈ ఈవెంట్ వారి పూర్తి సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడానికి, విజయవంత మైన భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న వ్యక్తు లకు కీలకమైన గేట్‌వే అని శ్రీకర్ ఆలపాటి అన్నారు.

"మా హాజరీలను శక్తివంతం చేయడానికి వనరులు, నైపుణ్య సంపదను తీసుకురావడానికి మేము సంతోషిస్తు న్నాము" అని సనమ్ అరోరా అన్నారు. ఈవెంట్‌లో సమా



చార సెషన్‌లు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, పరిశ్రమ నిపు ణుల నుంచి ఒకరిపై ఒకరు మార్గదర్శకత్వం ఉంటుంది. హాజరైనవారు వీసా ప్రక్రియలు, కెరీర్ అవకాశాలు, యూకెలోని శక్తివంతమైన విద్యార్థి జీవితంపై అవగాహన పొందుతారు. లిమిటెడ్ విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ రుసు ము లేకుండా ఈ ఈవెంట్ నిర్వహించబడుతోంది. ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు 77310 63106 నెంబర్‌కు కాల్ చేయండి. లేదా విద్యార్థి క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేసి పంపించండి.

అసంపూర్తి పనులు త్వరలోనే పూర్తి చేస్తాం



- **హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీ లేక్ వ్యూ విల్లాస్‌లో నెలకొన్న పలు సమస్య ల పరిష్కారానికి, చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై జీహెచ్ఎంసీ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి గురు వారం ఆయన పాదయాత్ర చేసి, క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ సంతులిత, సమగ్ర అభివృద్దే ధ్యేయ ంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశల వారిగా అభి వృద్ధి పనులు చేపడుతామన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను కూడా పరిగణలోకి తీసుకొని త్వరితగతిన సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. డ్రయినేజీ, రోడ్లు, మంచినీరు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్ సంభందిత సమస్యలను శాశ్వత పరి ష్కారం చూపుతామన్నారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి కానీ కార్పొరేటర్ కార్యాలయం దృష్టికి కానీ తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు మాధవరావు, నాగి రెడ్డి, శ్రీనివాస్, కోలన్ సంజీవ రెడ్డి, కోలన్ చంద్ర మోహన్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, బన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి చర్యలు తీసుకోవాలి



- **సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్**

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో ఏరియాలో విధి కుక్కల సైర విహారం చేస్తున్నా జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎం) బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. బాలానగర్ 120 డివిజన్‌లోని రాజుకాలనీలో ఒకేరోజు 15 మందిని గంట వ్యవధిలో వీధి కుక్కలు దాడిచేయడంతో చిన్నారులు గాయాల పాల య్యారు. దీంతో స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లో విధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారని, ముఖ్యంగా చిన్నా రులు బయటకు వెళ్లాలంటే అంటే ప్రాణాలను అర చేతు లో పెట్టుకోని బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి, కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని విధి కుక్కల బెడద లేకుండా చూడాలని అన్నారు.

నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | ఆగస్టు 02, 2024 | www.navatelangana.com

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జలమండలి డిప్యూటీ జీఎం



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లోని తార్నాక డివిజన్ జలమండలి విభాగానికి నూతనంగా డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన కుమారి నాజరీన్ శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డిను తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ వారి పని తీరుతో డివిజన్‌లో మరింత అభివృధి ఉండాలని అలాగే ప్రజలకు ఎలపుడు అందుబాటులో ఉండాలని తెలిపారు.

వర్గీకరణను అమలుచేస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయం



నవతెలంగాణ-ఓయూ

ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను వర్తిపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పడం, రాష్ట్రంలో వర్గికరణ చేస్తాం అనడంపై ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమె నదన్నారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నాం అని తెలిపారు. అలాగే తెలంగాణ సీఎం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో వెంటనే అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. దాదాపు ఇరవై సంవత్సరాల న్యాయమైన పోరాటం ఫలించిందన్నారు. పులిగంటి వేణు కాంగ్రెస్ నాయకులు, రాజు, శ్రీనివాస్, సాయి, రాము, ప్రశాంత్, మహేష్, ఆంజనేయులు, రంజిత్ , పాల్గొన్నారు.



అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది

- నేషనల్ యూనియన్ ఆఫ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి టి శ్రీనివాసరావు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉద్యోగులు అంకితభావతం పని చేస్తే అదే గుర్తింపు తెస్తుందని నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఫెడరేషన్ సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మల్కాజిగిరి పోస్టాఫీసులో 24 సంవత్సరాలుగా పోస్ట్‌మెన్‌గా వడ్డే కృష్ణయ్య విధులు నిర్వహించి బుధవారం పదవి విరమణ చేసిన సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో పదవి విరమణ సభ ఏర్పాటు చేశారు. లింగ ఫంక్షన్‌లో జరిగిన ఈ సభకు శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ అధికారి సుబ్రమణ్యం, మల్కాజిగిరి పోస్టుమాస్టర్ శ్యామల, అధికారులు శివాజీ, అంబేద్కర్, రైల్వే అధికారి గౌతం,మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాములు, డివిజనల్ కార్యదర్శి శ్రీనివాస చారి,యూనియన్ నాయకులు పి.ఆనందం,మాజీ డివిజనల్ కార్యదర్శి గవ్వల శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు మూర్తి రాములు, పలు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, పాల్గొని కృష్ణయ్యను పూలమాలలతో, శాలువలతో సన్మానించి ప్రసంగించారు. పోస్టుమ్యాన్‌గా వడే కృష్ణయ్య 24 సంవత్సరాలుగా మచ్చ లేకుండా విధులు నిర్వహించి మన్ననలు పొందారని ప్రశంసించారు . కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో గల పోస్టల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



మాదిగ అమరవీరులకు నివాళులు

నవతెలంగాణ-ఓయూ

30సంవత్సరాల వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని, ఈ విజయం మాదిగ అమరవీరులకు అంకితమంటూ గురువారం ఓయు ఆర్ట్స్ కళాశాల వద్ద తెలంగాణ మాదిగ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (టీఎంఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు బుషిపాక గణేష్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు పాలాభిషేకం చేస్తూ పుష్పాంజలి ఘటించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఎస్ఎఫ్ మాజి జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి మాదిగ హాజరయ్యారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట అధ్యక్షులు స్టాలిన్,టీఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాకిరేకంటి సైదులు మాదిగ, ఎస్‌టీఎస్‌ఏ రాష్ట అధ్యక్షులు తాళ్ళ అజయ్, డీటీఎస్ఏ రాష్ట అధ్యక్షులు దర్శన్, టీఎంఎస్ఓ రాష్ట నాయకులు నల్ల కృష్ణ మాదిగ, నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొ. యుగేందర్ పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న

మాల్స్, మల్టీప్లెక్స్‌లపై చర్యలు

- జీహెచ్ఎంసీ కమిషనర్

ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో



జీహెచ్ఎంసీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లెక్స్‌లపై చర్యలకు ఉపక్రమించినట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట బుధవారం తెలిపారు. నగరంలోని పలు మాల్స్, మల్టీప్లెక్స్, సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుండి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అట్టి విషయమై తనిఖీలు చేయుటకు ప్రత్యేకంగా టీమ్స్ వేసినట్లు తెలిపారు. సంబంధిత తనిఖీలలో కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ కింద రిజిస్టర్ చేసుకుని, మల్టిపుల్ స్క్రీన్ నడిపిస్తున్నట్లు బయటపడిందన్నారు. అదేవిధంగా అక్కడ ఫుడ్ స్టాల్స్‌ను తనిఖీ చేయగా కొన్ని చోట్ల ఫుడ్ స్టాల్‌లలో అమ్ముతున్న తినుబండారాలు నాణ్యత లేనివిగా గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తనిఖీలలో అక్రమాలకు గుర్తించిన ఆయా మాల్స్‌కు, మల్టీప్లెక్స్ లకు కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా క్షేత్రస్థాయి అధికారులకు నోటీసులు జారీ చేశారు.

'మాంగ్' ప్రజల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తా



- కొత్తగూడెం ఎమ్మెల్యే , సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు
- ఓయూలో అన్నాబావు సాఠే జయంతి

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలో నివసించే మాంగ్ సమాజ్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొనివెళ్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే , సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తెలిపారు. మాంగ్ సమాజ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే 104వ జయంతి ఉత్సవాలు ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన... డా. అన్నాభావు సాఠే లహుజి సాల్వే చిత్ర పటాలకు పూలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా. అన్నాభావు సాఠే ఆశయాలను ముందుకు తీసుకొనివెళ్ళాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. మాంగ్ కులం వారికీ కూడా కుల పత్రం తహాశీల్దార్ కార్యాలయం ద్వారా జారీ చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక అతిధులుగా పాల్గొన్న ప్రొ. పి జై కిషన్ ప్రొ. అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. డా. అన్నాభావు సాఠే సమాజానికి చేసిన సేవలను గుర్తుచేశారు. అతిథులుగా పాల్గొన్న చంద్ర గిరి సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు, ఎస్సి సెల్, టీజేఎస్, హైదరాబాద్ జిల్లా సహాయకార్యదర్శి స్టాలిన్, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్ లు మాట్లాడారు. సమాజానికి అన్నివేళలా తోడుంటామని డాక్టర్ సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే నుంచి ప్రేరణ తీసుకోని ముందుకు వెళ్లాలని సూచించారు. మాంగ్ సమాజ్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కాంబ్లే శంకర్ మాంగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాంగ్ సమాజ్ తెలంగాణ, హైదరాబాద్, కాంబ్లే సుధాకర్ మాంగ్, అధ్యక్షులు, మాంగ్ సమా హైదరాబాద్ కమిటీ, జి.చంద్రశేఖర్ మాంగ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, హైదరాబాద్ మహానగరం కమిటీ కార్యవర్గం సభ్యులైన ఎస్. దిలీప్ మాంగ్, ఎన్. రమాకాంత్ మాంగ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఓయూ

నగరంలో ట్రాఫిక్ , కాలుష్య సమస్య పరిష్కారం కోసం, ప్రజా రవాణా పెంపుదల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ నిర్వహించారు.బస్సుల సంఖ్య రెట్టింపు చేయాలని,మెట్రో రైలు బోగీలను 3 నుండి 6 కు పెంచాలని, ఎం. ఎం. టి .ఎస్ , లోకల్ రైళ్లను పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో గురువారం తుకారం గేటు బస్టాప్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎం అజయ్ బాబు, ఆరు మల్లేష్, డానియల్, నవీన్, ప్రేమలత, లక్ష్మి పాల్గొన్నారు.



బంజారాహిల్స్ : ప్రజల అవసరాల నిమిత్తం ప్రయాణిస్తున్న బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీ ఒమేగా ఆసుపత్రి బస్టాప్ వద్ద గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు,ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి గోపాస్ కిరణ్ కుమార్, జోన్ నాయకులు శ్రీనివాస్,లక్ష్మి,సత్తయ్య, రామస్వామి, వెంకటయ్య, దనమ్మ యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో రామకృష్ణ మకాం

- డైరెక్టర్ జనరల్ రాజేశ్వర, అదనపు డీజీ సోనమ్ లతో చర్చ

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ గత నాలుగు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. ఢిల్లీలో కంటోన్మెంట్ డైరెక్టర్ జనరల్, డీజీడీఈ రాజేశ్వరన్, అదనపు డీజీ సోనమ్ యాంగ్డోల్‌ను కలిసి కంటోన్మెంట్ సమస్యలపై చర్చించారు. అనంతరం వారికి వినతి పత్రాన్ని అందజేశారు. మూడు రోజుల క్రితం కంటోన్మెంట్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సంబంధించిన వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్ళారు. ముఖ్యంగా కొత్త బిల్డింగ్ బై-లాస్ పెండింగ్ సర్వీస్ ఛార్జీల విడుదల, బీఆర్ఎస్, బీపీఎస్ పథకాల అమలు, రక్షణ భూముల ప్రాంతాలలో ఉన్న దేవాలయాల కోసం ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భూ మార్పిడి విధానాన్ని అవలంభించడం ఏ 1, బి4 లేదా ఇతర రక్షణ భూముల్లోని మురికివాడల నివాసితులకు పునరావాసం కల్పించాలని, అభివృద్ధి పనుల కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అదనపు గ్రాంట్లు ఇవ్వాలని, రెండు స్కైవేలకు ప్రతిపాదిత రోడ్డు విస్తరణ వెడల్పును తగ్గించాలని, ఇతర సమస్యలపై ఢిల్లీలో అధికారులతో రామకృష్ణ చర్చించారు.

హబ్సిగూడలో కార్పొరేటర్ సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులే లక్ష్యంగా కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ డివిజన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మధుర నగర్ పార్క్ లో పచ్చదనం పెంపొందించడం కోసం గార్డెనింగ్, చెట్లపెంపకం, గురించి అధికారులకు తెలియజేశారు. రామంతపూర్ ప్రధాన రహదారిలో రోడ్డు డివైడర్ మధ్యలో చెట్ల కుండీలు ఏర్పాటుచేయాలని ఎల్బీనగర్ జోన్ యూబీడీ డిప్యూటీ డైరక్టర్ చంద్రశేఖర్, యూబీడి ఏఈ నర్సింహ్మరావుకు తెలియజేశారు. అనంతరం కామాక్షిపురం, వెంకటరెడ్డి నగర్‌లో డ్రయినేజీ సమస్య ఉందని తెలపడంతో హెచ్ఎండబ్ల్యూఎస్ఏఈ రవీందర్ కలిసి పనులను పరిశీలించి డ్రయినేజీ సమస్య తీర్చాలని వారిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, కల్మకల లింగం,అంజిరెడ్డి, మల్లేష్,స్థానికులు పాల్గొన్నారు.

7న బీసీల సత్యాగ్రహ దీక్ష



నవతెలంగాణ-బంజారాహిల్స్

సమగ్ర కులజనగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో సర్కార్ నిర్లక్ష్యంపై ఈ నెల 7న అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సత్యాగ్రహ దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ ప్రభిత్వానికి బీసీ సంఘాల హెచ్చరించాయి. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వివిధ బీసీ, కుల సంఘాలతో కలిసి విలేకరుల సమావేశంలో వక్తలతో కలిసి బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడారు.సమగ్ర కులజనగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రాల్లోనూ ఈనెల 20 వరకు సత్యాగ్రహ దీక్షలు చేపడతామని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి, వెంటనే సమగ్ర కుల జనగణన చేసి,స్థానిక సంస్థలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామజిక న్యాయం,రిజర్వేషన్ల గురించి ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కామారెడ్డి డిక్లరేషన్ ను తుంగలో తొక్కి.. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగుస్తున్నా కుల జనగణన స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చ లేకపోవడం దురదష్టకరమన్నారు. కామారెడ్డి డిక్లేషరేషన్ లో ఇచ్చిన హామీకి కట్టుబడి లేకపోతే ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. కుల జనగణన చేయనని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వనని చెప్పి.. తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని ఆయన డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చామకూర రాజు మాట్లాడుతూ కుల అస్తిత్వం లేని ఓటర్ లిస్టు ద్వారా రిజర్వేషన్లను గుర్తిస్తామని చెప్పడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఆగస్టు 7న ఇందిరా పార్క్ దగ్గర జరగనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను బీసీ కుల, బీసీ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీ.జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కష్ణ, అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు, హిందూ బీసీ ఆజాదీ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు దేశం మహేష్ గౌడ్, అంబేద్కర్ ఆజాదీ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగర నరహరి, హిందూ బీసీ మహాసభ సెక్రటరీ కె.విజయ్ కుమార్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నాయకులు పోశం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బాణా సంచా పేల్చి విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ

మనికేశ్వరీ నగర్ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోయా కుమార్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట గురువారం కోర్టు తీర్పు స్వాగతిస్తు భారీగా బాణా సంచా పేల్చి, స్వీట్స్ పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సాయంత్రం మాణికేశ్వరి నగర్‌లో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మాదిగ అమరవీరులకు నివాళులు అర్పిం చారు. ప్రధాన కార్యదర్శి జి. రవి, గిరిబాబు, మహేష్ , కళ్యాణ్ , కృష్ణ ,రాం చందర్ ,సైదులు , జయంతి, పాల్గొన్నారు.

రాజకీయ అధికారం వైపు మాదిగలు పోరాటం చేయాలి

ప్రొ.గాలి. వినోద్ కుమార్ పిలుపు

నవతెలంగాణ-ఓయూ



సుప్రీంకోర్టు షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు ఆర్థిక ప్రాతిపదికన తీర్పు ఇవ్వడం పేద మాదిగ ఉపకులాలకు మాల ఉపకులాలకు మేలు చేస్తుందని ఇది దక్షిణాదిలోని మూడు కోట్ల మంది మాదిగల ప్రజల పోరాట ఫలితం అని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. మాదిగ అమరవీరులకు ఈ తీర్పును అంకితం ఇస్తున్నామని ఇకనుండి మాదిగలు రాజకీయ అధికారం వైపు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. గురువారం తార్నాక లోని తన కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాతంగి ఓదెలు మాదిగ, నంద్రు నరసింహ మాదిగ, నాయుడు మాదిగ, ఉద్యమ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ నుండి గల్లీ వరకు పోరాటం చేసిన దక్షిణాదిలోని మూడు కోట్ల మంది మాదిగ వీరులకు ఉద్యమానికి సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు ప్రజా కుల సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. చివరికి న్యాయమే గెలిచిందని అయితే మాదిగలకు ఇది కేవలం పాక్షిక విజయమేనని అంతిమ పోరాటం రాజకీయ అధికారమన్నారు. ఆ దిశగా మాదిగలు సంఘాలకు అతీతంగా ఒక్కటై దక్షిణాదిలో రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

4న దండు మారమ్మ ఆలయంలో బోనాలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

బాలం రాయి దండు మారెమ్మ దేవాలయంలో ఈ నెల 4,5 ఆది, సోమవారాలలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. చారిత్రకమైన దేవాలయంలో జరిగే బోనాలను తిలకిచ్చేందుకు భక్తులు పలు ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని అన్నారు. 4న బోనాలు, 5 న రంగం ఉంటుందన్నారు.





లైంగికదాడి కేసులో నిందితుడు ఆస్ట్రేలియాకు పారిపోతుండగా అతన్ని చాకచక్యంగా పట్టుకున్నందుకు మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, వారి సిబ్బందికి నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి నగదును బహుమతిగా అందజేశారు.

నవతెలంగాణ-బేగంపేట్

ప్రహరీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



- మర్రి పురురవ రెడ్డి

నవతెలంగాణ-బేగంపేట్

బన్సీలాల్ పేట్ డివిజన్ బండమైసమ్మ నగర్ ప్రాంతమునకు ఆనుకొని ఉన్న రైలు పట్టాల దగ్గర ఉన్న గోడ కొద్ది భాగమును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్టు స్థానికులు తెలిపారు. ఆ దారి లో నుంచి పట్టాల పైకి కొందరు ప్రవేశించి అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గురువారం విషయమును స్థానికులు ఫోన్ ద్వారా బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళారు. మర్రి పురురవ రెడ్డి హుటాహుటిన బీజేపీ శ్రేణులతో కలిసి ఆ ప్రాంతమునకు చేరుకొని ధ్వంసమైన ప్రహరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మర్రి పురురవ రెడ్డి స్థానికులతో మాట్లాడుతూ కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీల సమస్యను త్వరలో రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసికొని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామినిచ్చారు. అవసరం అనుకొంటే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను కలిసి త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామిని ఇచ్చారు. బీజేపీ నాయకులు కుమార్ , జిల్లా స్లమ్ సెల్ కన్వీనర్ సత్యనారాయణ , జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కుర్మ శంకర్ , వెంకటేశ్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బి.కె.గూడ, చుట్టుపక్కల ఉన్న నివాసప్రాంతాల నడుమ అనేక హాస్టళ్ల కారణంగా తీవ్రమైన పార్కింగ్ సమస్యలేర్పడి గణనీయమైన ట్రాఫిక్ రద్దీకి, స్థానిక నివాసితులకు అసౌకర్యానికి దారితీస్తోందని ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ సి.ఐ.కి వినతి పత్రం సమర్పించి తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు కోరారు. మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, పిపిసి ఇంచార్జ్ రజినీకాంత్, ఎక్స్-యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోడాస్ నవీన్, నవీన్ రాజ్, వినోద్ సింగ్, ప్రతాప్ నాయక్, మాజీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, , సీనియర్ నాయకులు సత్యనారాయణ యాదవ్, మహేష్, ఆనంద్‌జిత్ కౌర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-బేగంపేట

ఓయూలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంబరాలు



నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఓయూలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. మంద కృష్ణ మాదిగ కి, మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన ఓయు ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని పటాకులు కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సిహెచ్ సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరపు శ్రీనివాస్ మాదిగ,జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు బంజూరు విజయ్ మాదిగ, ఎంఎంఎస్ నాయకురాలు జేరిపోతుల లత మాదిగ,సుజాత మాదిగ, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జన్నపాల మహేష్ మాదిగ,ఉపాధ్యక్షులు రాజీవ్ ప్రదీప్ మాదిగ,సీనియర్ నాయకులు ఏడవెల్లి అజయ్ మాదిగ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'నేటి ఉపాధ్యాయుల సభను విజయవంతం చేయండి'

నవతెలంగాణ -సిటీబ్యూరో

నేటి ఉపాధ్యాయుల సభను విజయవంతం చేయాలని జిల్లాలోని ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ పక్షాన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 9 ఏండ్లుగా ప్రమోషన్లు లేక, 6 ఏండ్లుగా బదిలీలు జరగక, 15 ఏండ్లుగా నలుగుతున్న పండితులు, పీఈటీలు అప్‌గ్రేడేషన్ల వంటి సమస్యలు పరిష్కారపు కాక మనోవేదనలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ఎన్ని ఆటంకాలు ఎదురైనా పరిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞత తెలుపటానికి పాఠశాల విద్యాశాఖ తరపున శుక్రవారం ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేసిన సభకు హైదరాబాద్ జిల్లాలో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు హాజరు కావాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు బి. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. తిరుపతిరెడ్డి కోరారు. జిల్లాలో 771 ఉపాధ్యాయులు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు 5500 ఫీఎస్, హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని,పెండింగ్‌లో ఉన్న డీఏలను, బిల్లులను మంజూరు చేయాలని, నూతన పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు.

తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- సయ్యద్ అసదుద్దీన్
- ముజీబ్ కుమారుడి ఉమ్రా విజయవంతంగా పూర్తి

నవతెలంగాణ-సిటీ బ్యూరో



టీఎన్జీవో యూనియన్, కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎన్. హుస్సేని (ముజీబ్) తనయుడు సయ్యద్ అసదుద్దీన్, వారి బంధువులు సయ్యద్ నవాజుద్దీన్ , మొహమ్మద్ బిలాలుద్దీన్ గురువారం పవిత్ర పుణ్యక్షేత్రం సౌదీ అరేబియాలో ఉమ్రా చేసి క్షేమంగా హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ఈ శుభ సందర్భంలో హైదరాబాద్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. డా.ముజీబ్ మాట్లాడుతూ పవిత్ర మక్కా మదీనా సందర్శించిన తన కుమారుడు, బంధువులకి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, నూతన ప్రభుత్వం అన్ని సాంఘిక సంక్షేమ కార్యక్రమంలో దేశంలో మొదటి స్థానంలో ఉండాలని, ఉద్యోగులందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం భారతదేశంలో అన్నిరంగంలో ముందుకు పోవాలని అల్లాను కోరుకున్నామని సయ్యద్ అసదుద్దీన్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న మేయర్



నవతెలంగాణ -సిటీబ్యూరో

బంజారాహిల్స్ లోని కే బీ ఆర్ పార్కు వాక్ వే లో ఆకలితో అలమటిస్తూ, అపస్మారక స్థితిలోకి చేరుకున్న గుర్తుతెలియని వ్యక్తిని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గమనించి అతడికి ఆహారం అందించడంతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి అతన్ని పునరావాస కేంద్రానికి తరలించారు. గురువారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కె.బి.ఆర్ పార్క్ వాక్ వే లో వాకింగ్ కు వచ్చిన మేయర్ పక్కనే అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడిని చూశారు. అతడి వద్దకు వెళ్ళి వాకబు చెయ్యగా తిండి లేకపోవడంతో నీరసించి పోయాడని తేలింది. దీంతో వెంటనే అతడికి భోజనం చేయించడంతోపాటు యూసీడీ విభాగం సిబ్బందిని పిలిపించి బేగంపేటలోని పునరావాస కేంద్రానికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ నగరంలోని పలు కూడళ్ల వద్ద ఇటీవల బెగ్గర్ల సమస్యలు ఎక్కువగా అయ్యాయని వారిని తరలించేందుకు త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని మేయర్ తెలిపారు.

మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ సంఘంఆధ్వర్యంలో గురువారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాంగణంలో బాణసంచా పేల్చి, అమరవీరులకు, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం సిల్వర్ శ్రీనివాస్ మాదిగ , రసమల్ల యాదగిరి మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీ కోర్టు న్యాయం చేసిందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన 59 కులాలకు ఎస్సీ రిజర్వేషన్ సమపాళ్లల్లో అంది అన్ని వర్గాల అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి మాదిగ, రమేష్, సంఘీ మహేష్ , కురుమయ్య , నర్సింహులు, దళిత సంఘాల నాయకులు రామడుగు సిద్దయ్య, భూదాల విజయ భాస్కర్ రావు, యాదయ్య , నడిమి దొడ్డి సలోమీ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట్ పరిధిలో
సీపీఐ(ఎం) నాయకుల పర్యటన





నవతెలంగాణ- చంపాపేట్

మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని శంకర్ నగర్, పద్మా నగర్, వినాయక వీధి, కమల్ నగర్ ప్రాంతాలల్లో సీపీఐ(ఎం) బృందం గురువారం పర్యటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి అబ్బాస్ హాజరై మాట్లాడారు. మూసీకి ఇరువైపులా 50 మీటర్ల దూరం వరకు ఇళ్లను తొలగించి, మూసీని అభివృద్ధి చేస్తామనడం చాలా విచారకరమన్నారు. ప్రభుత్వాలు మారడం..ఈ మూసీని ఎప్పుడు పడితే అప్పుడు డెవలప్మెంట్ పేరుతో ప్రజలను భయప్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 23 సంవత్సరాలుగా ఇక్కడే ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న ప్రజలను ఆకస్మాత్తుగా ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తే వారి బతుకులు చిందర వందరగా తయారవుతారని అన్నారు. మూసీ పరిసర ప్రాంతాలల్లో నివాసముండే ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో ఆఫీస్‌లను ముట్టడించడానికి సిద్ధంగా ఉండాలని స్థానికులకు పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) మలక్‌పేట్ జోన్ కార్యదర్శి ఎం. బాలు నాయక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు జి. విట్టల్ మీనా, నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సత్తార్, అలీమ్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది 'నవతెలంగాణ'



నవతెలంగాణ - చంపాపేట్

విజయవంతంగా 9 వసంతాలు పూర్తి చేసుకుని 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న నవతెలంగాణ దినపత్రికకు హార్థిక శుభాకాంక్షలు. బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన ఈ నవతెలంగాణ దిన పత్రిక నిలబడి ఈ 9సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకోవడంలో ఎంతో కృషి ఉంది. పేదల సమస్యలను 'నవతెలంగాణ' అధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి.. వాటిని పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయం. నిర్భయంగా, నిజాన్ని నిష్పక్షపాతంగా చాటుతున్న నవతెలంగాణ దినపత్రిక ముందు ముందు ఎన్నో వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

- ఎస్.విజయలక్ష్మి వికాస్ హై స్కూల్ మేనేజ్మెంట్

నవతెలంగాణ దినపత్రికకు శుభాకాంక్షలు



నవతెలంగాణ - చంపాపేట్

నవతెలంగాణ దినపత్రిక 9 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని, 10వ వసంతంలో అడుగు పెడుతుండడంతో.. నవతెలంగాణ యాజమాన్యానికి, శ్రేయోభిలాషులకు నా ప్రత్యేక హార్దిక శుభాకాంక్షలు. ఒక నిబద్ధతతో వార్తను వార్తగా ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఎన్నో ఉన్నతమైన ప్రమాణాలను నవతెలంగాణ దిన పత్రిక పాటిస్తుంది. అంతేకాదు ప్రజలను చైతన్య పరుస్తూనే తన ధర్మాన్ని నవతెలంగాణ పాటిస్తుంది. నవతెలంగాణ పత్రిక ఇంకా లోతైన విశ్లేషణతో ప్రభుత్వానికి, ప్రజలకు వారిదిగా తన కర్తవ్యాలను నిర్భయంగా ముందుకు తీసుకెళ్లాలి.

- ఎండి సయ్యద్ మక్కీ, ఖలీద్ హుస్సేన్ మక్కి
వికాస్ హై స్కూల్ (39 సంవత్సరం) మేనేజ్మెంట్

నిరంతరం పేదల పక్షాన నిలుస్తున్న 'నవతెలంగాణ'

నాగోల్ సీఐ సుధీర్ కృష్ణ



నవతెలంగాణ-నాగోల్

నవతెలంగాణ దినపత్రిక నిరంతరం పేదల పక్షాన నిలుస్తూ.. వారి సమస్యలను వెలికి తీస్తూ పరిష్కారానికి ఎంతో కృషి చేస్తుందని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్ కృష్ణ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆయన పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ మరింత అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్లాలని కోరారు.

సమస్యలను వెలికి తీయడంలో ముందుంటున్న 'నవతెలంగాణ'

భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి చైతన్య



నవతెలంగాణ-నాగోల్

ప్రజా సమస్యలను వెలికి తీయడంలో నవతెలంగాణ దిన పత్రిక ముందు ఉంటుందని భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య అన్నారు. ఈ మేరకు గురువారం నవతెలంగాణ దినపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ పత్రిక బడుగు, బలహీన వర్గాలకు, కార్మిక కర్షకులకు వెన్నంటి ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ఎలాంటి వ్యాపార దృక్పథం లేకుండా కేవలం పేద వర్గాల అభివృద్ధి కోసం ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్న నిలదొక్కుకుంటూ ముందుకు సాగుతుందని కొనియాడారు. నవతెలంగాణ దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ ఎన్నో ఇలాంటి వార్షికోత్సవం జరుపుకోవాలని ఆకాక్షించారు.

'ఎస్సీ వర్గీకరణపై తీర్పు హర్షనీయం'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ 30 ఏండ్ల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన ఎన్నో ఏళ్ల పోరాటానికి నేడు ఫలితం లభించిందన్నారు. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని, ఉద్యమ నాయకుడిగా కేసీఆర్, ఆనాడే ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది కాబట్టి తెలంగాణ రాష్ట ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల పక్షపాతి నవతెలంగాణ దినపత్రిక

శ్రీ దుర్గా విలాస్ యజమాని ముప్పవరపు వెంకటేష్ నాయుడు



నవతెలంగాణ -నాగోల్

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై విశ్లేషిస్తూ కథనాలను రాస్తూ ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ నవతెలంగాణ దినపత్రిక ప్రజల పక్షపాతిగా నిలుస్తుందని శ్రీ దుర్గా విలాస్ యజమాని ముప్పవరపు వెంకటేష్ నాయుడు కొనియాడారు. 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన గురువారం నవతెలంగాణ పత్రిక యజమాన్యానికి, సిబ్బందికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష పత్రికలు నిరంతరం ప్రజలకు వెన్నంటూ ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని పేర్కొన్నారు. మా తండ్రి ముప్పవరపు రంగయ్య నాయుడు కూడా విశాలాంధ్ర దినపత్రికలో చాలా కాలం పాటు పనిచేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంలో విజయవాడ రహదారులు పనామా వద్ద గడిచిన 39 సంవత్సరాలుగా దుర్గా విలాస్‌ను నడుపుతున్నామని.. అప్పట్లో ప్రజాశక్తి, తెలంగాణ ఏర్పడ్డాక నవతెలంగాణ పత్రికను చదువుతూనే ఉన్నామని చెప్పారు. నవతెలంగాణ దినపత్రిక ముందు ముందు మరింత అభివృద్ధి చెందుతూ ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై
సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



పేద వర్గాలకు సంపదలో వాటా దక్కేందుకు కులగణన కూడా తప్పదు

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణ - నాగోల్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు నియమించిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇవ్వడం హర్షనీయమని, కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లకు పైగా జరుగుతున్న ఉద్యమాలు, పోరాటాలకు సుప్రీం తీర్పు ఎంతో ఉపశమనం కల్పించిందన్నారు. వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం ఉందని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో తెలంగాణలో తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాల, మాదిగ ఉపకులాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకొని పనిచేస్తుందన్నారు. సమాజంలో వెనకబడిన, అణిచివేయబడిన కులాలు, వర్గాలకు సరైన సమయంలో సరైన న్యాయం తప్పక జరుగుతుందన్నారు. వారికి విద్య, ఉద్యోగ రంగాలలో సమాన అవకాశాలు కల్పించేలా వ్యవస్థలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనూ అన్యాయం జరుగుతున్న వర్గాలకు న్యాయం చేయడం కోసం కులగణన జరగాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్ సభలో డిమాండ్ చేస్తున్నారన్నారు. దేశాన్ని ఎక్స్ రే తీసి సంపదలో వాటా కల్పించాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ న్యాయమైనదన్నారు. కులగణన చేయక తప్పదని..పేద వర్గాలను గుర్తించి, వారికి సమాన అవకాశాలు, సంక్షేమం అందించక తప్పదని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

కొనసాగుతున్న
అక్రమ ఫూట్‌పాత్‌ల కూల్చివేతలు



నవతెలంగాణ-హయత్ నగర్

వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఫూట్ పాత్ నిర్మాణాల కూల్చివేతల్లో భాగంగా జీహెచ్ఎంసీతో కలిసి ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు రెండో రోజు ఎల్బీనగర్ కామినేని వద్ద కూల్చివేతలు చేపట్టారు. తదనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జీహెచ్ ఎంసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



30 ఏండ్ల
ఉద్యమ ఫలితం ఎస్సీ వర్గీకరణ



సుధాకర్ మాదిగ

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎస్సీ వర్గీకరణ సాధించిన ఘనత మంద కృష్ణ మాదిగకు దక్కుతుందని ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జి సుధాకర్ మాదిగ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహాలకు గురువారం పూలమాలలు వేసి, బాణా సంచాలు కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాలు అలుపెరుగని పోరాటం చేసి.. అనేక నిర్బంధాలు, బలిదానాలు, వేలాదిమంది జైలు జీవితాలకు ఊరట లభించిందన్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెల్లడించిందన్నారు. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మసనంఎస్సీ వర్గీకరణ తీర్పును వెల్లడించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ధర్మమైన విజయం అని, మాదిగ అమరవీరులకు అంకితం చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు అనిల్ కుమార్ మాదిగ, నియోజకవర్గ కార్యదర్శి ప్రకాష్ మాదిగ, రాజు మాదిగ, శేఖర్ మాదిగ, రాజు మాదిగ, రవి మాదిగ, చిరంజీవి మాదిగ, బుచ్చన్న మాదిగ, కాంగ్రెస్ నాయకులు బలరాం మాదిగ, గణేశ్, సాయి, నాగరాజు, పుల్లయ్య, శేఖర్, నాగరాజు, రాజు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

హెరాయిన్‌తో దొరికిన రాజస్థాన్ వాసి

నవతెలంగాణ-హయత్ నగర్

ర్యాపిడోలో పనిచేస్తూ గంజాయికి అలవాటు పడిన యువకుడిని ఎల్బీ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం...మొండా మార్కెట్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని ర్యాపిడో నడుపు కుంటూ విక్రమ్ కుమార్ అలియాస్ విక్రమ్ గోయల్ జీవనం సాగిస్తున్నాడు. ఇతని స్వస్థలం రాజస్థాన్. హెరాయిన్‌ను రాజస్థాన్ నుండి తక్కువ ధరకు కొనుగోలు చేసి.. నగరంలో ఎక్కువ ధరకు అమ్మేవాడు. గత నెల 31న ఎల్బీనగర్ నగర్ చౌరస్తాలో పట్టుబడగా అతని వద్ద నుండి 32గ్రాముల హెరాయిన్ దొరికింది. పోలీసులు కేస్ నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.





దృఢత్వానికి, కృషికి అసలైన చిహ్నం రైతు. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకొని అవిశ్రాంత కృషి చేస్తారు. సాంప్రదాయ వ్యవసాయానికి అతీతంగా.. పశుపోషణ, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి రంగాల్లోనూ రైతులు నేడు ముందుకు సాగుతున్నారు. అందులో మహిళా రైతులది ప్రత్యేక పాత్ర. ఇటు కుటుంబ బాధ్యతలు.. అటు వ్యవసాయ పనులు సమతుల్యం చేసుకుంటూ విభిన్న పాత్రలను పోషిస్తుంటారు. బీబీ అమర్‌జిత్ కౌర్ చాందీది అదే కోవ. అంకితభావం, నూతన ఆవిష్కరణ ద్వారా తన జీవితాన్నే కాదు.. అనేక మంది జీవితాలను మార్చిన స్ఫూర్తిదాయకమైన మహిళా రైతు గురించి పరిచయం నేటి మానవిలో...



తేనెటీగల పెంపకంతో...



పంజాబ్‌లోని కపుర్తలా జిల్లా, బూల్‌పూర్ గ్రామంలో స్థిరపడిన చాందీ కుటుంబంలోని వ్యక్తితో బీబీ అమర్‌జిత్ కౌర్ వివాహం 1993లో జరిగింది. తరతరాలుగా వ్యవసాయంలో నిమగ్నమైన కుటుంబం చాందీలది. కానీ వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు... ఎప్పుడూ నష్టాలే. కాగా, సంగీతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేసిన అమర్‌జీత్... ఆ రంగంలో ఉద్యోగావకాశాలు సరిగా లేక ఇంటిపట్టునే ఉండాల్సి వచ్చింది.

ప్రారంభం ఇలా..

సవాళ్ల ఎదురవుతున్నా... వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు అమర్‌జిత్ మార్గాలను అన్వేషించడం ప్రారంభించింది. ఈ క్రమంలో తేనెటీగల పెంపకంలో సాధ్యాసాధ్యాలను, లాభనష్టాలను పరిశీలించింది. చేయగలనన్న నమ్మకం, విశ్వాసం ఆమెలో కలిగాయి. ఇంట్లో ఒప్పించి తేనెటీగల పెంపక క్షేత్రాన్ని ప్రారంభించాలనుకుంది. దానికి చాందీ ఫామ్‌గా నామకరణం కూడా చేయాలని నిర్ణయించుకుంది.

తేనెటీగల ప్రపంచంలోకి..

అమర్‌జిత్ 1995 మార్చిలో తేనెటీగల పెంపక ప్రపంచంలోకి తొలి అడుగు వేసింది. 'వ్యవసాయంలో నష్టాలను ఎదుర్కొంటున్న నేను కొత్తగా ఈ రంగంలోకి అడుగు పెట్టాలంటే తొలుత భయపడ్డాను. కానీ, భర్త ప్రోత్సాహం, సహకారంతో ముందుకు సాగాను. కేవీకే, కపుర్తలాలో నిర్వహించిన వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా తేనెటీగల పెంపకంపై మంచి అవగాహన వచ్చింది. 1995 ఏప్రిల్‌లో ప్రత్యక్ష కార్యాచరణకు దిగాను. మొదట్లో 50 కాలనీలతో ప్రారంభించాను' అని అమర్‌జిత్ గుర్తుచేసుకున్నారు. చాందీ కుటుంబం అప్పటికే పొద్దుతిరుగుడు, ఆవాల సాగులో నిమగ్నమై ఉంది. 'నాకంటూ ఓ ప్రత్యేకతను చాటుకోవాలనుకున్నాను. అందుకే ఈ తేనెటీగల పెంపకాన్ని ఎంచుకున్నాను..' అని ఆమె చెప్పింది.

హనీ ప్రాసెసింగ్ ప్లాంట్ టెక్నాలజీ

2013లో.. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'హనీ ప్రాసెసింగ్ ప్లాంట్ టెక్నాలజీని ఇన్‌స్టాల్ చేసారు. ఇది వీరు ఉత్పత్తి చేసిన తేనె నాణ్యత, మార్కెట్‌ను గణనీయంగా పెంచింది. దీంతో ఆమె తన ప్లాంట్‌ను మరింత విస్తరించింది. రాణి తేనెటీగల ఉత్పత్తి, రాయల్ జెల్లీ, తేనెటీగల పుప్పొడిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. వారి ఆదాయాన్ని మరింత పెంచడంలో ఇది ఎంతో తోడ్పడింది. అంతేకాదు.. ఇతర రైతులను సైతం ప్రోత్సహించారు. వీటి పెంపకంలో మెళకువలను వారికి అందించారు. నేడు, వారి తేనెటీగల పెంపక వెంచర్ 400 కాలనీలకు పెరిగింది.

> **గుర్తింపులు, అవార్డులు**
>
> మార్చి 2008లో పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్శిటీలో జరిగిన కిసాన్ మేళాలో ముఖ్యమంత్రి అవార్డు, నవంబర్ 2018లో న్యూఢిల్లీలోని డీడీ కిసాన్ ఛానెల్ ద్వారా 'మహిళా కిసాన్ అవార్డు'లు ఆమెను వరించాయి. దీంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది.

స్వయం సహాయక బృందాల ఏర్పాటు


1996లో ఆమె స్వయం సహాయక బృందం 'చండీ ఉద్యోగ సమితి'ని స్థాపించింది. ఆ తర్వాత 2005లో బేబే నాంకి అనే మరో స్వయం సహాయక బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ గ్రూపులు అనేక మందికి ఉపాధి అవకాశాలను అందించాయి. 'స్వయం-సహాయక గ్రూపు(ఎస్‌హెచ్‌జీ)లను ఏర్పాటుచేయడం కేవలం వ్యాపారానికే కాదు. ఇది సమాజాన్ని నిర్మించడం, ఉపాధి కల్పించడం, పరస్పర సహకారం కోసం' అని అమర్‌జిత్ అభిప్రాయం. 1996లో మొదటిగా ఎస్‌హెచ్‌జీని స్థాపించిన తర్వాత.. అమర్‌జిత్ ఇతర రంగాలపైనా దృష్టిసారించింది. ఊరగాయ తయారీలో శిక్షణ పొందడం ద్వారా తన వ్యాపారాన్ని వైవిధ్యభరితంగా మార్చుకుంది. ఊరగాయలతోపాటు.. పసుపు ఉత్పత్తి, పాడి విక్రయాలనూ మొదలుపెట్టింది. ఇది వారి ఆదాయాన్ని మరింత పెంచింది.

ఇతర రైతులకూ శిక్షణ

అమర్‌జిత్ ఇప్పటివరకూ దాదాపు 900 మంది రైతులకు తేనెటీగల పెంపకం, సంబంధిత కార్యకలాపాల్లో శిక్షణ ఇచ్చింది. మా విజయాల్లో రైతులకు శిక్షణ ముఖ్యమైనది. మనం సంపాదించిన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ పంచాలి. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుంది' అని అమర్‌జిత్ అంటోంది. కృషి విజ్ఞాన కేంద్రం, కపుర్తలా, వ్యవసాయ శాఖ సహకారంతో ఆరు వందలకుపైగా కిసాన్ గోష్టిలు, శిక్షణా శిబిరాలను ఆమె నిర్వహించింది.


ఓ వైపు జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూ తన కుటుంబానికి ఆదాయం సమకూర్చటమే కాదు.. పంటలకు ప్రాణం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. బీబీ అమర్‌జిత్ కౌర్ చాందీ అంకితభావం అనేకమందికి స్ఫూర్తిదాయం. పట్టుదల కృషి ఉంటే సాధించలేనిదేదీ లేదని ఆమె ప్రయాణం మరోసారి రుజువు చేస్తున్నది.

- కె లలిత



మీరు డేంజర్‌లో ఉన్నట్లే..!

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ తప్పనిసరి అయింది. ప్రజలు ఎక్కువ సమయం మొబైల్‌లోనే గడుపుతున్నారు. అయితే చాలా మంది నిద్ర లేవగానే పక్కనే ఉన్న ఫోన్ పట్టుకుంటారు. అలా చేయడం వల్ల చాలా ప్రమాదాలు ఉన్నాయి. మరి అవేంటో తెలుసుకుందామా..!



మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే మీ మొబైల్ ఫోన్ ఉపయోగిస్తుంటే, అది మీ మెదడుపై చెడు ప్రభావం చూపుతుంది. ఫోన్ ఎక్కువగా వాడిన తర్వాత డిప్రెషన్ వస్తుందని చాలా నివేదికల్లో వెల్లడైంది.

ఉదయం లేవగానే మొబైల్ ఫోన్‌లో స్క్రోలింగ్ చూస్తుంటే మనశ్శాంతి దెబ్బతింటుంది. దీని వల్ల మెదడు ఒత్తిడికి గురవుతుంది. ఇది రోజువారి జీవితంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ఎక్కువగా మొబైల్ వాడకం చికాకుకు దారితీస్తుంది. తెల్లవారుజామున నిద్రలేచి ఎక్కువసేపు మొబైల్ ఫోన్లలో గడిపే వారికి ఎక్కువగా కోపం వస్తుంది.

ఉదయం లేవగానే ఫోన్ ఉపయోగించడం వల్ల మీ ఏకాగ్రత తగ్గుతుంది. దీనితో పాటు, మీ ఉత్పాదకతా తగ్గుతుంది.

ఉదయం పూట ఫోన్ వాడే అలవాటు వల్ల కొందరికి ఎక్కువ ఆకలి వేస్తుంది. ఇది ఆహారానికి సంబంధించిన సమస్యలను కూడా కలిగిస్తుంది.

జూరాల 46 గేట్లు ఎత్తివేత

• కొనసాగుతున్న విద్యుదుత్పత్తి • శ్రీశైలంలోకి భారీగా ప్రవాహం

నవతెలంగాణ- ధరూరు

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 46 గేట్లు ఎత్తి శ్రీశైలం ప్రాజెక్టులోకి వదిలారు. ఎగువన నారాయణపూర్ డ్యాం నుంచి 3 లక్షల 12వేల క్యూసెక్కుల నీరు జూరాలకు వస్తోంది. జూరాల 46గేట్ల ద్వారా 2 లక్షల 98వేల 827క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టులో 317.680 అడుగుల నీటిమట్టం ఉంది. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కుల నీరు, కోయిలసాగర్‌కు 630 క్యూసెక్కుల నీరు, లెఫ్ట్ కెనాల్ కాల్వకు 820 క్యూసెక్కుల నీరు, రైట్ కెనాల్‌కు 658 ఫైనల్ కాల్వకు 850 క్యూసెక్కుల నీరు, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి మొత్తం దిగువకు 3 లక్షల 20వేల 392 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంలోకి వదులుతున్నట్టు అధికారులు తెలిపారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి సీఎం హామీ

• ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక విద్యావ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీలో సీఎంను మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డితో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. 5,600 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలనీ, బీఈడీ, డీఈడీ ఉపాధ్యాయులందరికీ ఇవ్వాలని కోరారు. మూడు డీఏలను వెంటనే ప్రకటించాలనీ, మిగతా సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఒంటరైన వారి కోసం ప్రత్యేక శిబిరాలు

> **వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం**
>
> శిబిరాలకు ఉపాధ్యాయులను పంపుతాం
>
> వాయనాడ్‌లో పినరయి పర్యటన
>
> అధికారులతో భేటీ... పార్టీలతో అఖిలపక్ష సమావేశం
>
> బాధిత ప్రాంతాల్లో రాహుల్, ప్రియాంక పర్యటన



వాయనాడ్ : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం వాయనాడ్‌లో పర్యటించారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఇప్పటివరకు మృతుల సంఖ్య 300కు చేరింది. ఆయా ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపారు. విధ్వంసాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తన క్యాబినెట్ సహచరులతో కలిసి అధికారులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సహాయ, పునరావాస చర్యలపై ఆరా తీశారు.

ఆ తర్వాత అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుటుంబసభ్యులందరినీ కోల్పోయి ఏకాకులుగా మిగిలిన వారి కోసం వాయనాడ్‌లో ప్రత్యేకంగా సహాయ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిబిరాలలో ఉన్న వారి ప్రశాంతతను కాపాడేందుకు ప్రవేశాలపై ఆంక్షలు విధిస్తామని చెప్పారు. 'సందర్శకుల పేర్లను నమోదు చేసేందుకు జిల్లా అధికారులు రిసెప్షన్ డెస్కులు ఏర్పాటు చేస్తారు. సమావేశాలు, ఇంటర్వ్యూలకు ఉమ్మడి ప్రదేశం ఉంటుంది. శిబిరాలలోకి కెమేరాలను అనుమతించం' అని తెలిపారు.

కుటుంబసభ్యులు, బంధువులు, నివాసాలు, జీవనోపాధి...వీటన్నింటినీ కోల్పోయిన వారి కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. జరిగిన విధ్వంసం నుండి తేరుకునేందుకు, మానసిక ఆరోగ్యం కుదుటపడేందుకు బాధితులకు కౌన్సిలింగ్ ఇప్పిస్తామని, వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని చెప్పారు. బయట నుండి శిబిరాలలోకి ఆహారం, దుస్తులు, ఇతర సామగ్రిని అనుమతించబోమని స్పష్టం చేశారు. అవన్నీ జిల్లా అధికారుల ద్వారానే బాధితులకు అందుతాయని తెలిపారు. సహాయ శిబిరాలకు ఉపాధ్యాయులను పంపి, విద్యార్థుల చదువులు దెబ్బతినకుండా చూస్తామని పినరయి చెప్పారు. బాధిత ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలకుండా చూడడమే తన ప్రభుత్వ ప్రాధాన్యత అని అన్నారు. చలియార్ నదిలో ఇంకా మృతదేహాలు కొట్టుకువస్తూనే ఉన్నాయని తెలిపారు. ఇరువజంజిపుజా నదిపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని, అయితే నదిపై బెయిలీ బ్రిడ్జిని సైనికులు నిర్మించడంతో పరిస్థితి చక్కబడిందని చెప్పారు. శిథిలాలను తొలగించే పని పూర్తి కావడానికి వారాలు లేదా నెలలు పట్టవచ్చునని అన్నారు. గాలింపు చర్యలు పూర్తయిన తర్వాత బాధితులకు పునరావాస పథకాన్ని ఖరారు చేస్తామని తెలిపారు. వాయనాడ్‌లో కార్యక్రమాలను క్యాబినెట్ సబ్ కమిటీ పర్యవేక్షిస్తుందని పినరయి ప్రకటించారు.

కాగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ కూడా వాయనాడ్‌లోని చూరల్‌మాల ప్రాంతాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలతో ముచ్చటించారు.

పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు

వందలకోట్లు బూడిదలో పోసిన పన్నీరే

• బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ.

• నూతన భవన నిర్మాణంపై ప్రతిపక్షాలు ఆగ్రహం

• పాత భవనంలోనే సమావేశాలు నిర్వహించాలని అఖిలేశ్ సూచన



న్యూఢిల్లీ : వందేండ్లు దాటిన పాత పార్లమెంట్ భవనం ఇప్పటికీ చెక్కుచెదర్లేదు. ఎన్డీఏ సర్కార్ వందలకోట్లు ఖర్చుపెట్టి హడావుడిగా కట్టిన నూతన పార్లమెంట్ భవనం లాబీలో వర్షపు నీరు కారుతోంది. సిబ్బంది బకెట్ పెట్టి .. ఆ నీటిని పారేస్తున్నారు. ఇప్పుడు వర్షపు నీరే కారుతోంది. ముమ్ముందు సమావేశమందిరాలు కాస్త స్విమ్మింగ్ పూల్స్‌గా మారటం ఖాయమన్న చర్చ నడుస్తోంది.

లీకేజీ వీడియో హల్‌చల్

పార్లమెంట్ లాబీలో నీరు లీకేజీ అవడం పాలక ఎన్డీఏను ఇబ్బంది పెడుతోంది. రాజధానిలో భారీ వర్షాలు పడుతుండడంతో పార్లమెంట్ లాబీలో నీరు చేరింది. దీనికి సంబంధించిన వీడియోను ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్‌రామ్ ఠాకూర్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం కోసం బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని, ఇప్పుడేమో వర్షపు నీరు పడుతోందని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. సమావేశాలను పాత భవనంలోనే నిర్వహించాలని కోరారు.

బయటేమో పేపర్ లీకేజీ... లోపలేమో వాటర్ లీకేజీ

'బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ. రాష్ట్రపతి ఉపయోగించిన పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు లీక్ కావడం చూస్తుంటే కొత్త భవనంలో వాతావరణ సంబంధమైన సమస్యలు ఉన్నాయని అర్థమవుతోంది. నూతన భవనం ప్రారంభించి కేవలం సంవత్సరం మాత్రమే అయింది' అని మాణిక్‌రామ్ ఠాకూర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ మరో అడుగు ముందుకు వేసి మిగిలిపోయిన వర్షాకాల సమావేశాలను పాత భవనంలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'దీని కంటే పాత పార్లమెంటే బాగుంది. అక్కడికి మాజీ ఎంపీలు కూడా వచ్చి కలిసేవారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కట్టిన నూతన భవనంలో నీరు కారడం ఆగేంతవరకూ మనం పాత పార్లమెంటుకు ఎందుకు వెళ్లకూడదు?' అని ట్వీట్ చేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త పైకప్పు నుండి ఇలా నీరు కారడం వారి అద్భుతమైన ఆలోచనల రూపకల్పనలో భాగమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని చమత్కరించారు.

రాజధానిలో గత 24 గంటల్లో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 14 సంవత్సరాల్లో జూలై నెలలో ఒక రోజు ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. నివాస ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది.

ఇరవై వేల కోట్ల రూపాయల సెంట్రల్ విస్టా పునరభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. దీనిని గత సంవత్సరం మే 28న ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. దీని నిర్మాణానికి రూ.862 కోట్లు ఖర్చయ్యాయి. నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన విషయం తెలిసిందే.

వర్గీకరణకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఎస్సీలోని కొన్ని తరగతుల వారు శతాబ్దాల తరబడి అణచివేతకు గురవుతున్నారని గుర్తు చేశారు. కాగా రాష్ట్రాలు తమ వద్ద ఉన్న కులాల సమాచారం ఆధారంగా వర్గీకరణ జరపాలని, అంతే తప్ప తమ ఇష్టాను సారం నిర్ణయం తీసుకోరాదని న్యాయస్థానం తన తీర్పులో తెలిపింది. వివక్ష కారణంగా ఎస్సీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పింది.

కేంద్రం సమర్థన

ఎస్సీల ఉపవర్గీకరణను కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అందరికీ సమానా వకాశాలు కల్పించాలన్న లక్ష్యం ఉపవర్గీకరణ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని కేంద్రం తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. వాదనలు విన్న అనంతరం ధర్మాసనం ఫిబ్రవరిలో తన తీర్పును రిజర్వ్ చేసింది.

ఏమిటీ కేసు?

వాల్మీకులు, మజూబీ సిక్కులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనను 2010లో పంజాబ్-హర్యానా హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు నిర్ణయంపై పంజాబ్ ప్రభుత్వం 2011లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) కూడా చాలా కాలం నుండి న్యాయ పోరాటం చేస్తోంది. అంతకుముందే... ఎస్సీ కోటాలో ఉప వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో 2004లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. 2020లో ఐదుగురు సభ్యుల సుప్రీం బెంచ్ ఈ తీర్పును తప్పుపట్టింది. దీనిపై పునఃసమీక్ష కోసం కేసును ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించింది. తాజాగా ఉప వర్గీకరణపై ఆ ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది.

ఇక రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు అందేలా చూసేందుకు అవసరమైన చర్యలను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా తీసుకోవాల్సి వుందని పేర్కొంది. ఎస్సీల్లోని వెనుకబడిన వర్గాలను నిర్ణయాత్మక చర్యల పరిధిలోకి తీసుకువచ్చేలా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇక రాష్ట్ర ప్రభుత్వాలదేనని అందుకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేయాల్సి వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మార్గదర్శకాలు వచ్చే వరకు ఉద్యోగ నియామకం చేయొద్దు

తెలుగు రాష్ట్రాలు సుప్రీం తీర్పును అమలు చేయాలి : ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా మార్గదర్శకాలు వచ్చే వరకు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాల నియామకం చేయొద్దని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం నాడిక్కడ మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాల్లో విద్యా ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల దగ్గర ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు ఉన్నాయని, కాబట్టి ప్రస్తుతం ఉన్న ఉద్యోగ నియామకాల్లో కూడా అమలు చేయాలని డిమాడ్ చేశారు. ఇది మాదిగల విజయమని, మాలల విజయం కాదని తాను చెప్పలేనని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయం వైపు తీర్పు చెప్పిందని, ధర్మమే గెలిచిందని పేర్కొన్నారు.

సుప్రీం తీర్పును సమర్థిస్తున్నాం : ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును సమర్థిస్తున్నామని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. గురువారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్‌లో బి. వెంకట్ మీడియాతో మాట్లాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి ఉప కులాల వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగినప్పుడు గతంలో తాము మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, జాప్యం చేయొద్దని కోరుతున్నామని అన్నారు. ఉప కులాల్లో ఉన్న సమస్యలు అన్నదమ్ముల లాంటివని, వర్గ వైరుధ్యాలు కాదని పేర్కొన్నారు.

> **ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం : సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**
>
> ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గురువారం నాడిక్కడ స్థానిక ఏపీ, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు అన్యాయం జరిగిందనేది వాస్తవమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వాటిని సామరస్యంగా పరిష్కరం చేసుకోవాలని తొలి నుంచి తాము చెబుతున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు జరగాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవచిత్రం



అశ్విన్‌బాబు

మెడికో థ్రిల్లర్‌లో అశ్విన్‌బాబు

డిఫరెంట్ సబ్జెక్ట్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అశ్విన్ బాబు మరో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. మెడికో థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణ శ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్.3గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి లావిష్‌గా నిర్మిస్తున్నారు.

గురువారం అశ్విన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆయనకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియచేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. సినిమాపై ఈ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

ఈ చిత్రంలో అశ్విన్ బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తుండగా అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖడేకర్, అజయ్, గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రం హైదరాబాద్, వైజాగ్, కొడయ్ కేనాల్‌ల్లో 75% షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సంవత్సరం చివరిలో ప్రేక్షకులు ముందుకి రాబోతుంది.

ఈ చిత్రానికి స్టోరీ - స్క్రీన్ ప్లే - డైరెక్షన్ : మామిడాల ఎం.ఆర్.కృష్ణ, నిర్మాత : టి. గణపతి రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్ : బద్రి నాథ్ రెడ్డి, డీవోపీ : ఎం.ఎస్.బాల్‌రెడ్డి, మ్యూజిక్ : గౌర హరి, ఎడిటర్ : విప్లవ్ నైషదం, ఫైట్స్ : పృథ్వి, ఆర్ట్ : సురేష్ (బేబీ సురేష్), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : దుర్గేష్.

ఆ కామెంట్స్‌కి సినిమానే సమాధానమిస్తుంది



వరుణ్ సందేశ్

మహా మూవీస్, ఎమ్ 3 మీడియా పతాకంపై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజీ'.

ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో వరుణ్ సందేశ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఈ మూవీలో నా లుక్ కొత్తగా ఉండేలా మా డైరెక్టర్ ఆద్యంత్ హర్ష డిజైన్ చేశారు. రెండు డిఫరెంట్ కలర్స్‌లో వెరైటీగా హెయిర్ స్టైల్, ముక్కు పుడక, టాటూస్‌తో ఒక కొత్త మేకోవర్ చేయించారు. నాకు కథ కంటే ముందు నేను ఈ సినిమాలో చేసిన ఆండీ క్యారెక్టర్ లుక్ ఎలా ఉంటుందో డైరెక్టర్ వివరించారు. అది నాకెంతో బాగా నచ్చింది.
- ఇదొక మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. మెంటల్ ఆస్పత్రి దగ్గర కొద్దిమంది ఉంటారు. వారి దగ్గరకు ఆండీ వస్తాడు. అతను వచ్చాక గందరగోళం మొదలవుతుంది. అదేంటి అనేది తెరపై చూడాలి. ఈ కథలో అంతర్లీనంగా సోషల్ మెసేజ్ ఉంటుంది. ఈ సినిమాలో నా లుక్ చూసి రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా కామెంట్స్ వచ్చాయి. కానీ వాటికి ఈ సినిమానే సమాధానం చెబుతుంది. ఈ సినిమా చూశాక నేను ఎందుకు ఈ మేకోవర్‌లో ఉన్నానని తెలుసుకుంటారు. ఈ సినిమా చూశాక ఆండీ క్యారెక్టర్ పట్ల గర్వపడతారు.
- ఈ కథలో చాలా టిస్టులు, టర్న్‌ ఉంటాయి. ఒక మంచి మూవీ చేశామని మేమంతా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఈ సినిమా చూశాక చాలా ఎమోషనల్ అయ్యాను. చివరలో హార్ట్ టచింగ్‌గా అనిపించింది. నా వైఫ్ వితిక కూడా సినిమా చూసి అలాగే ఫీలయ్యింది. ఈ సినిమాలో సగం తెలుగు, సగం ఇంగ్లీష్ మాట్లాడుతుంటా. ఇది నా బాడీలాంగ్వేజ్‌కు కంఫర్ట్‌గా అనిపించింది.
- ఈ మూవీ కోసం ఒక ప్రమోషనల్ సాంగ్ చేశాం. ఆ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఎబనెజర్ పాల్ ఈ చిత్రానికి అద్భుతమైన బీజీఎం ఇచ్చాడు. సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. థియేటర్లలో ఆ అనుభూతి కొత్తగా ఉంటుంది. ఆయన ఇప్పుడు మరో మూడు బిగ్ బడ్జెట్ ప్రాజెక్ట్స్ సైన్ చేయటం హ్యాపీగా ఉంది.
- ఏపీలో టూర్ చేశాం. ఆ టూర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ టూర్ విశేషాలు ఇన్‌స్టాలో షేర్ చేసుకున్నా. చీకట్లో ఉన్న వారికి వెలుగు పంచే వాడు విరాజి. ఇదే టైటిల్ జస్టిఫికేషన్. సస్పెన్స్, థ్రిల్లర్, హారర్ ఎలిమెంట్స్, డ్రామా, ఎమోషన్ వంటి అన్ని అంశాలు కథలో కలిపి రూపొందించారు దర్శకుడు ఆద్యంత్ హర్ష.
- మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా మా మూవీ రిలీజ్ కావడం సంతోషంగా ఉంది. ఈ వారం దాదాపు పన్నెండు సినిమాలు రిలీజ్‌కు వస్తున్నాయి. వాటిలో మా మూవీ కనిపిస్తుందంటే దానికి మా ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల చేయిస్తున్న ప్రమోషనే కారణం. ఈ కథను అలాంటి ప్రొడ్యూసర్ మాత్రమే నిర్మించగలరు.



అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



కృష్ణ వంశీ

కృష్ణ వంశీ, మోక్ష లీడ్ రోల్స్‌లో నటించిన లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించారు. ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నేడు (శుక్రవారం) గ్రాండ్‌గా విడుదల చేయనుంది.

ఈ నేపథ్యంలో హీరో కృష్ణ వంశీ మీడియాతో మాట్లాడుతూ, 'మాది కడప. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ప్యాషన్. కాలేజ్‌లో ఉన్నప్పుడు ఒక షార్ట్ ఫిల్మ్‌లో నటించాను. కోవిడ్ సమయంలో సత్యనంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. హైదరాబాద్ వచ్చి సినిమా ప్రయత్నాలు చేశాను. ఈ క్రమంలో డైరెక్టర్ ఆకాష్‌ని కలిశాను. నా ఆడిషన్ ఆయనకి నచ్చి ఈ సినిమా చేశాను. ఇది నా అదృష్టం. డైరెక్టర్ ఆకాష్ చాలా అద్భుతమైన కథ చెప్పారు. ఆయన చెప్పినపుడే మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది. ఇందులో నా పాత్ర పేరు సిద్ధు. తనది ఇంట్రోవర్ట్ క్యారెక్టర్. చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. చాలా సెటిల్‌గా పెర్ఫార్ చేసే రోల్. అలాగే ఈ కథలో మంచి ఎమోషనల్ జర్నీ ఉంది. యూత్ 1000% కనెక్ట్ అవుతారు. అలాగే ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. ఇందులో ఫాదర్- డాటర్ ఎమోషన్, మదర్- సన్ ఎమోషన్ కూడా ఆకట్టుకునేలా ఉంటాయి. సముద్రంలో చాలా అలజడులు వుంటాయి. నా పాత్ర కూడా అలాంటిదే. ఇందులో హీరోయిన్ పాత్ర పేరు ధరణి. సముద్రం, భూమి ఎలా కలుస్తారనేది చాలా పొయిటిక్‌గా ప్రజెంట్ చేశారు' అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిచ్చే బడ్డీ



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మించారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహించిన ఈ అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్ టైనర్ నేడు (శుక్రవారం) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం హీరో అల్లు శిరీష్ మీడియాతో సంభాషించారు.

'ఈ సినిమాలో 3 వేలకు పైగా సీజీ షాట్స్ ఉన్నాయి. బడ్డీ ఫేస్‌ను యానిమేట్ చేయాలి. వాటిని పర్ఫెక్ట్‌గా చేయాలంటే డబ్బుతో పాటు ఆర్టిస్టులకు టైమ్ ఇవ్వాలి. దాంతో లేట్ అయ్యింది. సమ్మర్ అనుకున్నది ఆగస్టుకు పోస్ట్ పోన్ అయ్యింది. బొమ్మకు ప్రాణం వస్తే ఎలా ఉంటుందనే కీ పాయింట్ మీదే సినిమా ఉంటుంది కాబట్టి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కు తగ్గకుండా సీజీ వచ్చింది. డైరెక్టర్ శామ్ ఆంటోనీ ఈ కథతో నా దగ్గరకు వచ్చి టెడ్డీ బేర్ పాయింట్‌తో ఉంటుందని చెప్పారు. హీరోయిన్‌కు, విలన్‌కు ఉండే కాన్‌ఫ్లిక్ట్, హీరో క్యారెక్టరైజేషన్, కథకు ఇచ్చిన జస్టిఫికేషన్స్ అన్నీ బాగా స్క్రిప్టింగ్ చేశాడు. ఈ కథ వింటున్నప్పుడు కొత్తగా అనిపించింది. నేను ఫస్ట్ టైమ్ పైలట్‌గా కనిపించబోతున్నా. నా క్యారెక్టర్ ఇంటెన్స్‌గా ఉంటుంది. ఈ సినిమా పోస్టర్ రిలీజ్ నుంచి ఇది రీమేక్ కదా అని కామెంట్స్ వచ్చాయి. కాదు స్ట్రైట్ ఫిల్మ్ అని చెప్పడమే మాకు పెద్ద సవాల్‌గా మారింది. అందరికీ అందుబాటు ధరల్లో మా సినిమాను థియేటర్స్‌లోకి తీసుకొస్తున్నాం. ఎప్పటికప్పుడు సరికొత్త కథలతో ప్రేక్షకులను అలరించాలని ప్రయత్నం చేస్తున్నాను. ఇకపై కూడా అలాగే చేస్తాను'.

వారసత్వ పన్నుపై చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అర్థమవుతుందని చెప్పారు. దీనిపై దృష్టి సారించాల్సిన మీడియా ఆ బాధ్యతను విస్మరించిందని ఆక్షేపించారు. అంబానీ కొడుకు పెండ్లి ఖర్చును తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చి ఉంటే సగం దరిద్రం తీరి ఉండేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వరదల కారణంగా రావూస్ అకాడమీ లైబ్రరీలో ముగ్గురు విద్యార్థులు మరణించడం వెనుక లాభాపేక్ష కాకుండా, ఇంకేం కారణాలు ఉన్నాయని అడిగారు. లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, సరైన వసతులు కల్పించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ప్రజాధనాన్ని ఏకపక్షంగా లూటీ చేస్తున్న వారి నుంచి వారసత్వ పన్ను విధిస్తే తప్పు ఏంటని ప్రశ్నించారు. 1980కి ముందు పత్రికలు సేవాభావంతో ప్రజల పక్షాన పనిచేసేవని చెప్పారు. విద్య, వైద్యరంగాల్లో దాతలు విరాళాలు ఇస్తే, దాన్ని సమాజసేవకు ఇస్తున్నట్టు భావించేవారనీ, పత్రికా రంగం కూడా ఇదే కోవలో ఉండేదని విశ్లేషించారు. 1985లో రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చాక, అప్పటి వరకు వ్యాపారానికి మినహాయింపుగా ఉన్న రంగాలను పెట్టుబడిదారులు ఆక్రమించి, లాభాల కోసం తాపత్రయ పడటం ప్రారంభమైందన్నారు. పత్రికా రంగంలో వార్తల్ని అమ్ముకొని కూడా వ్యాపారం చేసుకోవచ్చని నిరూపించారని చెప్పారు. కానీ ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రికలు ఏనాడు ఆ దిశగా ఆలోచన చేయలేదనీ, అవి ఎప్పుడూ ప్రజలు, కష్టజీవుల పక్షానే నిలిచి, సమాజ మార్పుకోసం పనిచేస్తున్నాయని చెప్పారు. పత్రికలు, ఛానల్స్‌లో నిజం దొరకడం కష్టంగా మారిందనీ, నాలుగు పత్రికలు చదివాక, ప్రజాశక్తి, నవతెలంగాణ పేపర్లు చదివి వాస్తవాలను



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాఘవులు

ఏర్పడ్డాయనీ, మీడియా స్వభావమే పూర్తిగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యూస్‌క్లిక్ వంటి నిష్పాక్షిక మీడియా సంస్థలపై ఆంక్షలు, నిర్బంధాలు, నిషేధాలు కొనసాగుతూనే ఉన్నాయనీ, ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థకు కనీసం బెయిల్ కూడా ఇవ్వొద్దని కేంద్రం చెప్పడం వెనుక అంతరార్థాలు తెలుసుకోలేనివేం కావన్నారు. పత్రికల్లో ఆన్‌లైన్ రీడర్ల సంఖ్య పెరుగుతున్నదనీ, నవతెలంగాణ ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగించాలని సూచించారు. కేంద్రంలో మోడీ సర్కారు నియంతృత్వానికి తాత్కాలిక బ్రేక్ మాత్రమే పడిందనీ, కానీ ఆ వర్గ స్వభావంలో ఎలాంటి మార్పు లేదని విశ్లేషించారు. ఏ సినిమాలు తీయాలి? ఎలాంటి ఉపన్యాసాలు చేయాలి? అనేది కూడా వారే నిర్దేశిస్తున్నారని విమర్శించారు. పారిశ్రామికరంగంలో పెట్టుబడులు తగ్గుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయంగా చెప్తున్నాయనీ, దీనివల్ల రాబోయే రోజుల్లో ప్రజల కష్టాలు, బాధలు పెరుగుతాయని హెచ్చరించారు. భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉన్నదనే వాస్తవాలను విస్మరించొద్దని అన్నారు. ప్రజలకు ఆధార్ కార్డు ఇచ్చినట్టే వ్యవసాయ భూములకు కూడా నెంబర్లు కేటాయించి, పేర్లు మాత్రం మరొకరివి చేర్చి, భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఇలాంటి వాటిని వెలికితీసి, ప్రజలకు అండగా నిలబడేందుకు ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రికలు ముందు వరుసలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ మాట్లాడుతూ పేదల పక్షపాతులం అని ప్రకటించి తాము పత్రికను నడుపుతున్నామని అన్నారు. అణగారిన,అట్టడుగువర్గాల హక్కుల సాధనలో పోరాటపటిమ, ఉద్యమస్ఫూర్తికి అండగా నిలవడమే తమ పత్రిక లక్ష్యమని వివరించారు. వామపక్ష పత్రికగా వేర్వేరు పేర్లతో సాగిన ప్రస్థానంలో అనేకమంది ఆస్తుల్ని పత్రిక కోసం త్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు. ఆ పునాదుల మీదే 'నవతెలంగాణ' నిలబడి ఉందని స్పష్టంచేశారు. సిద్ధాంతం, రాజకీయం, నాయకత్వబలం, విలేకరులు, సిబ్బంది త్యాగాలు, శ్రేయోభిలాషుల సహకారమే పత్రికను కష్టకాలంలో నిలబెట్టాయని కొనియాడారు. ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు 'నవతెలంగాణ' సర్క్యులేషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామనీ, దీనికి అందరూ సహకరించాలని కోరారు. నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్ మాట్లాడుతూ వివిధ పేర్లతో 82 ఏండ్ల సుదీర్ఘ పత్రికా ప్రస్థానంలో నిటారుగా నిలబడిన పత్రిక నవతెలంగాణ అని చెప్పారు. పత్రికారంగంలో వస్తున్న మార్పుల్ని అందిపుచ్చుకుంటూ, ఆన్‌లైన్ వీక్షకుల్ని పెంచుకుంటూ, నిజాన్ని నిజంగా నిర్భయంగా చెప్పగలుగుతున్నామని అన్నారు. ఈ గొప్పతనం 'నవతెలంగాణ' ప్రజల్ని చూసే దృక్పథంలోనే ఉందనీ, దానికితోడు సైద్ధాంతిక అవగాహన కలిగిన విలేకరులు, సిబ్బంది వల్లే ఇది సాధ్యమవుతున్నదని చెప్పారు. దాన్ని కొనసాగిస్తూనే, ప్రజల్ని మరింత ప్రభావితం చేసేలా వార్తా రచనలు జరగాలని కర్తవ్య నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. నవతెలంగాణ మఫిషిల్ ఇంచార్జి జీ వేణుమాధవరావు, జనరల్ మేనేజర్లు భరత్, వెంకటేష్, రఘు, వాసు, నరేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శశి తదితరులు పాల్గొన్నారు.



ధృవీకరించుకొనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. వార్తల్ని కప్పిపెట్టి, మభ్యపెట్టి, వాస్తవాలను దాచిపెట్టి, అసలు ఏం జరిగిందో అర్థం కాకుండా ప్రజల్ని గందరగోళపరిచేలా ప్రచురిస్తూ, ప్రసారాలు చేసేలా ఓ వర్గం మీడియా తయారయ్యిందనీ, దానికి లాభాపేక్ష తప్ప, ప్రజా సంక్షేమం ఎక్కడిదని ప్రశ్నించారు. కానీ 'నవతెలంగాణ' మాత్రం వార్తల్ని విప్పిచెప్పి, వాటివెనుక ఉన్న ఉద్దేశ్యాలను ప్రజలకు వివరించేలా కృషి చేస్తుందని తెలిపారు. దూరదర్శన్‌ను పూర్తిగా మర్చిపోయే పరిస్థితులు

సర్క్యులేషన్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు సర్క్యులేషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ ఈ విషయం ప్రకటించారు. సర్క్యులేషన్ క్యాంపెయిన్‌కు చెందిన పోస్టర్‌ను వార్షికోత్సవ వేదికపై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆవిష్కరించారు. ఈ క్యాంపెయిన్‌కు సంస్థ ఉద్యోగులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని సీజీఎం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ జర్నలిస్టులకు సత్కారం



ఉత్తమ జర్నలిస్టులుగా ఊరగొండ మల్లేష్, ఎస్ఎస్ఆర్ శాస్త్రి శ్రీకాంత్,శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న నలుగురిని ఉత్తమ జర్నలిస్టులుగా ప్రకటించారు. స్టేట్ బ్యూరో నుంచి మొదటి ఉత్తమ జర్నలిస్టుగా ఊరగొండ మల్లేష్, రెండో ఉత్తమ జర్నలిస్టుగా ఎస్-ఎస్ఆర్ శాస్త్రి ఎంపికయ్యారు. మఫిషిల్ నుంచి కరీంనగర్ స్టాఫ్ రిపోర్టర్ మొదటి ఉత్తమ జర్నలిస్టుగా శ్రీకాంత్, ఖమ్మం స్టాఫర్ శ్రీనివాసరెడ్డి రెండో ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికయ్యారు. మఫిషిల్ ఇంచార్జి వేణుమాధవ్ వీరిని వార్షికోత్సవ వేదికపైకి ఆహ్వానించగా, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పీ ప్రభాకర్ సత్కరించారు. ఉత్తమ జర్నలిస్టులకు పుష్పగుచ్ఛం అందించి, పుస్తకాలను బహుమతులుగా ఇచ్చారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ నిర్వహించారని, ఈ వేలం కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెళ్లారని చెప్పారు. సింగరేణిని ప్రయివేటుపరం చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నాయన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లిలో కూడా సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టాలని, కానీ, వేలంలోనే దక్కించుకోవాలని కేంద్రం చెప్పడం సరికాదన్నారు. గతంలో ఇలాగే నాలుగు బొగ్గు బ్లాగులను బీఆర్ఎస్ పాలనలో మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాత్ర సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో నిరుద్యోగ సమస్య పరిష్కారంలో సింగరేణి తనవంతు పాత్రను పోషిస్తోందని చెప్పారు. సింగరేణి వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్లు, పన్నుల రూపంలో ప్రతి సంవత్సరం వేల కోట్లు వస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా.. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాల కోసం వేలకోట్ల నిధులను ఇతర ప్రాంతాలకు అందిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాల్సిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తులతో సరిపెడుతోందని విమర్శించారు. యాత్ర మరో సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్రంతో పోరాడకుండా సింగరేణికి గనులు దక్కకుండా చేసిందని విమర్శించారు. ఫలితంగా కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాక్-3ను ప్రయివేటు కంపెనీలు దక్కించుకున్నాయని చెప్పారు. తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని, గతంలో ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన రెండు బ్లాకులను తక్షణమే సింగరేణి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి తేవాలని సూచించారు. సింగరేణిని ప్రయివేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) తరపున సింగరేణి వ్యాప్తంగా అన్ని యూనియన్లు, కాంట్రాక్ట్ కార్మికులను కార్మికులు, ఉద్యోగులను పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రాజారావు, సీపీఐ(ఎం) నాయకులు వై.యాకయ్య, ఎర్రవెల్లి ముత్యంరావు, జ్యోతి, సీఐటీయూ నాయకులు దొమ్మటి కొమురయ్య, ఎం.ప్రభాకర్, ఈ కుమార్, ఎండీ అహ్మద్ పాషా, జి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బురదలో ఇరుక్కున్న బస్సు

- బస్సులో సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులను వేరే వాహనంలో తరలింపు



నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాటంలో భాగంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కొనసాగుతున్న బస్సుయాత్ర.. భూపాలపల్లి జిల్లా కాటారం-ధన్వాడ ప్రధాన రహదారిపై బురదలో దిగబడి ఇరుక్కుపోయింది. గురువారం కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో ముగించుకొని మంథని మీదుగా భూపాలపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. అయితే మంథని నుంచి కాటారం వరకు ఫోర్ వే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రెండు వారాలపాటు వర్షాలు కురిసిన నేపథ్యంలో రోడ్డంతా బురదమయంగా మారింది. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బస్సు అటుగా వచ్చి బురదలో ఇరుక్కుపోవడంతో బస్సులో ఉన్న సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులను జిల్లా కార్యదర్శి బంధు సాయిలు సురక్షితంగా వేరే వాహనంలో భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేర్చారు. ఈ బస్సుయాత్ర బృందంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య ఉన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంక్ విదేశీ పరం..!

- దుబాయ్, టొరంటో దేశాల సంస్థలకు కట్టబెట్టొచ్చు
- పోటీలో కొటాక్ మహీంద్రా బ్యాంక్



ముంబయి : మోడీ సర్కార్ ఐడీబీఐ బ్యాంక్‌ను విదేశీపరం చేసే పనిలో ఉందని తెలుస్తోంది. ఐడీబీఐ బ్యాంక్‌లోని మెజారిటీ వాటాల విక్రయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మూడు కీలక కొనుగోలు సంస్థలను గుర్తించినట్టు రిపోర్టులు వస్తున్నాయి. అందులో రెండు విదేశీ సంస్థలు ఉండటం గమనార్హం. తుది బిడ్డింగ్‌లో టొరంటోకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సీయల్ హోల్డింగ్స్, దుబాయ్‌కు చెందిన ఎమరైట్స్ ఎన్‌బీడీ సహా దేశీయ కొటాక్ మహీంద్రా బ్యాంక్ నిలిచాయని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వారి సమాచారం. వారం రోజుల్లోనే దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్రానికి 45.48 శాతం, ఎల్‌ఐసికి 49.24 శాతం చొప్పున వాటాలున్నాయి. ఇందులోని 60.7 శాతం వాటాను విక్రయించాలనేది ప్రధాన యోచన. ఐడీబీఐ అమ్మకానికి సంబంధించి ఆర్థిక శాఖ 2022లో ప్రక్రియను ప్రారంభించింది. స్వాధీన చర్చలు కొనసాగుతున్నందున సంబంధిత వర్గాలు పూర్తి వివరాలు వెల్లడించలేదని రాయిటర్స్ తెలిపింది. కాగా.. ఈ వ్యవహారంపై ఆర్‌బీఐ, ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సీయల్ హోల్డింగ్స్, ఎమరైట్స్ ఎన్‌బీడీ, కొటక్ మహీంద్రా బ్యాంక్ సంస్థలు తమ ఈ మెయిల్‌కు స్పందించడానికి నిరాకరించాయని రాయిటర్స్ తెలిపింది.

బిడ్డర్లు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని.. తుది నిర్ణయం జరిగిన తర్వాత స్పష్టత రానుందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రధాన బిడ్డింగ్‌దారుల్లో కెనడియెన్ బిలియనీర్ ప్రేమ్ వాట్సా, యూఏఈ, ఇండియా, సౌదీ అరేబియా తదితర దేశాల్లో కార్యకలాపాలు కలిగిన ఎమరైట్స్ ఎన్‌బీడీ ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఐడీబీఐ బ్యాంక్‌ను ప్రయివేటీకరించనున్నామని ఇటీవల దీపమ్ సెక్రటరీ తూహిన్ కాంత పాండే తెలిపారు.

జులైలో రూ.1.82 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న వస్తు, సేవల పన్నులు రికార్డ్‌లను సృష్టిస్తున్నాయి. ఈ ఏడాది జులైలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లు 10.3 శాతం వృద్ధితో ఏకంగా రూ.1,82,075 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే మాసంలో రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జులై కాలంలో ఏకంగా రూ.6.56 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లయ్యింది.

ఇన్ఫోసిస్ రూ.32వేల కోట్ల జిఎస్‌టి ఎగవేత



బెంగళూరు : దిగ్గజ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ వేల కోట్ల జీఎస్టీ ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ.32,403 కోట్ల విలువ చేసే జిఎస్‌టి ఎగవేతకు సంబంధించి ముందస్తు షోకాజ్ నోటీసు అందుకున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. జులై 2017 నుంచి మార్చి 2022 మధ్య రూ.32వేల కోట్ల జీఎస్టీ చెల్లింపులు జరుపలేదని కర్నాటక స్టేట్ జీఎస్టీ ఆథార్టీ నోటీసులు జారీ చేసింది. కంపెనీకి సంబంధించి విదేశీ కార్యాలయాలు పెట్టే ఖర్చులపై జిఎస్‌టి చెల్లించలేదని ప్రధాన ఆరోపణ. ఈ షోకాజ్ నోటీసుపై సంస్థ వివరణ ఇవ్వనున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. ఈ తరహా జీఎస్టీ ఎగవేతలపై ఇతర ఐటీ కంపెనీలపై కూడా జీఎస్టీ అథారిటీలు దృష్టి సారించనున్నట్లు సమాచారం.

టాటా మోటార్స్ రెవెన్యూ రూ.1.07 లక్షల కోట్లు

క్యూ1 లాభాల్లో 74 శాతం వృద్ధి

ముంబయి : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 5.7 శాతం వృద్ధితో ఏకంగా రూ.1,07,316 కోట్ల రెవెన్యూ సాధించింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు ఏకంగా 74 శాతం ఎగిసి రూ.5,566 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,203 కోట్ల లాభాలు ప్రకటించింది. గడిచిన క్యూ1లో కంపెనీ వాణిజ్య వాహనాల రెవెన్యూ 5.1 శాతం పెరిగి రూ.17,800 కోట్లకు పెరగ్గా.. ప్యాసింజర్ వెహికల్స్ రెవెన్యూ 7.7 శాతం తగ్గి రూ.11,800 కోట్లుగా నమోదయ్యింది. వాణిజ్య వాహనాల టోకు అమ్మకాలు 6 శాతం పెరిగి 93,700 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

తగ్గిన ఐటీసీ లాభాలు

బహుళ వ్యాపారాలు కలిగిన ఐటీసీ లిమిటెడ్ 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పేపర్‌బోర్డ్, పేపర్, ప్యాకేజింగ, హాస్పిటాలిటీ, వ్యవసాయ వ్యాపారాల్లో తగ్గుదలను నమోదు చేసింది. దీంతో గడిచిన క్యూ1లో కంపెనీ నికర లాభాలు 0.26 శాతం తగ్గి రూ.5,091.59 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,104.93 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.18,639.48 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 7.5 శాతం పెరిగి రూ.20,0209.60 కోట్లుగా నమోదయ్యాయి.

జొమాటో ఫలితాలు ఆకర్షణీయం

ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో కంపెనీ నికర లాభాలు బహుళ రెట్లు పెరిగి రూ.253 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 3,562 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 74 శాతం యపెరిగి రూ.4,206 కోట్లుగా ప్రకటించింది. తమ వృద్ధిలో క్విక్ కామర్స్ విభాగం కీలకపాత్ర పోషించిందన్నారు.

అమెజాన్ ఫ్రెష్‌లో 45 శాతం వరకు డిస్కౌంట్లు

హైదరాబాద్: ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఫ్రెష్‌లో రాఖీ పండగ సందర్భంగా ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నట్లు తెలిపింది. తాజా పండ్లు, కూరగాయలు, నిత్యావసరాలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, స్నాక్స్, పానీయాలపై 45 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ డిస్కౌంట్లు ఆగస్టు 7వ తేది వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. నూతన వినియోగదారులు తొలి నాలుగు ఆర్డర్లపై రూ.400 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చున్నారు. తమ సైట్‌లోని రాఖీ స్టోర్ ద్వారా మిఠాయిలు, చాక్లెట్లు, స్నాక్స్ తదితర ఉత్పత్తులు ఇంటి వద్దనే అందుకోవచ్చని పేర్కొంది.

25వేల మార్క్‌కు నిఫ్టీ

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ నూతన రికార్డ్‌ను సృష్టించింది. గురువారం సెషన్‌లో 108 పాయింట్లు పెరిగి 25వేల మార్క్‌ను అధిగమించింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే సెప్టెంబర్‌లో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని సంకేతాలు ఇవ్వడంతో భారత మార్కెట్లకు మద్దతు లభించింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 388.15 పాయింట్లు లేదా 0.47 శాతం పెరిగి 82,129.49 ఆల్‌టైం రికార్డ్‌ను నమోదు చేసింది. తుదకు 126 పాయింట్లు పెరిగి 81,867 వద్ద ముగిసింది. దీంతో వరుసగా నాలుగో రోజూ రికార్డ్ స్థాయికి చేరినట్లయ్యింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 60 పాయింట్లు రాణించి 25,010 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి

అంకెల గారడీ !

ప్రాధాన్యతా రంగాలకు పెరగని కేటాయింపులు

- వ్యయ లక్ష్యాలపై గొప్పలు
- కేటాయింపులు లేకున్నా పథకాల ప్రకటన
- బడ్జెటరీ నిధులనూ ఖర్చు చేయని శాఖలు
- కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక నిపుణుల పెదవి విరుపు



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌పై కార్పొరేట్ రంగం, ప్రభుత్వ అనుకూల మీడియా సంతోషాన్ని వ్యక్తం చేశాయి. ఎవరైనా ఎన్ని వరాలైనా కోరుకోవచ్చు. కానీ ఎవరి మనసునూ నొప్పించకపోతే అదే పెద్ద ఉపశమనం. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తిన్న బీజేపీ, దాని నేతృత్వంలోని ప్రభుత్వం అసంతృప్తులను మచ్చిక చేసుకునే చర్యలను బడ్జెట్‌లో ప్రకటిస్తుందని అందరూ ఆశించారు. ప్రభుత్వ మనగడకు కీలకంగా ఉన్న రెండు మిత్రపక్షాలు...అంటే తెలుగుదేశం, జేడీయూ కూడా తమ రాష్ట్రాలకు భారీ ప్యాకేజీలు కోరాయి. వీరందరినీ సంతృప్తి పరిచేందుకు తీసుకునే చర్యలు తమపై అదనపు పన్నుల భారం మోపుతాయని, తద్వారా తమ లాభాలను తగ్గిస్తాయని కార్పొరేట్ రంగం భయపడింది. ఇప్పటికే దూరమైన మధ్య తరగతి ప్రజలపై ఎలాగూ అదనపు పన్నులు వేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే సంఘటిత రంగం నుండి అదనపు ఆదాయాన్ని పొందుతారని అంచనా వేశారు. ఎందుకంటే ఎప్పుడైనా ఈ రంగమే ఎక్కువ పన్నులు చెల్లిస్తుంది. ప్రభుత్వానికి పన్ను యేతర వనరులు అందిస్తుంది. అదీకాక కోవిడ్ అనంతరం సంఘటిత రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆర్థిక వ్యవస్థలో దాని ఆదాయ వాటా పెరిగింది. మరిన్ని పన్నులు చెల్లించే సామర్థ్యం ఇప్పుడు ఆ రంగానికి ఉంది.

వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ల కంటే ఎన్నికల తర్వాత సమర్పించిన బడ్జెట్ భిన్నంగా ఉంటుందని ఆర్థికవేత్తలు ఆశించారు. నూతన ప్రాధాన్యతలకు చోటు కల్పించాలంటే బడ్జెట్ పరిమాణాన్ని పెంచాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ పెరుగుదల కేవలం ఒక శాతం మాత్రమే ఉంది. గత సంవత్సరపు బడ్జెట్ పరిమాణం రూ.47.66 లక్షల కోట్లు కాగా ప్రస్తుత బడ్జెట్ పరిమాణం రూ.48.20 కోట్లు. ద్రవ్య లోటు పెరగకుండా ఉండేందుకు ఇలా చేశారని అనుకోవచ్చు. అలాంటప్పుడు ప్రాధాన్యతలను మార్చుకోవాల్సి ఉంటుంది. ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు పెంచి, ఇతర వ్యయాలను తగ్గించుకోవాలి. కానీ అలా జరగలేదు.

లక్ష్యాలు ఘనం

బడ్జెట్‌లో పెద్దగా మార్పులు లేకపోయినా అవి భారీగానే ఉన్నాయని చెప్పుకున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో స్వల్ప మొత్తాన్ని కేటాయించి, ఐదు సంవత్సరాల వ్యయ లక్ష్యాన్ని ప్రకటించారు. ఉదాహరణకు కోటి మంది యువతకు ఐదు వందల బడా కంపెనీలు ఇంటర్న్‌షిప్ అందిస్తాయని చెప్పారు. మాటలు ఘనంగానే వినిపించాయి కానీ అవి ఐదు సంవత్సరాలకు ఉద్దేశించిన లక్ష్యాలు. ఈ పథకాన్ని ఇంకా రూపొందించనే లేదు. కాబట్టి ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉండదు. ఉపాధి కల్పనకు రూ. 10,000 కోట్లు కేటాయించామని ఘనంగా చెప్పుకొచ్చారు.

నిధుల ఊసు లేకున్నా పథకాల ప్రకటన

బడ్జెట్‌లో నిధులు కేటా యించకుండా పథకాలు ప్రకటించడం మరో ఎత్తుగడ. ఆర్థిక సంస్థల నుండి రుణాలు తీసుకొని ఈ పథకాలకు నిధులు సమకూరుస్తారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రూ.15,000 కోట్లు ప్రకటించడం ఈ కోవలోకే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థల నుండి రుణాలు తీసుకుంటారు. కాబట్టి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరపాల్సిన అవసరం ఉండదు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసిన భారీ ప్రకటనలకు సైతం ఇప్పుడు పెద్దగా డబ్బు అవసరం లేదు.

'రాష్ట్రాలకు బదిలీ' పద్దులో వాస్తవాలు

సంఘటిత రంగం నుండి అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఆ రంగంలో పనులు ప్రారంభించడానికి పథకాలు రూపొందించాలి. కానీ అవి పూర్తికావడానికి సంవత్సరాల సమయం పడుతుంది. కాబట్టి నిధులు తర్వాత కేటాయించవచ్చు. వాస్తవానికి గతంలో ప్రకటించిన కొన్ని పథకాలు నత్తనడక నడుస్తున్నాయి. భవిష్యత్తులో కూడా అలాగే నడవవచ్చు. ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రస్తుత బడ్జెట్‌లో 'రాష్ట్రాలకు బదిలీ' అనే పద్దు కింద కేటాయింపులు జరిపారు. అయితే ఆ పద్దు కింద జరిపిన కేటాయింపుల్లో పెరుగుదల కన్పించడం లేదు. 2022-23 బడ్జెట్‌లో రూ.2,73,393 కోట్లు కేటాయించగా 2023-24 బడ్జెట్‌లో అది రూ.3,24,641కి పెరిగింది. ఖర్చును రూ. 2,73,985 కోట్లుగా చూపారు. అంటే అంతముందు సంవత్సరంలో ఎంత ఖర్చు పెట్టారో గత సంవత్సరంలోనూ అంతే చూపారు. ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేస్తే వాస్తవానికి ఈ పద్దు కింద ఖర్చు ఐదు నుండి ఆరు శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కంటే తక్కువగా అంటే రూ.3,22,787 కోట్లు కేటాయించారు.

బీహార్, ఏపీకి కొద్దో గొప్పో కేటాయింపులు జరిపి ఇతర రాష్ట్రాలపై వివక్ష చూపారన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో అధికార పార్టీ పంచన చేరినందుకు తమకు కేటాయింపులు బాగానే జరిగాయని ఏపీ, బీహార్ సంబరపడుతున్నాయి.

కేటాయింపులు ఘనం.. ఖర్చు స్వల్పం

ద్రవోల్బణాన్ని అదుపులో ఉంచామని చెప్పుకోవడానికి కీలక పద్దులకు కేటాయింపులు పెంచారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయింపులను రూ. 1,44,214 కోట్ల నుండి రూ.1,51,851 కోట్లకు పెంచారు. అనేక రంగాలకు మాత్రం ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేస్తూ కేటాయింపులు తగ్గించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత సంవత్సరం మాదిరిగానే రూ.86,000 కోట్లు కేటాయించారు. అయితే వాస్తవంగా చూస్తే ఐదు శాతం తక్కువ. కొన్ని రంగాలకు నిధులు కేటాయించిన ప్పటికీ ఖర్చు మాత్రం తక్కువగానే చేస్తారు. ఆరోగ్య రంగాన్నే తీసుకుంటే 2023-24లో రూ.88,956 కోట్లు కేటాయించినా రూ.79,221 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత సంవత్సరంలో రూ.89,287 కోట్లు కేటాయించారు. ఖర్చు కంటే 12 శాతం పెరిగినట్లు కన్పించినా కేటాయింపుల పరంగా 0.03 శాతం మాత్రమే పెరిగింది. అణగారిన వర్గాల వారి కోసం ఉద్దేశించిన పలు పథకాలకు కేటాయింపులు తగ్గించడం గమనార్హం. ఆహారం, ఎరువుల సబ్సిడీలో సైతం రూ.35,000 కోట్ల కోత విధించారు.

మొత్తంగా చూస్తే కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాల్సింది పోయి అంతర్జాతీయ సంస్థలు, సంఘటిత రంగాన్ని సంతృప్తి పరచేలా ఉన్నదని ఆర్థిక నిపుణులు పెదవి విరిచారు.

హత్యా..? ఆత్మహత్యా..?

- హన్మకొండ వైబ్రెంట్ కాలేజీ విద్యార్థిని మృతిపై అనుమానాలు
- బాధిత కుటుంబీకుల ధర్నా, కాలేజీ ఫర్నిచర్ ధ్వంసం


(ఫైల్)

నవతెలంగాణ-నయీమ్‌నగర్/మంగపేట

ములుగు జిల్లా మంగపేట మండలం కమలపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని ఇనుముల భవాని(16) హన్మకొండ జిల్లా నక్కలగుట్టలోని వైబ్రెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతూ అనుమానాస్పదంగా మృతిచెందింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు, బంధువులు దు:ఖసాగంలో మునిగిపోయారు. విద్యార్థిని మృతిపట్ల కోపోద్రిక్తులైన కళాశాల విద్యార్థులు..కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాలేజీ ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కాగా మృతికి కారకులు కాలేజీ యాజమా న్యమే అని బాధితులు ఆరోపించగా, కాలేజీ యాజమాన్యం మాత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పడంతో విద్యార్థినిది హత్యా.. ఆత్మహత్యా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఇనుముల రాజిరెడ్డి, సుమత కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థి ఆరోగ్యం సరిగా లేకుంటే తమకు సమాచారం ఇవ్వరా అని నిలదీశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

న్యాయ విచారణ జరిపించాలి : విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు

విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నక్కలగుట్టలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ప్రయివేట్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మ హత్యలు చేసుకుని మరణిస్తుంటే ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో అవగాహనా సదస్సులు నిర్వహించి వారిలో మానసిక స్థాయిని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో వసతులు, సౌకర్యాలపై దృష్టి సారించా లని, నిబం ధనలకు విరుద్ధంగా నడుస్తున్న కాలేజీ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బంగారం వర్తక వ్యాపారి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం..
- కొందరు ఇబ్బందులకు గురిచేశారని స్నేహితులకు మెసేజ్

నవతెలంగాణ-ఖానాపూర్

ఆర్థిక ఇబ్బందులతో బంగారువర్తక వ్యాపారి తన షాపులో నిల్వ ఉంచిన యాసిడ్ ద్రవణాన్ని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బెజ్జారపు గంగాధర్(48) బుధవారం రాత్రి తన షాప్‌లో నిల్వ ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు తాను ఆత్మహత్య చేసుకుంటు న్నానని, తన అంత్యక్రియలు సంఘ సభ్యులు నిర్వహించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని, తనని కొందరు ఆర్థికంగా నష్టం చేశారని స్నేహితులకు వాయిస్ మెసేజ్‌లు పంపించాడు.

విషయం తెలుసుకున్న స్నేహితులు వెంటనే షాపు వద్దకు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న గంగాధర్‌ను ఖానా పూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిర్మల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. అయినా, గంగాధర్ పరిస్థితి విషమించి, గురువారం ఉద యం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతని తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింబాద్రి తెలిపారు.

నిమ్జ్ ప్రాజెక్ట్ మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్ష

- రెండో విడతకు భూమలివ్వం
- ఎల్గోయి, చిలేపల్లితండా రైతులు



నవతెలంగాణ-ఝరాసంగం

జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టులో ఏర్పాటు చేస్తున్న వెం టెక్నాలజీస్ పరిశ్రమకు దాదాపు 500 ఎకరాలకు పైగా ప్రభుత్వం కేటాయించింది. అందులో భాగంగా పరిశ్రమకు కేటాయించిన భూమిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం పరిశీలించారు. ప్రాజెక్టులో చేపడుతున్న మౌలిక వసతులపై పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమ ఎండీ వెంకటరాజుతో సమీక్షించారు. బర్దిపూర్ టూ ఎల్గోయి, ఎల్గోయి టూ పోట్టుపల్లి వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను పరిశ్రమలోకి రాకుండా ఎక్కడి నుంచి వాటిని మళ్లిస్తే బాగుంటుందనే అంశంపై చర్చించారు. మిర్జాపూర్ టూ కుప్పానగర్ వయా ఎల్గోయి మీదుగా వచ్చే రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుందని.. జిల్లాలోనే ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయానికి కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారని, కాబట్టి ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా పరిశ్రమకు ఇబ్బందులు కలగకుండా ఎటువైపు నుంచి దారిని మళ్లిస్తే బాగుంటుందని పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో సేకరించిన భూమిలో మల్టీ క్రాప్స్ ఏరియాను మ్యాపింగ్ చేసి తనకు నివేదిక ఇవ్వాలని నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను ఆమె ఆదేశించారు. ముంబాయి జాతీయ రహదారి నుంచి ప్రాజెక్టు వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా వెం టెక్నాలజీస్ పరిశ్రమ ఎండీ వెంకటరాజు జిల్లా కలెక్టర్‌కు మొక్కను బహుకరించి స్వాగతం పలికారు. నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రవీందర్ రెడ్డి, నాగలక్ష్మి, జహీరాబాద్ ఆర్డీఓ రాజు, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హుండాయ్ పరిశ్రమ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతలో భూములు తీసుకోవద్దు..

నిమ్జ్ ప్రాజెక్ట్ కోసం 12,600 ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా మండల పరిధిలోని బర్దిపూర్, చిలేపల్లి, చీలేపల్లి తండా ఎల్గోయి గ్రామాల్లో మొదటి విడతలో భూసేకరణ చేపట్టారు. ఎల్గోయి గ్రామంలో ఇప్పటి వరకు రెండు వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించారని.. ఇక మిగిలిన 500 ఎకరాలను కూడా సేకరిస్తే జీవనాధారం కోల్పోయి తామంతా గ్రామాన్ని వదిలేసి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు కలెక్టర్ ముందు వాపోయారు. 500 ఎకరాలను ప్రాజెక్టుల కోసం తీసుకోకుండా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇన్ని వేల ఎకరాల భూమిని తాము కోల్పోయామని గ్రామంలో ఇండ్ల స్థలాలకు, ఆలయాలకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. అంతేకాకుండా చిలపల్లి తండాలో సైతం మిగిలిన సుమారు 34 ఎకరాలను ప్రాజెక్టుకు సేకరించకూడదని గిరిజనులు వినతిపత్రం అందించారు. ఈ ఉన్న భూమిలో తమకు గుంటా, రెండు గుంటల భూమి మాత్రమే ఉందని, ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలుగా గ్రామంలో జీవిస్తున్నామని, భవిష్యత్తు అవసరాలకు, ఇండ్ల స్థలాలకు కేటాయించుకుంటామని కలెక్టర్‌ను కోరారు.

వీధి కుక్కల దాడిలో వృద్ధురాలు మృతి

- విచక్షణారహితంగా దాడి

నవతెలంగాణ - ముస్తాబాద్

ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడిచేయడంతో.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దారుణ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో జరిగింది. గ్రామ స్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సేవాలాల్ తండా బట్టానితాళ్ల గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి(80)కి ముగ్గురు కుమారులు ఉన్నారు. అయితే, ఆ ముగ్గురి ఇండ్ల పక్కనే ఆమె వేరుగా ఉంటున్నది. బుధవారం రాత్రి ఇంటి గడియ సరిగా పెట్టకపోవడంతో అర్ధరాత్రి వీధి కుక్కలు ఆమెపై దాడిచేశాయి. శరీర భాగా లను పీక్కు తిన్నాయి. తలా మొండెం వేరువేరుగా అయ్యాయి. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గణేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృత దేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


(ఫైల్)

ఎముకల మిల్లులో లోకాయుక్త అధికారుల తనిఖీ

- దుర్వాసనపై ఫిర్యాదుతో పరిశీలన



నవతెలంగాణ-కోదాడరూరల్

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో ఉన్న ఎముకల మిల్లులో లోకాయుక్త అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. దుర్వాసన వెదజల్లడం.. కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించలేదంటూ అందిన ఫిర్యాదులతో లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. కర్మాగారంలో పనిచేస్తున్న కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 50 మందికి పైగా పనిచేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కూడా పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఎముకల పొడిని ఏ విధంగా తయారు చేస్తారో పరిశీలించారు. వాటిని దేనికి వాడతారని యజమానిని ప్రశ్నించారు. వివరాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని లోకాయుక్త అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకాయుక్త అధికారులు మోతీ కోసియా, ఎమ్మార్వో హిమ బిందు, డిటి శ్రీధర్, ఇన్‌చార్జి ఆర్‌ఐ జానకి రామిరెడ్డి తదితర అధికారులు ఉన్నారు.

గర్శకుర్తిలో నేత కార్మికుల వంటావార్పు

- 8వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ - గంగాధర

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో గురువారం నేతకార్మికులు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు అందించి ఉపాధి కల్పించాలని కోరుతూ నేతకార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 8వ రోజు కొనసాగింది. అందులో భాగంగా గ్రామంలోని బీటీ చౌరస్తాపై నేతకార్మికులు వంటావార్పు చేపట్టి రోడ్డుపై బైటాయించి.. అక్కడే భోజనం చేశారు. వస్త్ర పరిశ్రమపై ఆధారపడి బతికిన తాము 8 నెలలుగా పనులు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల ఆర్డర్లను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, ప్రత్యామ్నాయంగా ఏదేని గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించకపోవడంతో బతుకుదెరువు దినదిన గండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల కిందటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించి వెన్నుదన్నుగా నిలవాలని కార్మికులు డిమాండ్ చేశారు. పవర్‌లూమ్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం లో కార్మిక సంఘం అధ్యక్షుడు గడ్డం నారాయణ, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం అధక్షడు అలువాల విఠోభ, ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకులు రేణికుంట శ్రీనివాస్, సామల శంకర్, కొలిపాక తిరుపతి, అలువాల శ్రీశైలం, మిట్టపల్లి వెంకటేశ్, వావిలాల శ్రీనివాస్, బూర్గ శ్రీనివాస్‌తోపాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రతీకారం తప్పదు

- హెచ్చరించిన ఇరాన్
- టెహరాన్‌లో హనియె అంతిమయాత్ర

టెహరాన్,గాజా,జెరూసలేం : బుధవారం నాటి తెల్లవారు జాము దాడిలో మరణించిన హమాస్ రాజకీయ చీఫ్ ఇస్మాయిల్ హనియె అంతిమయాత్రను ఇరాన్ రాజధాని టెహరాన్‌లో నిర్వహించారు. ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమెని ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. నలుపు, తెలుపు రంగుల్లోని సాంప్రదాయసిద్ధమైన పాలస్తీనా స్కార్ఫ్‌ల్లో చుట్టబడిన మృతదేహాల శవపేటికల వద్ద ఖమేని ప్రార్థనలు జరిపారు. హనియె స్వదేశమైన ఖతార్‌కు ఆయన భౌతికకాయాన్ని పంపనున్నారు. అక్కడ శుక్రవారం దోహాలో ఆయనను సమాధి చేయనున్నారు. హనియె హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని అది కూడా చాలా కఠినంగా వుంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఈ హత్యతో ప్రాంతీయ యుద్ధం పెచ్చరిల్లుతుందనే భయాందోళనలు నెలకొన్నాయి.

టెహరాన్ సిటీ సెంటర్‌లో, టెహరాన్ యూనివర్శిటీ వద్ద గురువారం ఉదయం హనియె చిత్రపటాలను, పాలస్తీనా పతాకాలను చేబూని నలుపు రంగు దుస్తుల్లో ప్రజలు మౌనంగా అంతియాత్రలో పాల్గొన్నారు. ఈ మేరకు ఇరాన్ టివి దృశ్యాలను ప్రసారం చేసింది. బుధవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో టెహరాన్‌లో హనియె నివాసం వుంటున్న భవంతిపై జరిగిన దాడిలో హనియెతో పాటూ ఆయన అంగరక్షకుడు మరణించారని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. కచ్చితంగా దాడి జరిగిన ప్రదేశం ఏదనేది ప్రకటించలేదు. బీరుట్‌లో హిజ్బుల్లా అగ్ర కమాండర్ ఫయాద్ షుకర్‌ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడికి పాల్పడింది. అది జరిగిన కొద్ది గంటలకే హనియె హత్య కూడా జరిగింది. అయితే హనియె దాడికి తమదే బాధ్యత అని ఇజ్రాయిల్ ప్రకటించడం లేదు.

ప్రతీకారం తప్పదు : ఖమేని

ఇరాన్ గడ్డపై అమరుడైన హనియె హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం తమ బాధ్యత అని ఖమేని ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ ప్రమాణ స్వీకారానికి మంగళవారం హనియె టెహరాన్ వచ్చారు. ఈ పిరికిపంద, తీవ్రవాద చర్యకు పర్యవసానాలు, ఫలితాలను కచ్చితంగా ఇజ్రాయిల్ ఎదుర్కొని తీరుతుందని ఇరాన్ అధ్యక్షుడు ప్రతిన చేశారు. ఈ హత్యకు ఫలితం అనుభవించకుండా పోలేరని హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు ముసా అబూ మర్జూక్ హెచ్చరించారు.

బుధవారం తెల్లవారు జాము నుండి ఇరాన్ వ్యాప్తంగా, మధ్య ప్రాచ్యంలోని పలు నగరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు హనియె హత్యను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇజ్రాయిల్, అమెరికా మూల్యం చెల్లించక తప్పదని వందలాదిమంది నినదించారు.

హనియె హత్యను ఖండించిన అంతర్జాతీయ సమాజం, తక్షణమే ఉద్రిక్తతలు సమసిపోయేలా గాజాలో కాల్పుల విరమణపై దృష్టి కేంద్రీకరించాల్సిందిగా కోరింది. టెహరాన్, బీరుట్‌ల్లో జరిగిన దాడులు చూస్తుంటే ప్రమాదకరమైన రీతిలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయని ఆందోళన చెందాల్సి వస్తోందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పేర్కొన్నారు. అత్యవసరంగా సమావేశమైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తాజా పరిణామాలపై చర్చించింది. శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడాలని పిలుపిచ్చింది. మనందరినీ సంక్షోభంలోకి నెట్టేందుకు ఇజ్రాయిల్‌ను అనుమతించరాదని పాలస్తీనా డిప్యూటీ ప్రతినిధి ఫెదా నాజర్ స్పష్టం చేశారు.

మిలటరీ కమాండర్ మహ్మద్ డెయిఫ్‌నూ హతమార్చాం

హమాస్ మిలటరీ కమాండర్ మహ్మద్ డెయిఫ్‌ను గాజాపై జరిగిన జులై 13నాటి దాడిలో హతమార్చినట్లు ఇజ్రాయిల్ మిలటరీ గురువారం ప్రకటించింది. ఇరాన్ రాజధాని టెహరాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడిలో హమాస్ అగ్రనేత హనియె మరణించిన మరుసటి రోజునే ఈ ప్రకటన వెలువడింది. అక్టోబరు 7నాటి దాడికి డెయిఫ్, మరో అగ్ర నేత యాహ్యా సిన్వర్‌లు కారణమని ఇజ్రాయిల్ నమ్ముతోంది. ప్రస్తుతానికి సిన్వర్ గాజాలో దాక్కున్నట్లు తెలుస్తోంది. అయితే జులై దాడిలో డెయిఫ్ బతికి బయటపడ్డాడని హమాస్ చెబుతోంది. కానీ గురువారం ఇజ్రాయిల్ మిలటరీ చేసిన ప్రకటనపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కాగా మరోవైపు టెహరాన్‌లో హమాస్ రాజకీయ చీఫ్ హనియె మరణానికి దారి తీసిన మంగళవారం నాటి దాడికి తమదే బాధ్యత అని ఇజ్రాయిల్ ఇంతవరకు ధృవీకరించలేదు. తిరస్కరించనూ లేదు. డెయిఫ్‌ను హతమార్చడం తమ లక్ష్యాల్లో ఒకటని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంగ్ చెప్పారు. తాజా పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ చర్చలపై ఈ ప్రభావం వుంటుందని భావిస్తున్నారు.

ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్పీల బదిలీలు


నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హెూంశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి గుప్తా గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. మహిళా భద్రత విభాగం హైదరాబాద్ ఎస్పీ దారా కవితను హైదరాబాద్ సైబర్‌క్రైమ్స్ డీసీపీగా బదిలీ చేశారు. కమాండ్ కంట్రోల్‌లో డీసీపీగా ఉన్న రమణారెడ్డిని మల్కాజ్‌గిరి, భువనగిరి ఎస్ఓటీగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎస్పీ ఎం. వెంకటేశ్వర్లును అక్టోపస్ అడ్మిన్ ఎస్పీగా నియమించారు. మేడ్చల్ జిల్లా ఎస్ఓటీ డీసీపీ డి. శ్రీనివాస్‌ను మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీగా బదిలీ చేశారు. సీఐడీ ఎస్పీగా ఉన్న బి. శ్రీబాలాదేవీని సైబర్ క్రైమ్స్ డీసీపీగా నియమించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ జి. సునీతా మోహన్‌ను ఆర్‌బీవీఆర్ఆర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో అడ్మిన్ ఎస్పీ వై. సాయిశేఖర్‌ను ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమించారు. జగిత్యాల అదనపు ఎస్పీగా ఉన్న ఎస్. వినోద్ కుమార్ ఇంటెలిజెన్స్‌కు బదిలీ అయ్యారు.

డెంగ్యూతో గర్భిణీ మృతి

- శస్త్ర చికిత్స చేసినా ప్రాణం దక్కని కవలలు
- హన్మకొండ జిల్లా గట్లకానిపర్తిలో విషాదఛాయలు

నవతెలంగాణ-శాయంపేట


(ఫైల్)

డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఎనిమిది నెలల గర్భిణీ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. గర్భంలోని శిశువులను దక్కించుకోవడానికి శస్త్ర చికిత్స చేసినా కవల పిల్లలు అప్పటికే మరణించడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానీపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానీపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాజేందర్‌కు.. పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి శిరీషను రెండేండ్ల క్రితం జులై 31న వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భవతి కాగా ఆదివారం జ్వరం రావడంతో సోమవారం హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ జ్వరంగా గుర్తించారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోతుండటంతో గురువారం గర్భంలోని పిల్లలను దక్కించుకోవడానికి ఆపరేషన్ చేయగా, కవల పిల్లలు అప్పటికే మరణించారు. ఆపరేషన్ పూర్తయ్యాక ఆమెకు రక్తస్రావం జరగడంతో శిరీష కూడా మరణించింది. విషయం తెలియడంతో గట్లకానీపర్తి, మల్లక్కపేట గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. ఆమె మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మల్లక్కపేటకు తరలించారు. ఆమె మరణంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తాం

- యువతలో నైపుణ్యాలు పెంచేందుకే స్కిల్స్ వర్సిటీ : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



త్వరలోనే అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఐటీ, శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అయినా, అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదనీ, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిలో నైపుణ్యాలు పెంచడంపై దృష్టి సారించామని తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించబోతున్నామని ప్రకటించారు. అందులో 17 రకాల కోర్సులను అందిస్తామని చెప్పారు. ఇప్పటికే శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కల్పించేందుకు వలు సంస్థలు ముందుకొచ్చాయనీ, అందులో ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఉన్నాయని వివరించారు. డిగ్రీలు, పీజీలు చేసినా సరైన నైపుణ్యాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సిన పరిస్థితి రావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేయడానికి కావాల్సిన నైపుణ్యాలు యువతలో ఉండట్లేదన్నారు. సర్టిఫికెట్లు పొందుతున్నారుగానీ నైపుణ్యాలను పొందటం లేదని తెలిపారు. నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నచోటకే ఎక్కువ పరిశ్రమలు వస్తాయన్నారు. రాబోయే కాలంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచి ఎక్కువ పరిశ్రమలు ఇక్కడకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే హర్యానా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, అస్సాం, తదితర రాష్ట్రాల్లో స్కిల్స్ యూనివర్సిటీలున్నాయని చెప్పారు. 17 రకాల కోర్సులను అందించేందుకు ముందుకొచ్చిన సంస్థల వివరాలను చదివి వినిపించారు. తొలి ఏడాది ఆరు కోర్సుల్లో 2 వేల మంది వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీ ఫ్యాకల్టీలో ప్రొఫెసర్లు, పరిశ్రమల్లో అనుభవం గల నిపుణులతో కూడిన బృందాలుంటాయని తెలిపారు. ప్రోగ్రెసివ్ ఆలోచనతో ముందుకెళ్తున్నప్పుడు ప్రతిపక్షం సహకరించాలనీ, ఇలా పదేపదే అడ్డుతగటం సరిగాదని సూచించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికే సీపీఐ, ఎంఐఎం, బీజేపీ వర్సిటీకి మద్దతు తెలిపాయనీ, బీఆర్ఎస్ సభ్యులు కూడా తమ వైఖరేంటో చెప్పాలని కోరారు.

పదేండ్లు పాలన చేసినవాళ్లు ఇలా చేయొచ్చా? : కూనంనేని

సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..రాష్ట్రాన్ని పదేండ్ల పాటు పాలించిన వాళ్లు సభలో ఇలా చేయొచ్చా? అని బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. నిరసన పేరుతో రుణమాఫీపైన మాట్లాడనీయలేదన్నారు. ఇప్పుడు స్కిల్స్ యూనివర్సిటీపై మాట్లాడే సమయంలో అడ్డుతగలటం సరిగాదన్నారు. మనస్సులో ఏదో పెట్టుకుని ఇక్కడ ఏదో చేయడం సరిగాదని సూచించారు. చిన్న అంశంపై అధికారపక్షంతో విభేదం వస్తే సభలో మిగతా వారిని మాట్లాడనీయకపోవడం ఏంటని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణకు మొదటి నుంచీ మద్దతు ఇచ్చామనీ, సుప్రీం కోర్టు అనుకూలంగా ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిన మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీని స్వాగతిస్తున్నామనీ, అయితే, అది అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో చాలా మందిలో నైపుణ్యాలు లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారన్నారు. వాటి మాదిరిగా స్కిల్స్ యూనివర్సిటీ తయారు కాకుండా చూడాలన్నారు.

బీఆర్ఎస్ సభ్యుల తీరుతో మేం అవకాశం కోల్పోతున్నాం : మహేశ్వర్‌రెడ్డి

స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు తెలుపుతున్నట్టు బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు కౌశిక్‌రెడ్డితో పాటు మరికొందరు 'బడేబాయ్..చోటే బాయ్..బడే బాయ్ చోటే బాయ్' అంటూ సీఎంను, తనను చూపెట్టడాన్ని తప్పుబట్టారు.బీఆర్ఎస్ సభ్యుల తీరుతో కీలకమైన చర్చల్లో తాము మాట్లాడలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలి

- కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి : టీయుఎంహెచ్‌ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసిన తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ) రాష్ట్ర నాయకుల ను అరెస్టు చేయడాన్ని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్యశాఖలోని మౌళిక సమస్యలు పరిష్కారం చేయకుండా కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తారా? చేయరా? అనే దానిపై నిర్ణయం తీసుకోలేదని తప్పుపట్టారు. నెలనెలా వేతనాల రాకుండా పెండింగ్‌లో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా గత ప్రభుత్వం మోసం చేస్తే ఆ ఉద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని పర్మినెంట్ చేయకుండా అన్యాయం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో వారి గురించి కనీసం ప్రస్తావించ కుండా, ఒక విధానం కూడా ప్రకటించలేదని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో టీయుఎంహెచ్‌ఇయూ నాయకులు కోఠి దగ్గర ధర్నా చేపడితే బలవంతంగా పోలీసులతో అరెస్టు చేయించడం అన్యాయమని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం కాంట్రాక్టు వర్కర్లకు రూ. 26 వేలు వేతనాలు నిర్ణయించాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. లేని పక్షంలో ఈ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన నాయకుల్లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి పసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.విజయవర్ధన్ రాజు,రాష్ట్ర కోశాధికారి ఏ.కవిత, రాష్ట్ర కార్యదర్శి కిరణ్మయి , హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కుమార్ ఉన్నారని తెలిపారు. జిల్లాల్లో అరెస్టు చేసిన వారిలో 104 విద్యాసాగర్, పారామెడికల్ నవీన్ , ఏఎన్ఎం నాయకులు విజయలక్ష్మి, సరోజ, లక్ష్మిబాయి, రాధిక, లీలావతి తదితరులును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ కృషి

- మాజీ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ కోసం బీఆర్ఎస్ మొదట్నుంచి చిత్తశుద్ధితో కృషి చేసిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడం, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా మోదీకి లేఖ ఇచ్చారని తెలిపారు. వర్గీకరణపై మిగిలిన రాజకీయ పార్టీలు ఓట్ల రాజకీయం చేశాయని, ఒకే పార్టీలో వర్గీకరణకు మద్ధతుగా ఒక వర్గం, వ్యతిరేకంగా ఇంకో వర్గం వాదనలు వినిపిస్తూ ఎస్సీలను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మాత్రమే వర్గీకరణ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక కోణంలో చూశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రాలకే అధికారం ఇవ్వాలని కూడా కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు కూడా అదే విషయాన్ని సమర్థించిందని చెప్పారు. ఎస్సీలకు సంబంధించిన ఉప కులాల జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉందని తెలిపారు. ఆయా రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించటం శుభపరిణామని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియ ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరపున ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి

మహిళల భద్రతకు తక్షణం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు సత్వర న్యాయం, దోషులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలుండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోకపోవడంతో 48 గంటల్లో నాలుగు దారుణ ఘటనలు జరగాయని గుర్తుచేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలు గడుస్తున్నా హెూం మంత్రి లేకపోవడ మేంటని? ప్రశ్నించారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాల గూడలో జరిగిన దారుణ ఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నట్టు మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్పూర్తిగా ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యమ నాయకునిగా ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చేసిన కేసీఆర్, రాష్ట్రం ఏర్పడిన మొదటి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించారని తెలిపారు. దీనిపై 2016 మే 16న ప్రధాని మోదీని కలిసి లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కరెంటు ఫిర్యాదులు తగ్గాయి

- సరఫరా మెరుగైంది : 1912 కాల్‌సెంటర్ రివ్యూలో టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల సంఖ్య తగ్గిందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. డిస్కం పరిధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) సర్వీస్, 1912 కాల్‌సెంటర్ సేవలు మెరుగయ్యాయని చెప్పారు. గురువారంనాడాయన ఈ సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అధునాతన సాంకేతికను అందిపుచ్చుకోవడంతో పాటు 213 ఎఫ్ఓసీ కార్యాలయాల్లో ఉపయోగించే వాహనాల్లో యాప్ ఆధారిత జీపీఎస్‌ను పొందుపర్చామని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సిబ్బంది ఫిర్యాదుదారుడి ప్రాంతానికి ఎలాంటి ఆలస్యం లేకుండా వెళ్లి, సమస్యను పరిష్కరించే వీలు ఏర్పడుతున్నదని వివరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫిర్యాదుల వివరాలు, వాటి పరిష్కార సమయాలను పరిశీలించారు. సరఫరా, బిల్లింగ్ ఫిర్యాదులు, బ్రేక్ డౌన్, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్/ కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో సమీకృత డాష్‌బోర్డును అందుబాటులోకి తేవడం వల్ల రియల్ టైం సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. 1912 కాల్ సెంటర్ (విద్యుత్ కంట్రోల్ రూమ్)కు గతేడాది జనవరి నుంచి జూన్ వరకు 5,83,672 ఫిర్యాదులు రాగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 3,97,934 ఫిర్యాదులు అందాయన్నారు. కాల్‌సెంటర్ ఫిర్యాదుల్లో 31.82 శాతం తగ్గుదల ఉన్నదని వివరించారు. అదే కాలంలో ఎక్స్(ట్విట్టర్) కంప్లైంట్స్ 35,949 ఉండగా, ఈ ఏడాది 14,035 నమోదయ్యాయని తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో 60.96 తగ్గుదల ఉందన్నారు. కాల్‌సెంటర్‌లో 74 మంది సుశిక్షిత ఆపరేటర్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దామనీ, ఒకేసారి 400 ఫిర్యాదులు అందుకునేలా సామర్థ్యం పెంచినట్టు తెలిపారు. ప్రతి ఫిర్యాదుకు కచ్చితంగా ఒక ఐడీ వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్ డాక్టర్ ఎన్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు శివాజి, నరసింహస్వామి సూపరింటెండింగ్ ఇంజినీర్లు రవికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయండి

- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను ప్రజలకు ఉచితంగా చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని అనేక బహిరంగ సభల్లో చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో రిట్‌పిటీషన్ 219 ఆఫ్ 2020 నెంబర్‌తో కేసు వేశారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ పేరుతో మళ్లీ ప్రజల నుంచి వసూళ్లు ప్రారంభించి, ఖజానా నింపుకోవాలని చూస్తున్నారని, ఇది సత్యదూరమైన చర్య అని విమర్శించారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వసూలు చేయాలనుకుంటే ఇంటి నిర్మాణానికి వెళ్ళినప్పుడు తీసుకోవాలే తప్ప, మార్కెట్ విలువ ఆధారంగా 14 శాతం వసూలు చేయడం సరికాదని అన్నారు. దీనివల్ల పేద ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారనీ, ప్రభుత్వం దీనిపై వారికి అనుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కనీసం తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికైనా ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కోరారు.

అన్ని క్యాడర్ల పదోన్నతులను ప్రభుత్వ టీచర్లకే ఇవ్వాలి

- జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను జెడ్పీ సీఈవో పరిధిలోకి పంపాలి :ఎల్‌సీజీటీఏ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యాశాఖలోని అన్ని క్యాడర్ల పదోన్నతులను కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులకే ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్‌సీజీటీఏ) డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు చెల్లబోవంటూ న్యాయస్థానాలు అనేకమార్లు తీర్పులిచ్చాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంతరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయినా ప్రభుత్వ టీచర్లకు ఇప్పటికీ న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ నిబంధనలను తెచ్చేందుకు 538, 505, 95, 96 జీవోలను తెచ్చాయని గుర్తు చేశారు. కామన్ సీనియార్టీ ప్రకారం పదోన్నతులివ్వడం రాజ్యాంగ విరుద్ధమంటూ తీర్పులిచ్చాయని తెలిపారు. 371-డీ ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు-1975ని సవరణలు చేస్తే అధికారం లేదంటూ హైకోర్టు తీర్పునిచ్చిందని వివరించారు. గత ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులు-2018ని తెచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలను రూపొందించారని తెలిపారు. దానిపై హైకోర్టు స్టే విధించిందని వివరించారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను వేరు చేయాలనీ, ఎవరి యాజమాన్యంలో వారు పనిచేయాలని కోరారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను జెడ్పీ సీఈవో పరిధిలోకి పంపాలని సూచించారు.

ఐదో తేదీ నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం

- పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రతను, పచ్చదనాన్ని పెంచేలా చర్యలు
- ఐదు రోజుల షెడ్యూల్‌ను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచేందుకుగానూ ఈ నెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నది. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఐదో తేదీన కార్యక్రమం ప్రారంభమవుతుంది. కలెక్టర్లు వీటి నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ బృందాల్లో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్, గ్రామసంఘాలకు చెందిన ముగ్గురు ఆఫీస్ బేరర్లు, జీపీ స్థాయి అధికారులు ఉంటారు. పట్టణ ప్రాంతాల్లో, వార్డు స్థాయిల్లో శాఖలకు సంబంధం లేకుండా వివిధ హెూదాల్లోని గెజిటెడ్ అధికారులు, ఆర్‌పీ, ఏఎల్ఎఫ్ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్/కార్పొరేటర్‌తో బృందాలు ఏర్పాటు చేస్తారు. కార్యకలాపాలను పర్యవేక్షించి రిపోర్టును కలెక్టర్‌కు ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు సమర్పించాలి. స్వచ్ఛదనం-పచ్చనం పేరును సూచించినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

మొదటి రోజు ఇలా..

స్థానిక నాయకులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, యువకులు, వార్డు కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించి ర్యాలీలు చేపట్టాలి. చెత్తను తడి-పొడిగా వేరు చేయటంతోపాటు వీధి కుక్కల సమస్యలపై స్వయం సహాయ బృందాల సభ్యులు చర్చించాలి. గృహాల నుంచి వ్యర్థాలను సేకరించి మార్గదర్శకాల ప్రకారం కంపోస్ట్ ఉత్పత్తి చేయాలి. పాఠశాలల్లో పారిశుధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు వంటి అంశాలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించాలి. అన్ని ప్రభుత్వ సంస్థలు, స్కూళ్లు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్‌స్టాప్‌లను శుభ్రం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్స్ లేని గ్రౌండింగ్ పనులు 15 రోజుల్లో చేపట్టాలి.

రెండోరోజు ఇలా..

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. ప్రతిరోజూ క్లోరినేషన్ చేయడంపై అవగాహన కల్పించాలి. క్లోరినేషన్ అయిన నీటినే సప్లై చేసేలా మూడు స్థాయిల్లో ఈ ప్రాసెస్ ను టెస్టింగ్ కిట్స్‌తో చెక్ చేయాలి. సోర్స్, మిడిల్ పాయింట్స్, ఎండ్ పాయింట్స్‌లలో పీపీఎం స్థాయిలను పరిశీలించాలి. అందుకు అవసరమైన క్లోరోస్కోప్స్ లేకుంటే కొనుగోలు చేయాలి. 300 చదరపు గజాల కంటే ఎక్కువ ఏరియా ఉన్న ఇండ్లను గుర్తించి ఇంటి యజమానులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా దిశానిర్దేశం చేయాలి.

ఏడోతేదీన ఇలా..

ఏడో తేదీన మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు గుర్తించి జాగ్రత్తా చర్యలు చేపట్టాలి. వరద నీరు నిలిచిపోకుండా తరలిపోయేలా సరైన కాలువల ఏర్పాటుచేయాలి. నీరు నిలువ ఉండకుండా లోతట్టు ప్రాంతాలు సురక్షితంగా ఉండేందుకు అనువుగా తక్షణం నీరు కొట్టుకుపోయేలా కాలువలను ఏర్పాటు చేయాలి. రోడ్ల గుంతలను తక్షణమే పూడ్చాలి.

8న కుక్కల బెడద..ప్రజారోగ్యంపై దృష్టి

డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ఆశాలతో కలిసి స్వయం సహాయ సంఘాల సభ్యులు ప్రచారం చేయాలి. స్కూళ్ల ప్రేయర్‌లో వీటిపై ప్రచారాన్ని నిర్వహించాలి. ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. వైద్యారోగ్య శాఖ అధికారులు అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలలో జ్వర సర్వే నిర్వహిస్తారు. ఏదైనా ప్రాంతంలో జ్వరాలు ఉన్నట్టు తేలితే అక్కడ ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీ లార్వాల్, ఫాగింగ్ వంటి చర్యలు తక్షణం చేస్తారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్ తయారు చేసి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఉపయోగించాలి. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కుక్కల సర్వే చేపట్టాలి. ఇందుకు పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్స్ మధ్య సరైన సహకారం ఉండాల్సిందే.

ఫ్రైడే..డ్రైడే

అన్ని పంచాయతీలు, మున్సిపాల్టీలు శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలి. శిథిలమైన భవనాలు, గోడలను తొలగించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాలను శుభ్రం చేయాలి. వనమహోత్సవంలో భాగంగా అన్ని పంచాయతీల్లోని, మున్సిపాల్టీల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలి. అటవీశాఖ సలహాలు, సూచనల మేరకు అడవిలోని జంతువులు తినేందుకు ఉపయోగపడే మొక్కలను అటవీ ప్రాంతాల్లో నాటాలి. స్కూళ్లు, ఇతర ప్రభుత్వ సంస్థలలో మొక్కలు నాటాలి. ప్రతి ఇంటికీ ప్లాంటేషన్ కింద కనీసం 6 మొక్కలు పంపిణీ చేయాలి. మునగ, కరివేపాకు, వేప, మామిడి, ఉసిరి, నేరేడు, చింత, దానిమ్మ లాంటి పళ్లిచ్చే మొక్కలు, ఔషధ గుణాలున్నమొక్కలు పంపిణీ చేయాలి.